# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

మంగళవారం, ఆగస్టు 25, 2026 | సంపుటి - 20 | సంచిక 326 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## ఇరాన్‌తో ఆట చివరికి వచ్చింది

### యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన



వాషింగ్టన్ : ఇరాన్‌ను ఒంటరిచేయడమే లక్ష్యంగా ఆ దేశంపై ఆర్థిక యుద్ధానికి సిద్ధమైంది అమెరికా. టెహ్రాన్‌కు సాయం చేసే దేశాలపై కఠిన ఆంక్షలు విధించనుంది. ఈ పరిణామాల వేళ అగ్రరాజ్య ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆట చివరికొచ్చిందని, ఇక ఆ దేశానికి ఆర్థిక వినాశనమేనని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలపై మేం గట్టి దెబ్బకొట్టాం. ఆ దేశ సైనిక ఫ్యాక్టరీలను 100శాతం ధ్వంసం చేశాం.

తరువాయి 2లో




## తెలంగాణ పెట్టుబడులను

# అడ్డుకునే కుట్ర

- గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోడీ
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం
- అమెరికా టూర్ రద్దును ఊరికే వదలబోం
- పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది
- నన్ను అడ్డుకున్నా..నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ మండిపాటు

హైదరాబాద్ : పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. అయితే, దురుద్దేశ పూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిం దని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. అయితే అందుకు విరుద్ధంగా కేంద్ర విధానాలు ఉన్నాయని అన్నారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత సోమవారం మీడియా సమావే శంలో మాటాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మోదీ ఇంకా గుజరాత్ ముఖ్య మంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శిం ఓచారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని 2లో



### కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనలో

## కొండా సుష్మిత వ్యవహారం

- కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం
- సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్
- మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్

మెదక్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఏఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట.

తరువాయి 2లో

# ఆయుధాలు సమకూర్చుకుంటున్న పాకిస్థాన్

- ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేలా ప్రణాళికలు
- టర్కీ నుంచి ఆయుధాలు సేకరిస్తున్నట్లు అనుమానాలు
- మక్కా ఒప్పందలోకి ఇరాన్‌కు ఆహ్వానం

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ తరవాత పాకిస్తాన్ తీరు అనుమానాస్పదంగా ఉంది. అంతర్జాతీ యంగా ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు కూడా అనుమానాలు కలిగిస్తున్నాయి. మొత్తంగా పాకిస్తాన్ ఏదో భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్గతంగా ఉన్న సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు భారత్‌పై యుద్ధం చేయాలని భావిస్తుందా. ..అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ టర్కీ నుంచి భారీగా ఆయుధాలు దిగుమతి చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్‌లో కీలక వైమానిక స్థావరమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌కు టర్కీ సైనిక విమానాల రాకపోకలు పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా సీ-130 హెర్క్యులెస్ విమానాలు రావల్పిండిలోని నూర్ ఖాన్, కరాచీలోని మసూర్ వైమానిక స్థావరాలకు వచ్చినట్లు తెలుస్తోంది.

తరువాయి 2లో



### కళ్యాణ లక్ష్మి కేసులో

## ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు 2లో



### మహిళలకు తమిళ సీఎం

## విజయ్ వరాలు

- మహిళలకు తమిళ సిఎం విజయ్ వరాలు
- ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల ప్రకటన
- ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచిత బస్సు సౌకర్యం

చెన్నై : తమిళనాడు అసెంబ్లీ వేదికగా మహిళలపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వరాల జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా

తరువాయి 2లో

### శాసనసభ కమిటీలకు


# ఎంతో ప్రాధాన్యం



- ఆయా వర్గాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి
- బడ్జెట్ కేటాయింపులు సమీక్షించుకోవాలి
- శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం ప్రసాద్

హైదరాబాద్ : ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని, ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.

తరువాయి 2లో



## పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న దాహార్తి**

పులివెందుల : జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళ్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు కళ్యాణ్ పత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. 2లో

### ఫుడ్ ప్రాసెసింగ్‌తో

# పంటలకు విలువ జోడిద్దాం



- అంతర్జాతీయ మార్కెట్లకు మన వ్యవసాయ ఉత్పత్తులు
- ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో గ్లోబల్ బ్రాండ్లుగా మారాలి
- దేశీయ రకం హైబ్రీడ్ పాప్ కార్న్ మొక్కజొన్న విత్తనాలు విడుదల
- ఉపరాష్ట్రపతితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

నూజివీడు : మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మె పాప్ కార్న్‌కా నాన్ జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

తరువాయి 2లో

## ఇరాన్‌తో ఆట చివరికి వచ్చింది

అణు కార్యక్రమాన్ని సమాధి చేశాం. ఇక ఆట చివరికొచ్చింది. ఏ శత్రువుపైనా ఇప్పటివరకు చేపట్టని అతిపెద్ద ఆర్థిక యుద్ధాన్ని ప్రారంభించబోతున్నాం. భద్రతా హామీల ముసుగులో ఇన్నాళ్లు ఇరాన్ బెదిరింపులు చేస్తూ మనుగడ సాగించింది. అమెరికా తమనేమీ చేయలేదని భావించింది. కానీ, ఇప్పుడు ట్రంప్ హయాంలో ఆ శకం ముగిసింది. టెహ్రాన్‌ను ఒంటరి చేసేవరకు.. ఆ నిరంకుశ పాలనను నిలబెడుతున్న ప్రతి ఆర్థిక జీవనాధారాన్ని తెంచడమే మా లక్ష్యం అని స్కాట్ బెసెంట్ రాసుకొచ్చారు. ఇరాన్‌కు ఆర్థికంగా సహకారం అందిస్తోన్న దేశాలు తీవ్ర పర్యవసనాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇటీవల ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దేశంతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే ప్రతి సంస్థ, ఏజెన్సీని తాము లక్ష్యంగా చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ఆర్థిక యుద్ధం సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్కాట్ బెసెంట్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం


ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్, బీజేపిలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు బీఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

## మహిళలకు తమిళ సిఎం విజయ్ వరాలు

పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉచిత ఎల్‌పీజీ సిలిండర్ల పథకాన్ని వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. అలాగే రాష్ట్ర ఖజానాపై ఏడాదికి సుమారు రూ.4,000 కోట్ల వ్యయం పడనుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరిస్తూ 'వెట్రి పయన తిట్టం' పథకాన్నీ సీఎం విజయ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రకటించడంతో పాటు మహిళల కోసం దీని పరిధిని విస్తరించారు. ఇకపై ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్, డీలక్స్ సర్వీసుల బస్సుల్లోనూ మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. ఉచిత ప్రయాణం పొందేందుకు ఆదాయ పరిమితి, ప్రయాణాల సంఖ్యపై ఎలాంటి నిబంధనలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. కాగా, గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి ఈ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. అలాగే, అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. చెన్నై శివార్లలోని పరందూర్‌లో రెండో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను తమ ప్రభుత్వం విరమించుకుంటున్నట్లు తెలిపారు. విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్న వారికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. 'పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నాం. ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నిరసనకారులకు నేను అండగా ఉంటా' అని విజయ్ పేర్కొన్నారు.

## పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం

గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణంఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ చూపలేదు. చేపట్టిన పనుల్లో కూడా నాణ్యత లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కూడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కూటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది. అప్పటి నుంచి కళ్యాణ్ ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కూడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కూడా దాదాపు తుది దశకు చేరింది. కూటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.



# తెలంగాణ పెట్టుబడులను అడ్డుకునే కుట్ర

పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చిందని అన్నారు. అందుకే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ జోడిద్దాం

గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్‌కా సంస్థ ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద జన్యుమార్పిడి కాని ఎక్స్ పాండబుల్ పాప్ కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉపరాష్ట్రపతితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ..." రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు. యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్ కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలి. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. కొండవీటి కొయ్య బొమ్మలు లాంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతుల్ని ఎంట్రప్రెన్యూర్లుగా చూస్తున్నాం. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.'ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిలో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. ప్రాసెసింగ్ పెంచితే అధిక సంపదను ఆర్జించే అవకాశం ఉంటుంది. ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామిక వేత్త రావాలి. మన వద్ద ఉత్పత్తి అయ్యే వాటిని గ్లోబల్ ప్రాడెక్టుగా అభివృద్ధి చేయాలి. ఆహారపు అలవాట్ల అనుగుణంగా పంటలు కూడా మారాలి. నూజివీడు వద్ద ఇప్పుడు పామాయిల్, కోకో ఆక్వా లాంటి వాణిజ్య పంటలు పెరిగాయి. వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల్లో మనం అగ్రగామిగా మారాం. వచ్చే 20-30 ఏళ్లలో ఎలాంటి పంటలు ఉండాలి, ఎలాంటి ఆర్థిక వ్యవస్థ ఉండాలో మనం నిర్దేశించు కుందాం. రాయలసీమను కూడా ఉద్యాన పంటల హబ్ గా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. రూ.1 లక్ష కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను అభివృద్ధి చేస్తున్నాం. రూ.35 వేల కోట్లతో 36 సాగు ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఈ ప్రాంత భవిష్యత్తు కూడా మారుతుంది. వెలిగొండ ప్రాజెక్టు ను ఈ నెలాఖరులోనే ప్రారంభించి మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాకు నీరు ఇస్తాం. ఎల్ నినో వల్ల నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. పప్పు ధాన్యాల లాంటి ప్రత్యామ్నాయ పంటలు వేసేలా చర్యలు చేపట్టాం. రైతులు కూడా సహకరించి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిస్తున్నాను. నీటి భద్రత సాధించి ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చేలా చర్యలు చేపడతాం. దేశం అంతా నదుల అనుసంధానం జరిగి నీటి సద్వినియోగం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన. గోదావరి- కృష్ణా, తుంగభద్ర, పెన్నా- కావేరీ నదులను అనుసంధానించటం ద్వారా 4 రాష్ట్రాల్లో సమస్య పరిష్కారం అవుతుంది. కష్టకాలంలో అన్ని ప్రాంతాల్లో ఆయకట్టు స్థిరీకరణ, తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. గంగా, మహానది, గోదావరి నదుల్ని కూడా అనుసంధానించుకుంటే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోగలం. అప్పుడు దేశానికి తిరుగులేదు. నీటి భద్రత సాధిస్తే దేశ అభివృద్ధి అన్ స్టాపబుల్." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నారాలోకేష్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి తదితరులు హాజరయ్యారు.

## శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానిటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... తాను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించానన్నారు. తెలంగాణ ఎప్పటినుంచో 'గంగా- జమున తెహజీబ్'కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు మరియు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో శాసనమండలి మైనారిటీల సంక్షేమ కమిటీ,షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సమావేశమయ్యింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ లు హాజరయ్యారు. మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్ కూడా హాజరయ్యారు. శాసనమండలి ఎస్‌సి వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం , సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్యలు, శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో చైర్మన్, స్పీకర్, మరియు సెక్రటరీలు అభినందనలు తెలిపారు.

## ఆయుధాలు సమకూర్చుకుంటున్న పాకిస్థాన్

ఆగస్టు 19 నుంచి 21 వరకు టర్కీకి చెందిన ఎ-130 విమానాలు పాకిస్తాన్‌కు వచ్చి వెళ్లాయి. దీనిని భారత నిఘా వర్గాలు అసాధారణ పరిణామంగా గుర్తించింది. ఈ విమానాల ద్వారా పాకిస్తాన్ డ్రోన్లు, డ్రోన్ సంబంధిత పరికరాలు, ఇతర సైనిక సామాగ్రి తరలించి ఉండొచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. ఇదే కాకుండా చైనా నుంచి కూడా భారీగా ఆయుధాల దిగుమతి జరుగుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ పొందిందనే వాదన కూడా ఉంది. అయితే, ఈ ఆయుధాలు లేదా డ్రోన్ల సరఫరాపై పాకిస్తాన్ లేదా టర్కీ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. అయితే, టర్కీ డ్రోన్లపై పాక్ ఎప్పటి నుంచో ఆసక్తి చూపిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ టర్కీ డ్రోన్లను భారత్‌పై వాడింది. వీటన్నింటిని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఇప్పటికే బైరక్టర్ టీబీ2 డ్రోన్లు పాక్ వద్ద ఉన్నాయి. గతంలో భారత్ తో సైనిక ఘర్షణ సమయంలో టర్కీ తన డ్రోన్ ఆపరేటర్లను కూడా పాకిస్తాన్‌లో మోహరించింది. ప్రస్తుతం పాక్ తన మానవరహిత వైమానిక సామర్థ్యాలను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ఎక్కువసేపు గాల్లో ఉండగల డ్రోన్లు, లాయిటరింగ్ మ్యునిషన్ వంటి వ్యవస్థల్ని సమకూర్చుకుంటోంది. మరోఇవైపు పశ్చిమాసియాలో ఘర్షణల వేళ పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. ఇంకా పలు దేశాలు ఈ మక్కా ఒప్పందం లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందంలో చేరాలని ఇరాన్ కు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. తమకు అందిన ఆహ్వానం పై సమీక్ష జరుపుతున్నామని, ఇది టెహ్రాన్‌కు దక్కిన విజయమని ఇరాన్ కీలకనేత మెహ్దీ రహీమీ పేర్కొన్నట్లు పశ్చిమాసియాలోని మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఇరాన్ విదేశాంగశాఖ ఈ ఆహ్వానాన్ని ధ్రువీకరించాల్సి ఉంది. సౌదీ అరేబియాకు ఇరాన్ అనుబంధ గ్రూప్ హూతీలకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాంటప్పుడు ఇరాన్‌కు ఈ ఆహ్వానం వెళ్లి ఉంటుందా..? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. అణ్వస్త్ర దేశమైన పాకిస్థాన్, నాటో సభ్య దేశమైన తుర్కియే, చమురు నిల్వలతో సుసంపన్నమైన సౌదీ అరేబియా మధ్య జరిగిన సంయుక్త రక్షణ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా చర్చల్లో నిలిచింది. నాటో కూటమి మాదిరిగానే 'సభ్య దేశాల్లో ఏ ఒక్కదానిపై దాడి జరిగినా అది తమందరిపై జరిగిన దాడిగా మిగిలినవి భావిస్తాయి' అనే నిబంధనను ఈ ఒప్పందంలో చేర్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం పశ్చిమాసియాలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఈ ప్రాంత దేశాలు అమెరికా రక్షణ ఛత్రం నుంచి క్రమంగా బయటకు రావాలని చూస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇరాన్ ఈ ఒప్పందంలో చేరితే.. హూతీలపైనే దాడులు చేయాల్సి ఉంటుంది. అందుకే ఈ ఆహ్వానం ఏమేరకు ఫలిస్తుందో చూడాలి.

## కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

## వెంటిలేటర్ పేలి ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

### ముగ్గురు నవజాత శిశువుల మృతి

ముంబై,ఆగస్ట్24 : మహారాష్ట్రలోని అమరావతిలో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. అమరావతి జిల్లా మహిళా ఆస్పత్రిలో మంటలు చెలరేగి ముగ్గురు నవజాత శిశువులు మృతిచెందగా.. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రి మూడో అంతస్తులోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో 39 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. అయితే, తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో వెంటిలేటర్ ఒక్కసారిగా పేలడంతో మంటలు చెలరేగాయి. నిమిషాల్లో ఎల్ఎన్‌సీయూ మొత్తం వ్యాపించాయి. దీంతో పొగ పీల్చడం, తీవ్రమైన కాలిన గాయాలు కారణంగా ముగ్గురు శిశువులు ప్రాణాలు కోల్పోయారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే వైద్యులు, నర్సులు, ఇతర ఆస్పత్రి సిబ్బంది వార్డుకు చేరుకుని చిన్నారులను కాపాడారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురు నవజాత శిశువులను చికిత్స నిమిత్తం సమీపంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

## హర్యానాలో దిగ్భ్రాంతికర ఘటన

### భర్తను చంపి పేగులూడదీసిన భార్య

చండీఘడ్,ఆగస్ట్24 : హర్యానాలోని కురుక్షేత్రలో జరిగిన ఒక దిగ్భ్రాంతికర హత్య కేసు వెలుగులోకి వచ్చింది. ఒక మహిళ తన భర్తను చంపి, అతడి పేగులు బయటకు తీసి దారుణానికి పాల్పడింది. ఆ తర్వాత ఇంటి యజమాని చూశాడనే భయంతో భయాందోళనకు గురై ఇంటి పైకప్పు మీది నుంచి కిందకు దూకేసింది. ప్రస్తుతం ఆమె హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. కురుక్షేత్రలోని పెహోవా రోడ్డులో ఉన్న రాజ్ ప్యాలెస్ సమీపంలో రాజేష్, విమలా దేవి ఓ అ÷-దదె ఇంట్లో నివసిస్తున్నారు. ఇటీవల రాజేష్, విమలా దేవి ఏదో విషయమై గొడవపడ్డారు. ఆ గందరగోళాన్ని విని ఇంటి యజమాని రింకు డాబా మీదకు పరుగెత్తాడు. అక్కడ అతడు చూసిన దృశ్యం అచ్చం క్రైమ్ సినిమాలోని సన్నివేశంలా ఉంది. రాజేష్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అతడి శరీరం నుంచి బయటకు వచ్చిన పేగులను విమల ఒక సంచిలో పెడుతోంది. ఇంటి యజమానిని చూడగానే ఆ మహిళ భయాందోళనకు గురైంది. వెంటనే టెర్రస్ పై నుంచి కిందకు దూకేసింది. గాయపడిన నిందితురాలిని ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స జరుగుతోంది. పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పదునైన ఆయుధాలతో రాజేష్ పొట్టను సుమారు 35 సెంటీమీటర్ల మేర కోసి, లోతైన గాయాలు చేసినట్లు పోస్ట్‌మార్టంలో తెలిసింది. ఘటనా స్థలం నుంచి మూడు కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### తల్లిదండ్రులను చంపిన యువతి ఆత్మహత్య

సంగారెడ్డి,ఆగస్ట్24 : జనవరిలో ప్రేమించిన ప్రియుడి కోసం తల్లిదండ్రులకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి హతమార్చిన సురేఖ అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులను పొట్టనపెట్టుకున్న మత్తు ఇంజెక్షన్‌తోనే తన ప్రాణం కూడా తీసుకుంది. వివరాల్లోకెళితే...వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలోని యాచారం గ్రామానికి చెందిన సురేఖ సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న సమయంలో ఓ యువకుడిని ప్రేమించింది. తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెప్పగా.. వారు నిరాకరించారు.

## అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే అంతే సంగతులు

**ఒక్కచుక్క చమురును కూడా సరఫరా కానివ్వం**

**ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు**

న్యూఢిల్లీ : అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక్ డీ-డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటామని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

## హెచ్‌ఎండిఎ కమిషనర్‌తో రఘునందన్ రావు భేటీ

**పెండింగ్ రోడ్డు, రైల్వే పనుల పూర్తికి అభ్యర్థన**

హైదరాబాద్,ఆగస్ట్24 : మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలపై హెచ్‌ఎండీఏ కమిషనర్, మెట్రో రైల్వే మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసి చర్చించినట్లు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తెలిపారు. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు పొడిగింపు అంశంపై చర్చించడం జరిగింది. పటాన్‌చెరు ఎగ్జిట్-3 నుంచి ఎగ్జిట్-4, సుల్తాన్‌పూర్ మధ్య పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరడం జరిగింది. కొల్లూరు ఎగ్జిట్-2 వద్ద పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరడం జరిగిందని అన్నారు.

## నకిలీ డిఎస్పీగా ప్రజలకు టోపీ

**రూ.1.20 కోట్లు వసూళ్లు**

**వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన పోలీసులు**

హైదరాబాద్,ఆగస్ట్24 : నగరంలో నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి అమాయకులను మోసం చేస్తున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును హైదరాబాద్ సీసీఎస్ ఈఓడబ్ల్యూ బృందం అరెస్ట్ చేసింది. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుంటూ తనకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి బాధితులను తన వలలోకి లాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఓ బాధితుడి నుంచి ఏకంగా రూ.1.20 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీలోనూ పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు నిందితుడి పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ హోదాలు, అధికారుల పేర్లు ఉపయోగించుకుని బాధితుల్లో నమ్మకం కలిగించి డబ్బులు దండుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 2021 నుంచి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న కేవీపీ రాజును ఎట్టకేలకు సీసీఎస్ ఈఓడబ్ల్యూ అధికారులు అరెస్ట్ చేశారు. కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజుపై ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ డీఎస్పీగా తనను తాను పరిచయం చేసుకుంటూ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి ద్వారా మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నారా, అతడి మోసాల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అరెస్ట్ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

## సారంపల్లి మృతికి సిఎం రేవంత్ సంతాపం

హైదరాబాద్,ఆగస్ట్24 : రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు నాయకుడు, కమ్యూనిస్టు నేత సారంపల్లి మల్లారెడ్డి గారు మరణించారని తెలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రైతుల హక్కులు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ముందుండి అనేక ఉద్యమాలు నడిపించారని గుర్తుచేశారు. రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణాలు, విత్తనాలు వంటి వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత అంశాలపై నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని రైతుల సంక్షేమం కోసం అంకితం చేసిన నాయకుడు మల్లారెడ్డి గారని పేర్కొన్నారు. సారంపల్లి మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులకు ముఖ్యమంత్రి గారు సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# శ్రీశైలం నీళ్లు ఎత్తిపోస్తుంటే ఏం చేస్తున్నారు




హైదరాబాద్,ఆగస్ట్24 : కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. నీటిమట్టాలు తక్కువగా ఉన్నా వివిధ ఛానళ్ల ద్వారా నీళ్లను ఎపి తరలిస్తున్నా తెలంగాణ చోద్యం చూస్తోందని అన్నారు. తెలంగాన భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు. ఒకవైపు శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 854 లెవల్‌లో గేట్లు తెరిస్తే పోతిరెడ్డి పాడు, పక్కన మల్యాల, హంద్రినీవా ఇది ఒక సిస్టమ్.. మరోవైపు అదే శ్రీశైలం ప్రాజెక్టులో 840 అడుగుల వద్దే ఒక టన్నెల్ 19.2 కిలోమీటర్ల టన్నెల్‌ను తవ్వి ముందుకు తీసుకొని పోయి రిజర్వాయర్‌ను కట్టారు. దాని పేరు నల్లమల సాగర్ అని అన్నారు. 43 టీఎంసీల యూజబుల్ వాటర్ అని వాళ్లు లెక్క చెబుతున్నరు. కానీ అది 53 టీఎంసీల రిజర్వాయర్. కట్టేశారు.. టన్నెల్స్ అయిపోయాయి. ఇప్పుడు వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి టన్నెల్ దగ్గర ఉండేట్వంటి అప్రోచ్ కెనాల్ అక్కడుండే గేట్లు తెరిస్తే చాలు.. శ్రీశైలం నీళ్లు 854 లెవల్ పోతిరెడ్డిపాడు అయిపోగానే.. శ్రీశైలం 854 లెవల్‌కు డౌన్ అయింది అంటే 840 లెవల్‌లో ఉండే వెలిగొండ రిజర్వాయర్ ద్వారా నీళ్లు తీసేస్తరు. నాలుగున్నర లక్షల ఎకరాల కోసం ప్రకాశం జిల్లా మార్కాపురం ఏరియా, నెల్లూరు, కడప జిల్లా కలిపి 33 మండలాల్లో నాలుగున్నర లక్షల ఎకరాలకు ఉద్దేశించినట్వంటి ఈ వెలిగొండ ప్రాజెక్టును ఆగస్టు 31న వాళ్లు ప్రారంభోత్సం చేసుకోవడానికి ఏర్పాటు చేసుకుంటున్నరు. ఎక్కడ పడుకుంటున్నవ్ రేవంత్ రెడ్డి.. ఎక్కడున్నవ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఏం చేస్తున్నరు మీరు.. ? అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఉన్న నీళ్లు నల్లగొండకు, పాలమూరుకు ఇయ్యనీకే చేతనైతలేదు. పాలమూరు-రంగారెడ్డి తయారై ఉన్న సిస్టమ్‌ను ఆపరేట్ చేయడానికి చేతనైతలేదు మీకు.. మిగిలిన పనులు పూర్తి చేయనీకి చేతనైత లేదు. అది కూడా మనం దిగువన పెట్టిన వనరు. వాళ్లకు 854 లెవల్, 840 లెవల్ వచ్చే కంటే ముందే 802లో ఉండే సిస్టమ్‌ను వాడుకునేట్వంటి తెలివిలేని, చేతగాని అసమర్థ ప్రభుత్వం ఇదన్నారు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. అసమర్థత ముఖ్యమంత్రి, అసమర్థ సాగునీటి మంత్రి, జిల్లా మంత్రులకు సోయే లేదు.. ఈ విషయాల మీద అవగాహనే లేదు. వీళ్లు శ్రీశైలం దగ్గరకు పోయి ధర్నా చేస్తరట. మీళ్లు ఒక ప్రభుత్వంగా చేయాల్సింది ఏది.. ఏపీ ప్రభుత్వం ఆగడాల మీద కేంద్ర జలశక్తి దగ్గరనో, కృష్ణా వాటర్ బోర్డు మేనేజ్‌మెంట్ దగ్గరనో చట్టపరంగా అవసరమైతేనో మీరు ఆందోళన చేయాలి కదా.. మీ ఆందోళ రికార్డు చేయాలి కదా అన్నారు. ఇది కాకుండా ప్రభుత్వంలో ఉండే మంత్రి అక్కడికి పోయి ధర్నా చేస్తడట. పిల్లను సంకలో పెట్టుకుని ఊరంతా దేవులాడిండట వెనకటికి ఎవడో.. శ్రీశైలం నీళ్లు నీ దగ్గర ఉన్నయి వాడమంటే వాడటం చేతనైత లేదు కానీ.. వాళ్లు కట్టిన ప్రాజెక్టులు, కట్టడానికి పూనుకున్న ప్రాజెక్టులు ఎలాంటి అనుమతులు లేనవి. నీటి కేటాయింపులు లేనివి. రేపు బ్రిజేశ్‌కుమార్ ÷నైల్ అవార్డులో వాళ్లకు కేటాయింపులు ఏ మేరకు జరుగుతాయో ఆ మేరకు వాళ్లు వాళ్ల సిస్టమ్స్‌ను వాడుకుంటరు. ఆ సిస్టమ్‌ను మనం పోయి చేయగలిగేదేం లేదు. కానీ మనకు కేటాయించిన మందమైనా వాడుకునేందుకు సిస్టమ్‌ను మీరెందుకు పెండింగ్‌లో పెట్టినట్టు అని ప్రశ్నించారు.

## సెప్టెంబర్ 11న బ్యాంక్ యూనియన్ల సమ్మె

**వరుస సెలవులతో కస్టమర్లకు ఇబ్బందులే**

న్యూఢిల్లీ,ఆగస్ట్24 : దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలంటూ బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక డిమాండ్ చేస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చుకునేందుకు సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఆ రోజున సమ్మె జరిగితే.. బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా నాలుగురోజుల పాటు అంతరాయం కలగనుంది. సెప్టెంబర్ 11న శుక్రవారం. తర్వాత రెండో శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవులు. ఇక సోమవారం14న వినాయక చవితి కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల బ్యాంకు కార్యకలాపాలు నడవవు. అలా నాలుగురోజుల పాటు బ్యాంక్ సేవలు అందక ప్రజలు కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది. 11వ తేదీతోపాటు సెప్టెంబర్ 28 నుంచి మూడురోజుల పాటు మరోసారి సమ్మె చేస్తామని యూనియన్ హెచ్చరించింది. సెప్టెంబర్ 30తో ఆర్థిక సంవత్సరం సగం పూర్తవుతుంది. అప్పుడు అన్ని సంస్థలు తమ ఖాతా పుస్తకాలను సరిచూసుకుంటాయి. వారానికి ఐదు రోజుల డిమాండ్‌తో పాటు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకం, పింఛను విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని బ్యాంక్ సిబ్బంది కోరుతున్నారు. ఇప్పటికే రెండో, నాలుగో శనివారం సెలవులు ఇస్తున్నారు. మరో రెండు సెలవులు ఇస్తే అలా నెలలో ఐదురోజుల పనిదినం అమలవుతుంది. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే.. అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. సమావేశంలో బ్యాంక్ యూనియన్ల సభ్యులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

## ప్రైవేట్ సంస్థలకు ఇస్రోలో స్థానం

**ఇస్రో భవిష్యత్‌పై జైరామ్ రమేశ్ ఆందోళన**

న్యూఢిల్లీ,ఆగస్ట్24 : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో భవితవ్యంపై రాజకీయ దుమారం మొదలైంది. ఇస్రోను మోదీ సర్కారు బలహీనపరుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరామ్ రమేష్ ఆరోపించారు. ఆరు దశాబ్దాలుగా ఇస్రో నిర్మించుకున్న సామర్థ్యాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఇస్రో భవిష్యత్ పాత్రకు సంబంధించి ఇటీవల వెలువడిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. రాకెట్ల తయారీ, ప్రయోగ వాహనాల ఉత్పత్తిలో ఇస్రో పాత్రను గణనీయంగా తగ్గించి, ప్రైవేట్ సంస్థలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించే దిశగా ప్రభుత్వం వెళ్తోందని ఆయన ఆరోపించారు. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల కృషితో ఇస్రో ఆరు దశాబ్దాలుగా అభివృద్ధి చేసుకున్న సామర్థ్యాలను, మౌలిక వసతులను ప్రైవేట్ రంగానికి అప్పగించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రైవేట్ అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రపంచ స్థాయి ప్రతిభను భారత్‌కు ఆకర్షించేలా బలమైన అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని పిలుపునిచ్చారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇస్రో క్రమంగా ప్రయోగ వాహనాల తయారీ, సాధారణ ఉపగ్రహాల తయారీ నుంచి దూరమవుతున్నట్టు విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## నిర్మల్‌లో ఇద్దరు, యాదాద్రిలో ఎసిబికి చిక్కిన నలుగురు

**లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఎసిబి అధికారులు**

నిర్మల్/యాదాద్రిభువనగిరి,ఆగస్ట్24 : వేర్వురు చోట్లు నలుగురు అధికారులు ఎసిబికి చిక్కారు. వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు పన్నుల శాఖాధికారులు ఏసీబీ కి పట్టుబడ్డారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం పన్నుల శాఖ నిర్మల్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు నుంచి రూ. 50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఎస్‌టీవో కొప్పెల గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయికృష్ణను ఆదిలాబాద్ రేంజ్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధిన ఆడిట్ లెక్కల వ్యవహారంలో అనుకూలంగా నివేదికను తయారు చేయాలని మంచిర్యాల పట్టణానికి చెందిన జువెల్లరి దుకాణపు యజమాని లక్కింశెట్టి వీర భాస్కర రావు ఎస్టీవో అధికారులను సంప్రదించాడు. దీంతో ఇద్దరు అధికారులు మొదల లక్ష రూపాయలు డిమాండ్ చేసి చివరకు రూ. 50వేలకు ఒప్పందం చేసుకున్నారు. అనంతరం ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ముందస్తు వ్యూహం ప్రకారం సోమవారం ఇద్దరు అధికారులను పట్టుకున్నారు. అవినీతికి పాల్పడ్డ ఇద్దరిని కోర్టులో హాజరుపరిచామని వెల్లడించారు. ఇకపోతే అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. సోమవారం ఉదయం నిర్మల్ జిల్లాలో ఇద్దరు ఏసీబీకి పట్టుబడగా యాదాద్రి జిల్లాలో మరో ఇద్దరు లంచం తీసుకుంటూ పట్టు బడ్డారు. జిల్లాలోని ఆలేరు మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వేముగంటి పూర్ణచందర్ రావు, గ్రామ పాలనాధికారి షేక్ అహ్మద్ ఫిర్యాదుదారుడు నుంచి రూ.14 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులకు ఫిర్యాదుచేశాడు. దీంతో ఏసీబీ అధికారుల సూచన మేరకు ఫిర్యాదుదారుడు లంచం ఇస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

## ఇంజనీరింగ్ విద్యార్థికి ఉగ్రలింకులు

**అరెస్ట్ చేసి ప్రశ్నిస్తున్న ఎన్‌ఐఎ**

పెద్దపల్లి,ఆగస్ట్24 : పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో ఉగ్ర లింకులు కలకలం రేపాయి. అయోధ్య నగర్‌లో నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) తనిఖీల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో రామగుండానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను ఎన్ఐఎ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముజామిల్ ఖాన్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ముజామిల్‌ను ఎన్ఐఏ అధికారులు.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. అతడి కార్యకలాపాలు, పరిచయాలు, ఉగ్రవాద సంస్థలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

**ప్రభుత్వానికి మానవహక్కుల కమిషన్ ఆదేశాలు**

హైదరాబాద్,ఆగస్ట్24 : తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలపై కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తగిన తరగతి గదులు, మరుగుదొడ్లు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద, వరండాల్లో, కమ్యూనిటీ భవనాల్లో తరగతులకు హాజరవుతున్నారంటూ ప్రచురితమైన వార్త ఆధారంగా కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది. కమిషన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, జనగాం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి నివేదికలు అందాయి. ఆయా నివేదికలను పరిశీలించగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, మరమ్మతులు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్ల కొరత వంటి మౌలిక వసతుల లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. నల్గొండ జిల్లా, నిడమనూరు మండలం, ఊట్కూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పరిశీలించినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పాత రేకుల పైకప్పు తరగతి గదుల్లో లీకేజీలు ఏర్పడటంతో, మరమ్మతులు జరుగుతున్న సమయంలో విద్యార్థులను తాత్కాలికంగా చెట్ల కింద కూర్చోబెట్టి తరగతులు నిర్వహించినట్లు నివేదికలో వెల్లడించారు. విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఇతర ప్రాథమిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కమిషన్ స్పష్టం చేసింది. విద్యా హక్కు కేవలం పాఠశాలలో ప్రవేశం కల్పించడంతో పరిమితం కాదని, పిల్లలు సురక్షితమైన, గౌరవప్రదమైన, అనుకూలమైన వాతావరణంలో విద్యను అభ్యసించే పరిస్థితులు కూడా అందులో భాగమేనని కమిషన్ పేర్కొంది. మిషన్ పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రాథమిక సౌకర్యాలపై నివేదికలు కోరాలని సిఫారసు చేసింది. అలాగే ఈ అంశాన్ని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి, ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన తరగతి గదులు, పనిచేసే మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు, అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు తక్షణ మరియు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది. చర్యల వివరాలను ఆరు నెలల్లోగా కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

## క్రమశిక్షణ కమిటీకి కొండాసురేఖ వ్యవహారం

**ఇందులో ఎవ్వరు కూడా ఇక మాట్లాడొద్దు**

**సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు**

**రాజకీయ వ్యవహారాలపై ప్రజాపతినిధులతో రేవంత్ చర్చ**

హైదరాబాద్,ఆగస్ట్24 : కాంగ్రెస్ పార్టీ నియమాలకు నేతలంతా కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసుల అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా సీఎం స్పందించారు. పార్టీలోని నేతల క్రమశిక్షణ వ్యవహారాల గురించి నేను చర్చించను. ఆ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది. అన్నీ పరిశీలించి కమిటీ చర్యలు తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశం అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలో జరిగిన తాజా రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ అంశంపై ఎవరూ మాట్లాడొద్దని.. ఇకపై ఆ విషయాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని చెప్పారు. సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణను నిర్లక్ష్యం చేయొద్దని నేతలకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్ భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ నిధులను వెంటనే విడుదల చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావన్నారు. భూసేకరణ, ఫారెస్టు క్లియరెన్సులకి సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టండని ప్రతినిధులకు సూచించారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్ లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్లపల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగ మాయి, మందల సామేల్,వేద్మ బొజ్జు,కోరం కనకయ్య, లక్ష్మి కాంత రావు,రామ్ దాస్ నాయక్,కడియం శ్రీహరి,డాక్టర్ సంజయ్,బత్తుల లక్ష్మారెడ్డి,మనోహర్ రెడ్డి,తెల్లం వెంకట్ రావు , నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీ లు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు పాల్గొన్నారు.

## అపార్ట్‌మెంట్ ఐదో అంతస్థు నుంచి దూకిన యువతి

**అక్కడిక్కడే మృతి...దర్యాప్తు చేపట్టిన పోలీసులు**


హైదరాబాద్,ఆగస్ట్24 ): హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో విషాదం చోటుచేసుకుంది. డిప్రెషన్‌తో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కేపీహెచ్‌బీ ఎస్సై శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కానూర్‌కు చెందిన సోను పురుషోత్తమన్, శీతల్ భార్యాభర్తలు. ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల చిన్నారి ఉంది. పురుషోత్తమన్ ఎస్‌బీఐలో డీఎంగా పనిచేస్తున్నారు. భార్య, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో ఉంటున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో శీతల్ (32) టెర్రస్ ఎక్కే మెట్లపై 10 నిమిషాలు పాటు కూర్చుంది. తర్వాత టెర్రస్ పైకి ఎక్కి అపార్ట్‌మెంట్ గేటు ఆవరణలోకి దూకేసింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ బలవన్మరణానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఆమె భర్తతో పాటు కేరళలో ఉన్న సోదరుడితోనూ మాట్లాడారు. శీతల్ కొంత కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతోందని.. దీనికి మందులు వినియోగిస్తున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. కేరళలో ఉన్న శీతల్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

# సంపాదకీయం

## ధరాఘాతంపై సమీక్షించని పాలకులు

పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల సమస్యలు పట్టడం లేదు. ఓట్లకోసం పథకాలను తీసుకుని వెళ్లడం, మధ్యతరగతి ప్రజలపై భారం మోపం తప్ప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారడం లేదు. రాజకీయ పార్టీలు కూడా ఉచిత హామీలపై పాలక పార్టీలను నిలదీయడం తప్ప, ధరలఅపై ధర్నాలు చేసిన సందర్భాలు కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెవలడమెలా అన్న ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు న్నారు. ఇందుకు అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కేంద్రంలోని బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ తీరు కూడా అదే విధంగా ఉంది. తాము చేసిందే పాలన అన్న విధంగా ప్రచారం చేసుకుంటు న్నాయి. నిత్యావసర ధరలు మొదలు, సిమెంట్, విమానయాన ధరుల అందనంత ఎత్తుకు పోతున్నాయి. దీంతో పేద మధ్యతరగతి ప్రజలు నకరయాతన పడుతున్నారు. ఒకటని లేకుండా క్రమంగా ధరలు పెంచే స్తున్నారు. చక్కెర, బెల్లం, పూలు, పండ్లు.. ఇలా ప్రతి వస్తువు ధర అమాంతం పెరిగిపోతోంది. ఎల్‌నినో బూచి చూపి ఫైన్ రైస్ రకం బియ్యం అమాంతంగా పెంచేశారు. కిలో 80 రూపాయాలకు బియ్యం ధరలు ఎగబాకాయి. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం..కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థలో ఒత్తిడి.. ధరల పెరుగుదలకు కారణాలని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ అవసరాలకు మించి సేకరించిన ధాన్యం సుమారు 20 లక్షల టన్నుల వరకు ఉండగా..అందులో అధిక మొత్తంలో సన్నాలే ఉన్నాయి. ఈ వడ్లను వేలంలో అమ్మే పక్రియకు స్పందన రాకపోవడంతో సరకంతా మిల్లర్లు, గోదాముల దగ్గరే ఉండటం కూడా మరో కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. చింతపండు రెండువందలకు పైనే పెరిగింది, చక్కర ధరలు కూడా మెల్లగా పెంచుతూ.. అనూహ్యంగా పెరిగాయి. అందరూ ప్రీ డయాబిటిక్ కనుక వీటి ధరలు పెరిగినా ఫర్వాలేదని బీహార్‌కు చెందిన ఓ మంత్రి ఎకసక్కెంగా మాట్లాడారు. నిజానికి పాలకులు చేస్తున్న దుబారా ఖర్చులకు మాత్రం కళ్లెం పడడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటేంటి వంటకు,పూజలకు ,పెళ్ళిల్ళ వరకు అవసరమయ్యే అన్ని వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉల్లిగడ్డ నెలరోజుల్లోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ.22-26 ఉంటే.. ఇప్పుడు రూ.45-52కి చేరింది. జూన్ మొదటి వారంతో పోలిస్తే వెల్లుల్లి కిలో ధర రూ.120-130 నుంచి రూ.250 అంటే దాదాపు వంద శాతం వరకు పెరిగింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కి చేరింది. వంటనూనెల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. లీటర్ నూనె ప్యాకెట్ 175కు చేరింది. బెల్లం కేజీకి రూ.55 నుంచి రూ.70-75కి పెరిగింది. పండగలు, శుభాకార్యాల్లో పిండివంటలు తప్పనిసరైన నేపథ్యంలో ఇది మరో భారమైంది. ఇక పెళ్లిళ్లు.. బోనాలు, శ్రావణమాస పూజల నేపథ్యంలో పూలకు గిరాకీ ఏర్పడగా..వ్యాపారులు దాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. బోనాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి జరుగుతుండటంతో ఆ సమయాల్లో ప్రాంతాల వారీగా పెంచేస్తు న్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కనీసం పుస్తెలు చేయించే పరిస్తితి కూడా లేకుండా పోతోంది. బంగారనం ధరల మాఫియా ప్రపంచాన్ని శాసిస్తోంది. బంగారం షాపుల వారు కల్తీల, తరుగు, జిఎస్టీ పేరుతో దోచేస్తున్నారు. పెళ్లి బడ్జెట్‌లో బంగారం పెద్ద భాగం. పెరిగిన ధరలతో మంగళసూత్రం సహా ఆభరణాల కొనుగోలు ఖర్చు తలచుకుంటేనే భయమేస్తోందని పెళ్లిళ్లు చేసే కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. ఇక నిత్యం వాడుకునే ఉల్లిగడ్డ ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. కిలో 45కు తక్కువగా అమ్మడం లేదు. ఇదే కోవలో ఎండుమిర్చి, వెల్లుల్లి ధరలు కూడా భయపెడుతున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ధరల జాబితా చాంతాండంత తయార వుతోంది. ఇక ఇల్లు కట్టుకునాలనుకునే వారికి సిమెంటు,స్టీలు, ఇటుక, ఇసుక ధరలు చిర్రెత్తిస్తున్నాయి. ఇకపోతే మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా సామాన్యుడి నెలవారీ ఇంటి ఖర్చు అమాంతంగా పెరగడంతో తలపట్టుకునే పరిస్థితి వచ్చింది. అయితే ఉత్పత్తి తగ్గడం, సరఫరా ప్రభావం వంటికారణాలతో వ్యాపారులు రోజుకో లెక్క చెబుతున్నారు. ఇలా ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్రాలు సమీక్షించడం లేదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారులను నిలదీయడం లేదు. జనాభాకు తగ్గట్లుగా పంటుల పండుతున్నాయా లేదా అన్నది చూడడం లేదు. దేశంలో ఏయే పంటలు ఎంత పండుతున్నాయి..ఎంతెంత నిల్వలు ఉంటున్నాయో లెక్కలు వేయడం లేదు. ఏ సరుకు ఎక్కడి నుంచి ఎక్కడికి పోతేందో గమనించడం లేదు. బ్లాక్ మార్కెటీర్లను అదుపు చేయడం లేదు. ఇక విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామిన గొప్పులు చెబుతున్న మోడీ సర్కార్ విమాన ధరలను గమనించడం లేదు. విమాన సంస్థలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వారంతా పాలకులుగా ప్రజలకు ఏం సందేశం ఇస్తారో చెప్పాలి. నిరసనలు చేసేవారు ధరల పెరుగుదలపై నిలదీయాలే తప్ప రాజకీయ ప్రయోజానాల కోసం కాదు. విపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన బాధ్యతను పూర్తిగా విస్మరించింది. పార్లమెంట్ సమావేశాలను కేవలం ఆందోళనతో భ్రష్టు పట్టించింది. ఇది కూడా ప్రజలపై భారం మోపే చర్య తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా ప్రజలు గమనించాలి. ప్రజాప్రతినిదులు వచ్చినప్పుడు ప్రలే నిలదీయాలి. అప్పుడైనా చలనం వస్తుందేమో చూడాలి.

# అంతరిక్ష రంగంలో అంకుర సంస్థల శకం



ఆగస్టు 23, 2023న చంద్రయాన్-3 జాబిల్లి దక్షిణ ధ్రువ ప్రాంతానికి సమీపంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఆ రోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఇస్రో ఘనతలతోపాటు, దేశీయ అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం ఎంతమేర బలపడిందన్నదీ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 1969లో ఏర్పాటైన ఇస్రో 1975 లో ఆర్యభట్ట ఉపగ్రహంతో మొదలుపెట్టి, స్వదేశీ పిఎస్ఎల్‌వి, జిఎస్ఎల్‌వి రాకెట్ల దాకా ఎదిగింది.2008లో చంద్రయాన్-1, 2013లో మంగళ్‌యాన్ ప్రయోగాలు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చాయి. 2025లో స్పేడెక్స్‌ద్వారా రెండు ఉపగ్రహాల స్వయంచాలక డాకింగ్, అన్‌డాకింగ్ సాంకేతికతలను ప్రదర్శించి, ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. 2020లో చేపట్టిన అంతరిక్ష రంగ సంస్కరణలు కీలక మలుపుగా మారాయి. ప్రైవేట్ సంస్థలకు అవకాశాలు కల్పించేందుకు ఇన్-స్పేస్ ఏర్పాటైంది. 2023లో ప్రకటించిన ఇండియన్ స్పేస్ పాలసీ భాగస్వాముల బాధ్యతలను మరింత స్పష్టం చేసింది. గతంలో పూర్తిగా ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉన్న ఈ రంగంలో ఇప్పుడు ఉపగ్రహాల తయారీ, ప్రయోగ వాహనాలు, గ్రౌండ్ స్టేషన్లు, ఎర్త్ అబ్జర్వేషన్, స్పేస్ డేటా అనలిటిక్స్ వంటి విభాగాల్లో ప్రైవేట్ సంస్థలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఇది కేవలం సంస్థలకు అనుమతులు ఇవ్వడం కాదు. ప్రభుత్వ నియంత్రణ వ్యవస్థ నుంచి ప్రభుత్వం -పరిశ్రమ భాగస్వామ్య వ్యవస్థ వైపు జరుగుతున్న మార్పు. 2014లో దేశంలో అంతరిక్ష అంకుర సంస్థలు దాదాపు లేని స్థాయి నుంచి 2026 నాటికి వీటి సంఖ్య సుమారు 440కు చేరింది. ఇన్-స్పేస్ ఇప్పటివరకు 52 నాన్-గవర్నమెంట్ ఎంటిటీలకు 113 అనుమతులు మంజూరు చేసింది. 2026 మార్చి 31 నాటికి సమీకృత పెట్టుబడులు 618.5 మిలియన్ డాలర్లకు చేరాయి. 2021- 22లో ఇది కేవలం 100.5 మిలియన్ డాలర్లు మాత్రమే. ఒక్క 2026లోనే 187 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. రూ. 1,000 కోట్ల అంతరిక్ష్ వెంచర్ క్యాపిటల్ ఫండ్, రూ. 500 కోట్ల టెక్నాలజీ అడాప్షన్ ఫండ్ (టిఎఎఫ్)లను కేంద్రం ఏర్పాటు చేసింది.- ఎన్ఎస్ఐఎల్ ద్వారా 83 సాంకేతికతలకు సంబంధించి 118 టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్లు కుదిరాయి. 2024లో ఉపగ్రహాల తయారీలో 100 శాతం వరకు ఎఫ్‌డిఐకి కేంద్రం అవకాశం కల్పించింది. 'ప్రభుత్వం -ప్రైవేట్ భాగస్వామ్యంతో ఎర్త్ అబ్జర్వేషన్ పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (ఇఒపిపిపి) వంటి కార్యక్రమాలు కూడా ముందుకు వస్తున్నాయి. అగ్నికుల్ కాస్మోస్, స్కైరూట్ ఏరోస్పేస్, పిక్సెల్, ధ్రువ స్పేస్, దిగంతర, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, గెలాక్స్‌ఐ, పియర్‌సైట్ వంటి సంస్థలు ఈ జాబితాలో ముందు వరుసలో ఉన్నాయి. ఇవన్నీ ఒకే విభాగంలో పనిచేయడం లేదు - చిన్న ఉపగ్రహాల తయారీ నుంచి ప్రొపల్షన్ వ్యవస్థల దాకా, ఎర్త్ అబ్జర్వేషన్ నుంచి గ్రౌండ్ స్టేషన్ సేవల దాకా అనేక విభాగాల్లో విస్తరిస్తున్నాయి. అంతరిక్ష మిషన్ విజయానికి రాకెట్, ఉపగ్రహం ఎంత ముఖ్యమో భూమిపై ఉండే గ్రౌండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా అంతే కీలకం. ఉపగ్రహాన్ని ట్రాక్ చేయడం, కమాండ్ చేయడం, టెలిమెట్రీ స్వీకరించడం, మిషన్ కంట్రోల్ నిర్వహించడం వంటి కార్యకలాపాలకు గ్రౌండ్ స్టేషన్లు అవసరం. ఉపగ్రహాల సంఖ్య పెరిగే కొద్దీ ప్రపంచవ్యాప్తంగా గ్రౌండ్ స్టేషన్ల అవసరం పెరుగుతోంది. దీంతో భారత కంపెనీలకు దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ అవకాశాలు ఏర్పడుతున్నాయి. ాశ్రీంశీ =ఘుం - కలసి ఉంటేనే కమ్యూనిస్టులకు కలదు సుఖం శాటిలైట్-యాజ్- ఏ- సర్వీస్, గ్రౌండ్ స్టేషన్- యాజ్- ఏ -సర్వీస్, శాటిలైట్ బస్-యాజ్ -ఏ- సర్వీస్ వంటి నమూనాలు రాబోయే రోజుల్లో మరింత విస్తరించే అవకాశం ఉంది. అంతరిక్ష పరిశ్రమ అభివృద్ధి కేవలం కేంద్ర ప్రభుత్వ బాధ్యతగా మిగలడం లేదు. తయారీ క్లస్టర్లు, పరీక్షా సదుపాయాలు, భూమి, విద్యుత్, నైపుణ్య మానవ వనరులు అందుబాటులో ఉంటే రాష్ట్రాల్లోనూ స్పేస్ ఇండస్ట్రియల్ క్లస్టర్లు ఏర్పడే అవకాశం ఉంది. భవిష్యత్తులో స్పేస్‌టెక్ పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య పోటీ పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అంకుర సంస్థల సంఖ్య పెరగడం ఒక విషయం. వాటిలో ఎన్ని వాణిజ్యంగా నిలదొక్కుకుంటాయన్నది మరో విషయం. భారీ పెట్టుబడులు, సుదీర్ఘ అభివృద్ధి కాలం, ప్రయోగాల్లో ప్రమాదం, లైసెన్సింగ్, భద్రతా నిబంధనలు, అంతర్జాతీయ పోటీ వంటివి ముందున్న ప్రధాన అడ్డంకులు. ప్రయోగశాల స్థాయి సాంకేతికతను వాణిజ్య ఉత్పత్తిగా మార్చడమే అసలైన పరీక్ష. ఒక రాకెట్ ప్రయోగం విఫలమైతే అది మొత్తం కంపెనీ వైఫల్యం కాదు; అలాగే సాంకేతిక విజయం వాణిజ్య విజయానికి హామీ కాదు. రాబోయే దశాబ్దంలో చిన్న ఉపగ్రహ ప్రయోగాల నుంచి పెద్ద ఉపగ్రహ సమూహాల వరకు, గ్రౌండ్ స్టేషన్ సేవల నుంచి ఇన్- ఆర్బిట్ సర్వీసింగ్ వరకు కొత్త మార్కెట్లు ఏర్పడే అవకాశం ఉంది. తయారీతోపాటు డేటా, సాఫ్ట్‌వేర్, మిషన్ ఆపరేషన్స్ వంటి డౌన్‌స్ట్రీమ్ రంగాలూ పెద్ద మార్కెట్లుగా మారవచ్చు. ప్రభుత్వ రంగం పరిశోధన, విధాన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తుండగా, ప్రైవేట్ రంగం ఆ మద్దతును ఉత్పత్తులు, సేవలు, ఉపాధి, ఎగుమతులు, అంతర్జాతీయ వ్యాపారంగా మలచాల్సి ఉంది. ఇస్రో పరిశోధన శక్తి.. ప్రభుత్వం విధాన శక్తి.. ప్రైవేట్ రంగం వాణిజ్య శక్తి.. యువత ఆవిష్కరణ శక్తి. అయితే, ఈ నాలుగు శక్తులు కలిసినప్పుడే భారత్ ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో మరింత బలమైన స్థానాన్ని సంపాదించగలదు. ప్రభుత్వం విధానాలు, మౌలిక వసతులు, పరిశోధనకు మద్దతు ఇస్తూ.. ప్రైవేట్ రంగం ఆ సామర్థ్యాన్ని వాణిజ్య విజయంగా మార్చగలిగితే భారతదేశం ప్రపంచ అంతరిక్ష పరిశ్రమలో మరింత కీలకమైన స్థానాన్ని సంపాదించగలదు. అయితే జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ ప్రభుత్వ-ప్రైవేట్ సమన్వయమే చర్చనీయాంశంగా మారనుంది. ఇది కేవలం స్పేస్ స్టార్టప్‌ల శకం కాదు.. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న శకం.

## మహారాష్ట్రలో మరో వైద్యుడిపై దాడి కలకలం

### రోగిని పరీక్షస్తుండగా కుమారుడి దాడి

ముంబై,ఆగస్ట్24 : మహారాష్ట్రలో వైద్యుడిపై దాడి మరోసారి కలకలం రేపింది. థానేలోని కల్యాణ్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడిపై అతని కుమారుడు దాడికి పాల్పడ్డాడు. డాక్టర్‌ను దుర్భాషలాడుతూ కొట్టడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల ఓ మహిళా వైద్యురాలితో పాటు ఆస్పత్రి సిబ్బందిపై శివసేన కార్పొరేటర్ రమేశ్, అతని అనుచరులు దాడికి పాల్పడటం తెలిసిందే. ఆ దాడి సంచలనం సృష్టించిన కొన్ని రోజులకే తాజాగా మరో ఘటన జరగడంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో దేశ్‌ముఖ్ అనే రోగిని ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ యోగేంద్ర జైస్వాల్ పరీక్షిస్తున్నారు. అతని పక్కటెముకకు గాయం కావడంతో చికిత్సా విధానం, బ్యాండేజ్ ఎలా వేయాలి, మందులు ఎలా వాడాలనే విషయాలను జైస్వాల్ వివరిస్తున్నారు. ఈ సమయంలో రోగి కుమారుడు ఒకే ప్రశ్నను పదేపదే అడుగుతూ అభ్యంతరకర భాషను ఉపయోగించాడు. దీనిపై డాక్టర్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో 'నువ్వేమైనా పెద్ద డాక్టరువా?' అంటూ రోగి కుమారుడు ప్రశ్నించినట్లు జైస్వాల్ వెల్లడించారు. అనంతరం బయటకు వెళ్లి తనను దూషించాడని, తాను అభ్యంతరం చెప్పడంతో తిరిగి వచ్చి దాడి చేశాడని ఆరోపించారు. తనపై దాడి చేసిన వ్యక్తిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని ఇంకా అరెస్టు చేయలేదు. ఇటీవలే డొంబివ్లిలోనూ ఓ వైద్యురాలిపై దాడి ఘటన కలకలం రేపింది. కల్యాణ్-డొంబివ్లి ప్రాంతానికి చెందిన శివసేన కార్పొరేటర్ రమేశ్.. ఓ మహిళా వైద్యురాలిపై దాడి చేయడం సంచలనమైంది. కార్పొరేటర్, ఆయన అనుచరులు ఆస్పత్రి సిబ్బందిపైనా దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, వరుస దాడులతో వైద్యుల్లో ఆందోళన నెలకొంది. తమకు భద్రత కల్పించాలని, దాడులకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని వైద్యులు, సిబ్బంది కోరుతున్నారు.

## గినియాలో కూలిన డంపింగ్ యార్డు

### ప్రమాదంలో 30 మంది దుర్మరణం

న్యూఢిల్లీ : పశ్చిమ ఆఫ్రికాలోని గినియాలో ఓ డంపింగ్ యార్డ్ కూలడంతో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా సహాయక బృందాలు వారిని ఆస్పత్రికి తరలించాయి. గినియా రాజధాని కొనక్రిలో ఈ ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా డంపింగ్ యార్డ్ కుప్పకూలినట్టు తెలుస్తోంది. మృతిచెందిన 30 మందిలో ఇప్పటివరకు 18 మృతదేహాలను వెలికితీసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారనే అనుమానంతో రక్షణ బృందాలను రంగంలోకి దించినట్టు గినియా ప్రభుత్వం తెలిపింది. అయితే.. అక్కడ ప్రమాదం జరిగే అవకాశమున్నట్టు తాము ముందే ఊహించామని, స్థానికులను వేరే ప్రాంతానికి వెళ్లాలని ఇటీవలే ఆదేశించామని చెప్పింది.

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ


### పవిత్రోత్సవాలతో మరింత వైభవంగా తిరుమల

తిరుమల,ఆగస్ట్24 : తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. మరోవైపు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుంగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ట జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## బాలకృష్ణుని లీలాభిరామం!

శుకుడు పరీక్షిత్తుతో రాజా! ఒకనాడు తల్లి యశోద పెల్లుబికిన ప్రేమతో చేపు వచ్చిన పాలను ఒడిలో పరున్న నల్లనయ్యకు తాగించింది. ఆ కల్లిబొల్లి పిల్లవాడు అల్లరిగా చిరునవ్వుతో నిద్ర వస్తున్నట్టు మెల్లన లీలగా ఆవులించాడు. కొండగుహ వంటి వాని నోటిలో- అవని, ఆకాశం, జ్యోతిర్మండలం, సూర్యచంద్రులు, పంచభూతాలు, పయోధులు, పర్వతాలు, సర్వనదులు, చరాచర బ్రహ్మాండమంతా కనిపించింది. యశోద అరమోడ్పు కళ్లతో నివ్వెరపోయింది. 'అమ్మా! నేను పాలు తాగుతున్నానంటే నాలో ఉన్న, 'అంతస్థం యస్య విశ్వం సురనర ఖగ గో భోగి గంధర్వ దైత్యైః'- (విష్ణు సహస్ర నామ స్తోత్రం) నేనే అయిన విశ్వమంతా కూడా నీ స్తన్యాన్ని పానం చేస్తోంది' అని సూచించడమే ఈ లీలా పరమార్థం. బలరామకృష్ణులు పెరిగి పెద్దవాళ్లు అవుతున్నారు. తన ఈడు బాలురతో బాల్యక్రీడలు మరగి గోకులంలోని ఆ బాలగోపాలన్నీ చాలా చక్కగా ఆనంద డోలికలలో ఓలలాడిస్తున్నారు. వచ్చీరాని ముద్దుమాటల ముచ్చట్లతో పరమ సుఖానికి ఉన్న సరిహద్దులను చెరిపేస్తున్నారు. 'నాన్నలూ! ఏదీ! నాట్యమాడండి' అని ఇందు వదనలు- గోపికలు అంటే చాలు, వెంటనే కందువ- చతురతతో చేతులు, కాళ్లు అందంగా కదుపుతారు. వారిని ఆలోకించే- చూచే కొద్దీ గోకులంలోని లోకులందరికీ ఒక నిరాకుల- స్వస్థమైన తన్మయత్వం కలుగుతోంది. ఈ బాలలీలా వర్ణనంలో పోతన, భగవత్ వాసుదేవ తత్త్వాన్ని భాసురంగా ద్యోతన పరచే- ప్రకాశింపజేసే నూతన స్ఫురణ కల అమూలకాలైన అనేక అమూల్య కందాలను ఎంతో అందంగా వెలయించాడు%ా 'నగవుల నవిద్య పోఁడిమి నగుబాటుగఁ జేయనేర్చు నగవరి యంతన్ నగు మొగము తోడ మెల్లన నగుమొగముల సతులఁజూచి నగనేర్చె నృపా!' రాజా! బాలకృష్ణుడు చిరునవ్వు చిందిస్తే జన్మజన్మల చాల దట్టమైన అజ్ఞానం ఒక్కపెట్టున నవ్వుల పాలైపోతుంది. విజ్ఞానం పుట్టుకొస్తుంది. అట్టి లోకాంతరంగుడు- సర్వజీవ అంతర్యామి అయిన శ్రీకాంతుడు ఇంతటి వింత బాలకుడై తనను చూచి నవ్వే- ఆనందించే గోపకాంతలను గాంచి రవ్వంత నవ్వడం నేర్చాడు.



ఆధ్యాత్మికం

# స్మార్ట్ రేషన్ కార్డులా.. తప్పుల తడకలా?

● కార్డుల తయారీకి 18 కోట్లు. ● ఇటు ఓదెలలో.. అటు ఆసిఫాబాద్‌లో సగం తప్పులే ● రాష్ట్రవ్యాప్తంగా అసలు లెక్క ఎంత?
● రీ ప్రింట్( ప్రజాధనం వృధా)కు బాధ్యులెవరు? ● నిర్లక్ష్యానికి మూల్యం ఉంటుందా? ● ది క్రైమ్ న్యూస్ ప్రత్యేక కథనం..

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రం తయారయ్యాక ప్రూఫ్‌లు సరిచూస్తారు. తప్పులు లేకుండా నిర్ధారించుకుని సీల్డ్ కవర్లలో భద్రపరుస్తారు. పరీక్ష కేంద్రానికి చేరిన తర్వాత అధికారుల సమక్షంలోనే సీల్ ఓపెన్ చేస్తారు. సేమ్ టు సేమ్ స్మార్ట్ రేషన్ కార్డుల విషయంలోనూ అంతే పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టుగా అధికారులు గ్రామసభల్లో చదివి, అట్టహాసంగా పంపిణీకి సిద్ధమయ్యారు. కానీ తీరా లబ్ధిదారుల చేతిలో కార్డు పెట్టి చూస్తే.. స్మార్ట్ కార్డుల్లో తప్పుల తడక! పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం హరిపురం, జీలకుంట లోపంపిణీకి వచ్చిన కార్డుల్లో గ్రామం పేరుకు బదులు ఓదెల గ్రామం, మండలంగా ముద్రించడంతో పాటు పిన్‌కోడ్ కూడా తప్పుగా ముద్రించారు. దీంతో సర్పంచులు పంపిణీని నిలిపివేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఓదెల ఒక్కటే కాదు.. ఆసిఫాబాద్‌లోనూ ఇలాగే జరిగింది. ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్‌లో పంపిణీ చేసిన 10 స్మార్ట్ రేషన్ కార్డుల్లో 5 కార్డుల్లో గ్రామం పేరు తప్పుగా ముద్రించినట్లు తెలుస్తున్నది. అంటే.. 10 కార్డులు ఇస్తే 5 తప్పులు! మరి ఓదెలలో బయటపడింది ఎంత? ఆసిఫాబాద్‌లో బయటపడింది ఎంత? రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసిన లక్షల కార్డులను ఒక్కసారి సరిచూస్తే.. "తప్పుల తడక" అసలు లెక్క ఎక్కడికి చేరుతుందో? రూ.18 కోట్ల కార్డులు.. తప్పుల బిల్లు ఎవరిది? టెండర్‌లో సుమారు 1.20 కోట్ల కార్డులకు ?14.87 యూనిట్ రేటు నమోదైంది. ఆ లెక్కన సుమారు ?17.84 కోట్లు.. అంటే దాదాపు రూ.18 కోట్ల విలువ. ఇప్పుడు తప్పుల కార్డులు మళ్లీ ముద్రించాల్సి వస్తే..10 లక్షలు అయితే --- ?1.48 కోట్లు 20 లక్షలు అయితే --- ?2.97 కోట్లు 30 లక్షలు అయితే -




-- ?4.46 కోట్లు 50 లక్షలు అయితే ?7.43 కోట్లు! ఇవి కేవలం ఉదాహరణ లెక్కలు మాత్రమే. అసలు ప్రశ్న మాత్రం తప్పు ఎవరిది? రీ-ప్రింట్ ఖర్చు ఎవరిది? ప్రజల డబ్బుతో కార్డులు తయారు చేయాలి, ప్రజలే తప్పులు గుర్తించాలి.. మళ్లీ కార్డులు ముద్రించాలి.. మళ్లీ బిల్లు ప్రజలే కట్టాలా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే బాధ్యత మాత్రం కచ్చితంగా అధికారులదే పాత కార్డుకు.. కొత్త స్మార్ట్ కార్డుకు తేడా ఏమిటని లబ్ధిదారులు మాట్లాడుకుంటున్నారు. కొత్త కార్డులో క్యు ఆర్ కోడ్, పీవీసీ రూపం, డిజిటల్ వివరాలు, భద్రతా ఫీచర్లు ఉన్నాయి. నకిలీ కార్డులను అరికట్టడం, కార్డు వివరాలను డిజిటల్‌గా ధ్రువీకరించడం వంటి లక్ష్యాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. అయితే కుటుంబ సభ్యుల వివరాలు పాత రేషన్ కార్డుల్లోనే ఉన్నాయి. రేషన్ పొందేందుకు బయోమెట్రిక్ ధ్రువీకరణ కూడా ఇప్పటికే అమల్లో ఉంది. అందుకే లబ్ధిదారుల ప్రశ్న సూటిగా ఉంది. "కార్డు రూపం మారింది సరే.. మా రేషన్ హక్కులో కొత్తగా వచ్చిన ప్రయోజనం ఏమిటి?" రేషన్ పెరిగిందా? కొత్తగా ఏదైనా హక్కు వచ్చిందా? క్యూలు తగ్గాయా? పేదవాడి కష్టం తగ్గిందా? కార్డు స్మార్ట్ అయింది.. కానీ లబ్ధిదారుడి జీవితంలో ఎంత స్మార్ట్ మార్పు వచ్చింది? ప్రశ్నాపత్రానికే కాదు చిన్న కరపత్రాన్ని ముద్రించాలన్నా ప్రూఫ్‌రీడింగ్ చేసుకుంటారు. రేషన్ కార్డుకు ఎందుకు లేదు? అన్నది 18 కోట్ల ప్రశ్న అయి కూర్చున్నది. మరి పేదవాడి రేషన్ హక్కుకు సంబంధించిన కార్డును ఒక్కసారి సరిగ్గా చూసే తీరిక కూడా ఈ అధికారులకు లేదా? గ్రామం పేరు కూడా సరిగా ముద్రించలేని పరిస్థితి ఉంటే.. కార్డులో తొమ్మిది రకాల సెక్యూరిటీ ఫీచర్లు ఉన్నాయంటూ చెప్పుకోవడం ఎంత వరకు సమంజసం? కార్డు నకిలీ కాకుండా చూసేంత శ్రద్ధ ఉంది. కానీ కార్డు తప్పులేకుండా ఉండేలా చూసే శ్రద్ధ లేదా ? ఇప్పుడు ప్రభుత్వం చేయాల్సింది ఒక్కటే ఓదెలలోనూ.. ఆసిఫాబాద్‌లోనూ బయటపడిన తప్పులనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులన్నింటినీ ఒకసారి సమగ్రంగా పరిశీలించాలి. అప్పుడు తెలుస్తుంది. స్మార్ట్ కార్డులు ఎన్ని ముద్రించారో కాదు.. తప్పుల కార్డులు ఎన్ని ముద్రించారో! ప్రజాధనం అంటే ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లో దొరికే కాగితం ముక్క కాదు. ప్రతి రూపాయి వెనుక ప్రజల చెమట ఉంది. అందుకే ప్రజల డిమాండ్ ఒక్కటే.. తప్పులతో ప్రజాధనం వృధా కావడానికి బాధ్యులు ఎవరు? వాళ్లపై చర్యలు ఉంటాయా? "కార్డు స్మార్ట్‌గా ఇవ్వడం కాదు .. ముందుగా పాలనను స్మార్ట్‌గా చేయండి!"

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోన్న కాంగ్రెస్

● రాష్ట్రంలో విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం.. ● బిజెపి ఫీజుబకాయి ● బీజేపీలడాయి రాస్తారోకో ● రహదారిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు..

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణా రాష్ట్రంలో విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం కొనసాగుతోందని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న రూ.15వేలకోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందరరావు చేపట్టిన 48గంటల నిరాహారదీక్షకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో, బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు జిల్లాకేంద్రంలో భారీ రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కుప్పకూలుతుందని హెచ్చరించారు. ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అని పేర్కొనడం రేవంతరెడ్డి దురహంకారానికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. జీవో 97 ద్వారా పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు బిజెపి అండగా ఉంటుందని, ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని సంధ్యారాణి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. శ్రేణుల రాస్తారోకో వలన రాజీవ్ రహదారిపై ఇరువైపుల వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు



చేశారు. ఈ నిరసనలో జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్, సౌదరి మహేందర్ యాదవ్, కాసగోని నిర్మల, బెజ్జంకి దిలీప్ కుమార్, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిలుక భారతి, శివంగారి సతీష్, భూతగడ్డ రాజకుమార్, రామగిరి అఖిల్,పెంజర్ల రాకేష్ యాదవ్, వేల్పుల రమేష్, కారెంగుల శ్రీనివాస్, బిజెవైఎం మండల అధ్యక్షులు రెండ్ల వేణు, తీగల అశోక్, కొల్లూరి సంతోష్, గుడ్ల సతీష్, రాజేందర్ రెడ్డి, ఉమేష్, పెంచాల సంతోష్,దాత రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా రెండో రోజు ఆదివార స్వామి జయంతి ఉత్సవాలు



**రామగిరి,ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆదివారహస్వామి జయంతి ఉత్సవాలు రెండో రోజు కొనసాగాయి, స్వామి వారి వద్ద ఉదయం నిత్యాభిషేకం గోపూజ నిర్వహించారు. అనంతరం ఆదివారహ హవనము హోమం నిర్వహించడం జరిగింది. అలాగే విష్ణు సహస్రనామ పారాయణం నిత్య పూర్ణాహుతి గావించారు. ఉదయం నుండే భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కాగా స్వామి వారిని జైపూర్ ఏసిపి ఆరే వెంకటేశ్వర్లు, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మాజీ చైర్మన్ అయితే ప్రకాష్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ ఈ చక్రవర్తి ఈఈ శంకరయ్య ప్రముఖ కాంట్రాక్టర్ పులి విజయేందర్ రెడ్డి, సింగల్ విలో చైర్మన్ ఇలాంటి భాస్కరరావు, కాగా కమాన్ పూర్ మండలానికి చెందిన సంగారెడ్డిలో స్థిరపడ్డ ప్రముఖ వ్యాపారవేత్త మాదాసు రవీందర్ సుజాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ ఈవో కాంత రెడ్డి, ఆలయ అర్చకులు కలకుంట్ల వరప్రసాదాచార్యులు , సముద్రాల వేణుగోపాల చారి,రామానుజం, శ్రీనివాస్, డైరెక్టర్లు, పిల్లి రాజు, తీగల రాజయ్య గౌడ్, బూస శ్రీనివాస్ గౌడ్, చాట్ల రాయమల్లు, బొజ్జ సతీష్, తిమ్మరాజు గిరిజ, తాళ్ల భాగ్య, గాజుల శ్రీనివాస్, కుందారపు శంకర్, అనవేన శ్యామల, తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా గోదావరిఖని ఏసీపి మడత రమేష్, టూ టౌన్ సీఐ ప్రసాదరావు, వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

## ప్రజల ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార చర్యలు

### మహేశ్వరం ఎంపీడీవో శారదమ్మ




**మహేశ్వరం ఆగస్టు 24, (ది క్రైమ్ న్యూస్):** ప్రజావాణిలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించే దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మహేశ్వరం ఎంపీడీవో శారదమ్మ తెలిపారు. సోమవారం మహేశ్వరం మండల ఎంపీడీవో కార్యాలయంలో తహసిల్దార్ చిన్నపలనాయుడు తో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం తొమ్మిది వినతి పత్రాలు వచ్చాయని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించామని తెలిపారు. మహేశ్వరం మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## మంత్రి శ్రీధర్ బాబుకు రాఖీ కట్టిన మాజీ సర్పంచ్



**రామగిరి,ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మండలం జూలపల్లి మాజీ సర్పంచ్ వాయినాల అనిత రాజు సోమవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు రాఖీ వేడుకల్లో భాగంగా ముందస్తు రాఖీ కట్టారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా భాగంలో రాఖీ పౌర్ణమి కి ముందు వైనాలానిత గత పది సంవత్సరాలుగా మంత్రి శ్రీధర్ బాబుకు రాఖీ కట్టడం జరుగుతుంది. అనంతరం మంత్రి శ్రీధర్ బాబుకు స్వీట్లు తినిపించారు. వీరితోపాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ కు, సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావుకు, మాజీ ఎంపీపీ కోలేటి మారుతికి స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ కు తదితరులకు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిలిశేఖర్, గాండ్ల మోహన్, బోలెపల్లి శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కులు తీర్చే దేవుడు ఆదివారహస్వామి

### రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**రామగిరి,ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):-** వరాల దేవుడు ఆదివారహా స్వామి అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆది వరహాస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. శ్రీధర్ బాబును ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ ఆలయ ఈవో కొసన్న కాంతారెడ్డి, ఆలయ అర్చకులు కలకుంట్ల వరప్రసాద్ను పూర్ణ కుంభాభిషేకంతో శ్రీధర్ బాబును ఆహ్వానించారు. అనంతరం స్వామివారి వద్ద గోపూజలో పాల్గొని అనంతరం అభిషేకం చేసి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ... శ్రీ ఆది వరహ స్వామికి ఎంతో చరిత్ర ఉందని ముక్కులు మొక్కుకున్న వారి మొక్కులు తీర్చే దేవుడు ఆదివారహస్వామి అని పేర్కొన్నారు. అలాగే ఆలయ అభివృద్ధిలో తమ వంతుగా పూర్తిస్థాయిలో కృషి చేస్తానని అన్నారు. ఆలయానికి రోడ్డు అసంపూర్తిగా ఉందని ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ దామోదర్ తోపాటు ఆలయ ఈవో కాంతారెడ్డి ,డైరెక్టర్లు తీగల రాజయ్య, పిల్లి రాజు, శ్రీనివాస్ గౌడ్, బూస శ్రీనివాస్ గౌడ్, తిమ్మరాజు గిరిజ, బొజ్జ సతీష్, చాట్ల రాయమల్లు గాజుల శ్రీనివాస్ కుందారపు శంకర్ తాళ్ల భాగ్యలక్ష్మి అన వీణ శ్యామలలు రోడ్డు అసంపూర్తిగా ఉందని తమ దృష్టికితేగా వెంటనే 90 లక్షల వ్యయంతో రోడ్డు పనులు పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆలయాభివృద్ధిలో భాగస్వామి అవుతానని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం మరింత సౌకర్యాలు కలిగేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వర్,నాయకులు రెబల్ రాజు, కోలేటి మారుతి, పిల్లి శేఖర్, బొల్లెపల్లి శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన ఏ.ఫాతిమా తాము 30 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివసిస్తున్నామని తమకు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడి హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పాలకుర్తి మండలం ఎలుకలపల్లి గేటు గ్రామానికి చెందిన ధర్మపురి శిరీష తాను ఏఎన్ఎం పూర్తి చేశానని తనకు కాంట్రాక్ట్ లేదా అవుట్సోర్సింగ్ పద్ధతిలో ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారది కి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన బర్ల బాపు సర్వేనెంబర్ 119 సర్వే నెంబరు లోగల రెండు ఎకరాల 25 గుంటల వ్యవసాయ భూమికి పట్టా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు తీసుకోగా ముత్తారం తహసిల్దార్ కు రాస్తూ విచారణ చేసి రిపోర్ట్ సమర్పించ వలసిందిగా అదనపు కలెక్టర్ సూచించారు.పెద్దపెల్లి మండలం బండారి కుంట గ్రామానికి చెందిన నేరెళ్ల లత వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ నూతన అర్హత మేరకు నూతన పెన్షన్ మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ బి.ప్రకాష్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లేఅవుట్ రోడ్డుపై కబ్జా ఆరోపణలు షెడ్ల నిర్మాణం..

### అధికారులకు స్థానికుల ఫిర్యాదు...



**కుత్బుల్లాపూర్, (ది క్రైమ్ న్యూస్) ఆగస్టు 23:** దూలపల్లి డివిజన్ పరిధిలోని 154, 157 సర్వే నంబర్లలో గ్రామపంచాయతీ కాలం నాటి లేఅవుట్ రోడ్డును కొందరు ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం రోడ్డును ఆనుకుని ప్రహరీ గోడ నిర్మించడంతో పాటు లోపల షెడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు హద్దులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించాలని కోరుతున్నారు. ఇది ప్రభుత్వ లేదా లేఅవుట్ రోడ్డుగా తేలితే ఆక్రమణలను తొలగించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణ పనులపై కూడా అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## బాచుపల్లిలో ఘనంగా బోనాల జాతర...



**కుత్బుల్లాపూర్, (ది క్రైమ్ న్యూస్) ఆగస్టు 23:** బాచుపల్లిలో బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హనుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల జాతర సందర్భంగా నిర్వహించిన పలారం బండి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ వేషధారణలు, డప్పు చప్పుళ్లు, కళాకారుల ప్రదర్శనలతో బాచుపల్లి వీధులు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా సాంస్కృతిక సేన అధ్యక్షుడు దొడ్డు రాహుల్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎం.జె.ఎఫ్. జోగు వెంకట్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ మన్నె రాజు, మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, మాజీ సర్పంచ్ మైసగిరి శ్రీనివాస్, హేమంత్, సల్మాన్ రాజ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కొమ్ముగూడెం - దౌడపల్లి రోడ్డు అభివృద్ధికి శ్రీకారం..





**లక్షెట్టిపేట, ఆగస్టు 24, (ది క్రైమ్ న్యూస్):** మండలంలోని కొత్త కొమ్ముగూడెం గ్రామం నుండి దౌడపల్లి గ్రామం వరకు సుమారు 2.89 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేఖమ్మ మాట్లాడుతు.. ఈ రోడ్డు నిర్మాణంతో కొత్త కొమ్ముగూడెం, దౌడపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రోడ్లు ఎంతో కీలకమని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా మన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తారని తెలిపారు.. అనంతరం స్థానిక సర్పంచ్ సందేల సుజాత -సురేష్ , గ్రామస్తులు, నాయకులు సురేఖమ్మ ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఆర్ టి ఎ మెంబర్ అంకతి శ్రీనివాస్, లక్షెట్టిపేట్ మండల అధ్యక్షులు, సర్పంచ్ నలిమెల రాజు, లక్షెట్టిపేట్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, మంచిర్యాల జిల్లా ఆర్ జ్ఞి పి ఆర్ ఎస్ గడ్డం త్రిమూర్తి, మండల వైస్ ప్రెసిడెంట్ కందుల మోహన్, జిల్లా నాయకులు పూర్ణచంద్రరావు, బియ్యాల తిరుపతి, మండల మాజీ అధ్యక్షులు పింగిలి రమేష్, లక్షెట్టిపేట్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, ఉప సర్పంచ్ బొప్పు సుమన్, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల ఆకలి తీర్చడమే లక్ష్యం

● బడిలోనే అల్పాహారం, భోజనం ● పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదు ● పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం ● రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు - పిల్లల ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచేందుకు అల్పాహార పథకం ● సుమారు రూ.7.5 కోట్ల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ఆధునిక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు ● గంటలో 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం ● మంథనిలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించిన మంత్రి






**రామగిరి, ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):** పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదని, ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి వారి ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.మంథనిలో సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ. 7.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో తయారు చేసిన అల్పాహారాన్ని విద్యార్థులతో కలిసి మంత్రి స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, 2011లో హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లోని రోగుల సహాయకులకు ఆహారం అందించే కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం అమలు అవుతోందన్నారు. హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద 10 మైళ్ల పరిధిలో ఒక్కరు కూడా ఆకలితో ఉండకూడదనే సందేశం తెలంగాణ ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలిచిందని మంత్రి తెలిపారు. హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్‌తో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆహార భద్రత కల్పించే కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో తొలుత కొడంగల్ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఈ పథకం అమలుతో కొడంగల్ నియోజకవర్గంలో పాఠశాల విద్యార్థుల హాజరు 21 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కొడంగల్‌తో పాటు మధిరలో కూడా అల్పాహార పథకం అమలు చేస్తున్నామని తెలిపారు.జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన సూచనల మేరకు సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ. 7.5 కోట్ల వ్యయంతో మంథనిలో ఆధునిక యంత్రాలతో ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ఇక్కడ గంటలో 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం ఉందన్నారు.విద్యార్థులకు ప్రతిరోజూ విభిన్న రకాల అల్పాహారం అందించేలా ప్రత్యేక మెనూను రూపొందించామని మంత్రి తెలిపారు. వారానికి కనీసం మూడు సార్లు విద్యార్థులకు పాలు అందించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని అన్నారు. పిల్లలకు ప్రతిరోజూ ఒకే రకమైన ఆహారం కాకుండా వివిధ రకాల టిఫిన్లను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్న మంత్రి, వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఒక విద్యార్థిని గతంలో ఆహారం లేకుండానే పాఠశాలకు హాజరయ్యే పరిస్థితి ఉండేదని తన కష్టాలను మంత్రితో పంచుకుంది. ఇలాంటి పరిస్థితులను విద్యార్థులు ఇకపై ఎదుర్కోకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.పోషకాహారంతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల విద్యార్థులు చదువుపై మరింత ఏకాగ్రత సాధించడంతో పాటు మంచి ఆరోగ్యం, శారీరక ఎదుగుదల పొందుతారని మంత్రి అన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అల్పాహార పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచనల మేరకు జిల్లాలో విద్యాశాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన అధ్యయనాల ప్రకారం విద్యాశాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యపై ప్రత్యేక దృష్టి సారించి కొత్త ఉపాధ్యాయులను నియమించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని కలెక్టర్ తెలిపారు. తాజాగా ప్రారంభించిన అల్పాహార పథకం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.జిల్లాలో ఉపాధ్యాయులు చేస్తున్న మంచి పనికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇటీవల రామగుండం ప్రాంతానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు ఫిన్‌లాండ్‌లో శిక్షణా కార్యక్రమానికి ఎంపికయ్యారని, భవిష్యత్తులో మరింత మంది ఉపాధ్యాయులు విదేశాల్లో శిక్షణ పొందేలా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం, నాణ్యమైన విద్య ఉచితంగా అందుతున్నందున తల్లిదండ్రులు ఎలాంటి సందేహాలు లేకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి విద్యార్థుల భవిష్యత్తుకు పటిష్ట పునాది వేయడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మంథని మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసిల్దార్ ఆరిపోద్దిన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## 48 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

### చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న 1977--78 బ్యాచ్...






**కుత్బుల్లాపూర్ (ది క్రైమ్ న్యూస్) సూరారం, ఆగస్టు 24:** దుండిగల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1977--78 బ్యాచ్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు 48 ఏళ్ల తర్వాత సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో సోమవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. కోలా రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. అప్పట్లో తరగతిలో 22 మంది విద్యార్థులు ఉండగా.. కిషన్‌రావు, చక్రధర్, మైమూత్, కృష్ణ, బలరాం మృతిచెందిన సందర్భంగా వారికి నివాళులర్పించారు. సమావేశానికి 11 మంది హాజరయ్యారు. అప్పట్లో ఇద్దరు మాత్రమే పదో తరగతి ఉత్తీర్ణులు కాగా.. శ్రీనివాస్ ఎన్ఎఫ్‌సీలో ప్రభుత్వ ఉద్యోగిగా, డాక్టర్ మోహన్ ప్రభుత్వ వైద్యుడిగా సేవలందించారు. కొండల్‌రెడ్డి ఆర్అండ్‌బీ శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందారు. చదువులో వెనుకబడినప్పటికీ వ్యాపారాలు, ఉద్యోగాలు, వ్యవసాయంలో స్థిరపడి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడేలా చేయడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. రవీందర్ కుమారుడు కోలా శ్రీకాంత్ (సివిల్ ఇంజనీర్), వెంకటేష్ కుమారుడు కోలా అరవింద్ (డాక్టర్, అసిస్టెంట్ ప్రొఫెసర్)ను సన్మానించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాలని, హాజరుకాని స్నేహితులను తదుపరి సమావేశానికి తీసుకురావాలని నిర్ణయించారు. తదుపరి భేటీని దుండిగల్‌లోని తాము చదువుకున్న పాఠశాలలో నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో శేఖర్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, సత్తిరెడ్డి, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వరాహ స్వామి ఆలయానికి 1, 11, 116 అందజేత



**రామగిరి,ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):**-కమాన్ పూర్ మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ ఆదివార స్వామి ఆలయ అభివృద్ధి,, లడ్డు కౌంటర్ బాక్స్ కొరకు 1,11,116 రూపాయలను ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ కు అందజేశారు. మందని పట్టణానికి చెందిన పాండ్రాల మల్లమ్మ స్మారగార్థం ఆమె కుమారుడు పాండురాల రాజు మరియు కుటుంబ సభ్యులు 1,16,116 రూపాయలను అందజేశారు. కాగా ఆయా రూపాయలను ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందని చైర్మన్ తెలిపారు. ఆయనతోపాటు జైపూర్ ఏసిపి సైతం తమవంతుగా ఆలయఅభివృద్ధికి డబ్బులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో కాంతరెడ్డి, డైరెక్టర్లు పిల్లి రాజు తీగల రాజయ్య గౌడ్ బూస శ్రీనివాస్ గౌడ్, చాట్ల రాయమల్లు, గాజుల శ్రీనివాస్, కుందారపు శంకర్, తదితరులు ఉన్నారు.


## 7వ వార్డులో పారిశుద్ధ్య పనులపై చైర్మన్ చంద్రారెడ్డి పర్యవేక్షణ



**నల్లగొండ జిల్లా ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్): ఆగస్టు 24, హాలియా:** హాలియా మున్సిపాలిటీలో రోజువారీ పర్యవేక్షణ కార్యక్రమాల్లో భాగంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి 7వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్ల వెంట పెరిగిన పిచ్చి మొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పరిశుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం 7వ వార్డులో వర్షాకాలంలో తలెత్తుతున్న విద్యుత్ సమస్యలను పరిశీలించారు. విద్యుత్ అధికారులను అక్కడికి పిలిపించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని చైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ సలహాదారు మజార్ మొయినుద్దీన్, విద్యుత్ అధికారులు, శానిటేషన్ జవాన్, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు తీర్చడంలో కేఎల్ఆర్ తనదైన ముద్ర

### నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ నిరంతరం కృషి



**మహేశ్వరం ఆగస్టు 24, (ది క్రైమ్ న్యూస్):** ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతు ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా మాజీ శాసనసభ్యులు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తనదైన ముద్ర వేస్తున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలు, విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యంగా కేఎల్ఆర్ ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వాటికి పరిష్కార మార్గాలు చూపించడం ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తున్నారు. “పదవి కంటే ప్రజాసేవే ముఖ్యమనే ఆలోచనతో, మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను” అనే సంకల్పంతో కేఎల్ఆర్ పనిచేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నారు. మహేశ్వరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కేఎల్ఆర్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు సైతం ముందుకు సాగుతున్నారు..

## మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించిన మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ





**లక్షెట్టిపేట, ఆగస్టు 24, (ది క్రైమ్ న్యూస్ ):** మండలంలోని కొత్త కొమ్ముగూడెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ను మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా సురేఖమ్మ విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న మౌలిక వసతులను తెలుసుకుని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దృష్టికి తీసుకొని వెళ్లి ఆ సమస్యలను పరిష్కరించేలా చేస్తానని సురేఖమ్మ హామీ ఇచ్చారు. అంతకుముందు విద్యార్థులు సురేఖమ్మకి ఘన స్వాగతం పలికి సురేఖమ్మను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సందేల సుజాత -సురేష్, లక్షెట్టిపేట్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, ఉప సర్పంచ్ బొప్పు సుమన్, మంచిర్యాల జిల్లా ఆర్ టీ ఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, లక్షెట్టిపేట్ మండల అధ్యక్షులు, సర్పంచ్ నలిమెల రాజు, లక్షెట్టిపేట్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, మంచిర్యాల జిల్లా గడ్డం త్రిమూర్తి, మండల వైస్ ప్రెసిడెంట్ కందుల మోహన్, జిల్లా నాయకులు బియ్యాల తిరుపతి, మండల మాజీ అధ్యక్షులు పింగిలి రమేష్, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## కార్మిక విజయం




**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగస్టు 24:** ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ ల న్యాయమైన సమస్యల పరిష్కారానికై. ఆగస్టు 23 అర్ధరాత్రి నుండి బంద్ చేయాలని తెలంగాణ ఆటో అండ్ మోటార్ జేఏసీ తెలంగాణ వ్యాప్తంగా పిలుపునందుకొని బందుకు సిద్ధంగా ఉన్న కార్మిక లోకం. ఆగస్టు 23 సాయంత్రం ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ తో జెఏసి జరిపిన చర్చలలో 14 డిమాండ్ లను రాతపూర్వకంగా హామీ ఇవ్వడం జరిగింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తరపున వీడియో రిలీజ్ చేయడం జరిగింది. ఈ చర్చలు చఫలం కావడంతో కార్మిక లోకానికి తెలంగాణ ఆటో అండ్ మోటార్ జేఏసీ బందు ను విరమించడం జరిగింది. ఇది కార్మికుల విజయంగా తెలంగాణ ప్రోగ్రెస్ యు ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లు ఎస్కే లాల్ మియా అన్నారు. వైరా టి యు సి ఐ ఆఫీసులో జరిగిన సమావేశంలో టి యు సి ఐ వైరా డివిజన్ కార్యదర్శి ఎలదండి బాబు, గద్దల సహదేవ, భూక్య బాలు, దుర్గారావు, నాగేశ్వరావు, ముత్తయ్య, అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మేకల మార్కెట్‌లో బురద నివారణకు చర్యలు

### సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపిన మేకల మార్కెట్ యజమానులు



**రామగిరి, ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):-** సెంటినరీ కాలనీ లోని మేకల మార్కెట్ లో బురద నివారణకు చిప్స్ పోయించడం జరిగింది. భారీ వర్షానికి మేకల మార్కెట్ బురదమయ మైయిందని యజమానులు సోమవారం సర్పంచ్ పల్లె. ప్రతిమ పీవీరావు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పలు ట్రాక్టర్ ట్రిప్‌ల చిప్స్‌ను బురద కాకుండ పోయించడం జరిగింది. బుధవారం మేకల మార్కెట్ లోని మైసమ్మ దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మేకల మార్కెట్ సంఘము నాయకులు ఒర్రె.సురేష్, ఒర్రె. సదయ్య, బనుక. అంజి, బత్తిని ఐలయ్య పాల్గొన్నారు.

# నేడు జిల్లాల్లో ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమం

● రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ







**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 24:** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25న మంగళవారం భారీ స్థాయిలో మొక్కలు నాటే ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల్లో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను, డిఎఫ్ఓ లను ఆదేశించారు. వన మహోత్సవ కార్యక్రమంపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఎఫ్ఓలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరంలో వన మహోత్సవం కార్యక్రమం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటి వరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. తక్కువ ప్రగతి సాధించిన జిల్లాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. మేడ్చల్ జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 9 శాతం లక్ష్యం మాత్రమే పూర్తయిందని, హెచ్ఎండీఏ, సూర్యాపేట, 3 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, సంగారెడ్డి ప్రాంతాల్లో 50 శాతం కంటే తక్కువ లక్ష్యం పూర్తయిందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో లక్ష్య సాధనకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వేగంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. వన మహోత్సవంలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. మొక్కల మనుగడ శాతం అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా మొక్కలు చనిపోతే వెంటనే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలని అన్నారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల పరిస్థితిపై ప్రతిరోజూ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా వినియోగించుకొని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. సెప్టెంబర్ చివరి నాటికి అన్ని లక్ష్యాలను పూర్తి చేసేలా కలెక్టర్లు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా ఆగస్టు 25న మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో భారీ స్థాయిలో సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, ప్రజా ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. మంగళవారం నిర్వహించే సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం ద్వారా జిల్లాలో చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాలపై ప్రజలకు మంచి సందేశం వెళ్లేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో సాధ్యమైన చోట అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. దేవాలయ పరిసర ప్రాంతంలో, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికా బద్ధంగా మొక్కలు నాటాలని అన్నారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, అవసరమైన మొక్కలను సకాలంలో తరలించాలని, నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని మంత్రి ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి, మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో 67 శాతం లక్ష్యం పూర్తి జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో వన మహోత్సవం క్రింద 31.30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు సుమారు 20.90 లక్షల మొక్కలు నాటి 67 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. మంత్రి సూచనల మేరకు మంగళవారం జిల్లాలో భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇప్పటికే 2 లక్షలకు పైగా గుంతలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మంగళవారం ఒకే రోజు 1 లక్ష మొక్కలు నాటేలా లక్ష్యంగా పెట్టుకున్నామని, ఖమ్మం నుంచి వ్యవసాయ శాఖ మంత్రి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మండల, గ్రామ స్థాయిల్లో కూడా ప్రత్యేకంగా మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పాఠశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మంగళవారం 1 లక్ష మొక్కలు నాటే లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. మండలాల వారీగా స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, ముందస్తు ప్రణాళికతో కార్యక్రమాన్ని నిర్వహించాలని డిఎఫ్ఓకు సూచించారు. కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, అన్ని వర్గాల ప్రజలను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీఆర్‌డీఓ బి. శిరీష, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధే రెండు కళ్లుగా ముందుకు

● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ● ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు ...● ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా తహసీల్దార్ కార్యాలయాలు పనిచేయాలి ● మంథని గంగాపురి వద్ద రూ.2.55 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్, కమాన్ పూర్‌లో రూ.75 లక్షలతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభించిన మంత్రి







**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమ కార్యక్రమాలతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సోమవారం మంథని మండలం గంగాపురి వద్ద రూ. 2.55 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను, కమాన్ పూర్ మండలంలో రూ. 75 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంథని ప్రాంతంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు గంగాపురి వద్ద ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా పరిసర ప్రాంతాలకు నాణ్యమైన, స్థిరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. రైతులు, గృహ వినియోగదారులు, వ్యాపారులు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుతో పాటు విద్యుత్, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మంజూరైన నిధులను సకాలంలో వినియోగిస్తూ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. భూ భారతి ద్వారా భూ సమస్యలకు పరిష్కారం: రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం భూ భారతి ద్వారా చర్యలు చేపడుతోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గతంలో ధరణి వ్యవస్థలో ఏర్పడిన అనేక సమస్యల కారణంగా రైతులు, భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. భూ భారతి ద్వారా భూ రికార్డులను ప్రక్షాళన చేసి, ప్రజలకు పారదర్శకంగా భూ సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. భూ రీ-సర్వే కార్యక్రమాన్ని దశలవారీగా చేపడుతున్నామని, మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. భూ రికార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా అధికారులు సమగ్రంగా పనిచేయాలని సూచించారు. రైతులు, ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. భూ భారతి ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ప్రజలకు సేవా కేంద్రంగా పనిచేయాలి : కమాన్ పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం ప్రజలకు మెరుగైన సేవలు అందించే కేంద్రంగా పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరిని గౌరవంగా స్వీకరించి, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ప్రజలు అందించే దరఖాస్తులు, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచనల మేరకు జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో మంజూరైన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నామని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించే విధంగా అధికారులు గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సూచించారు. భూ భారతి, భూ రీ-సర్వే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. భూ రికార్డుల సమస్యలను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరించాలని, వ్యవసాయ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుతాయని మంత్రి మరియు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఆర్డిఓ సురేష్, తహసిల్దార్ వాసంతి, సంబంధిత ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## టీఎన్జీవో నూతన జెండా ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి




**మంచిర్యాల టౌన్, ఆగష్టు 24 (ది క్రైమ్ న్యూస్):** మంచిర్యాల జిల్లా నస్పూర్ ఐ డి ఓ సి లో టీఎన్జీవో నూతన జెండా,కండువాలను మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ టీఎన్జీవో నూతనంగా జెండా, కండువాలను ఆవిష్కరణ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు టిఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని అని తెలిపారు. కేంద్ర సంఘం ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తో చర్చించి ఉద్యోగుల సమస్య ల పరిష్కారం దిశలో చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కావున జిల్లా లోని ప్రతి ఒక్క నాన్ గెజిటెడ్ ఉద్యోగి టిఎన్జీవో లో సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు టీఎన్జీవో ఎల్లప్పుడు కృషి చేస్తుందని అన్నారు. టీఎన్జీవో జిల్లా, కేంద్ర సంఘంకు ఉద్యోగుల సహాయ సహకారాలు కూడా ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కేజియా రాణి, తిరుపతి, రామ్ కుమార్, సత్యనారాయణ, నరేందర్, సంయుక్త కార్యదర్శిలు సునిత, అంజయ్య, కార్తీక్,ప్రభు, పద్మలత, సురేందర్, రోశయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ మోసిన్, పబ్లిసిటీ సెక్రటరీ యూసుఫ్, స్పోర్ట్స్ సెక్రటరీ కుమార్, కార్యవర్గ సభ్యులు రాజేందర్, జ్యోతి,మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, కార్యదర్శి అజయ్, మందమర్రి యూనిట్ అధ్యక్షులు సుమన్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్, చెన్నూరు యూనిట్ అధ్యక్షులు అభిషేక్, లక్షెట్టిపేట్ యూనిట్ అధ్యక్షులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో విలువలు పెంపొందించేందుకు ప్రేరణ కార్యక్రమం



**మేడ్చల్, ఆగష్టు 24(ది క్రైమ్ న్యూస్):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాగారంలో బంగారు తల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీసీ రాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు మమేకమై విద్య, క్రమశిక్షణ, విలువలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచడంతో పాటు మంచి విలువలను అలవర్చుకునేలా పలు అంశాలను వివరించారు. సమావేశ మందిరానికి విద్యార్థులు క్రమపద్ధతిలో రావడం, మంచి క్రమశిక్షణతో వ్యవహరించడాన్ని అభినందించారు. తల్లిదండ్రులు ఇచ్చే జేబు ఖర్చును ఎలా వినియోగిస్తున్నారని విద్యార్థులను ప్రశ్నించగా, బస్సు చార్జీలకు ఉపయోగించడంతో పాటు మిగిలిన డబ్బుతో కలం, పెన్సిల్ వంటి విద్యా సామగ్రిని కొనుగోలు చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. పాఠశాల యూనిఫాం ధరించడం కూడా క్రమశిక్షణలో భాగమని, విద్యార్థుల మధ్య పేద, ధనిక అనే తేడాలు లేకుండా అందరూ సమానంగా కనిపించేందుకు యూనిఫాం విధానం ఏర్పాటు చేశారని వివరించారు. ‘శిక్షకు, శిక్షణకు మధ్య తేడా ఏమిటి?’ అని ప్రశ్నించగా విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పడంతో అభినందించారు. పిల్లలుగా అల్లరి చేయడం తప్పు కాదని, అయితే అల్లరి పనులకు లోనుకావద్దని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా వినడంతో పాటు వారిని గౌరవించాలని తెలిపారు. ఉపాధ్యాయులు కేవలం విధి నిర్వహణలో భాగంగానే కాకుండా సమాజానికి మంచి భవిష్యత్తును అందించే బాధ్యతతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని వివరించారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా మారినప్పుడు విద్యార్థులకు ఎలా సహాయపడతారో ఆలోచించాలని సూచించారు. తల్లిదండ్రులను మొదటగా గౌరవించాలని, వారి మాట వినడంతో పాటు వారు చెప్పే పనులను బాధ్యతగా చేయడం ద్వారా కుటుంబ గౌరవాన్ని కాపాడవచ్చని తెలిపారు. చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడిక, మానవీయ విలువలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సీనియర్ ఉపాధ్యాయులు రాజలక్ష్మి, అరవింద్ కుమార్, మాలోత్ నాయక్, వందన, కౌసల్య, వరమ్మ, రఘు, కౌసల్యతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**మహేశ్వరం ఆగష్టు 24, (ది క్రైమ్ న్యూస్):** మహేశ్వరం గ్రామంలో నూతన సిసి రోడ్లు రెండు నిర్మిస్తున్నామని మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ తెలిపారు. జోరల పర్వతాలు ఇంటి నుండి బహదూర్ గూడెం సుధాకర్ ఇంటి వరకు ఒక సిసి రోడ్డు మిద్దింటి సుదర్శన్ ఇంటి నుండి బొమ్మనమైన అంజయ్య ఇంటి వరకు మరో సిసి రోడ్డు వేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే పంచాయతీ పాలకవర్గ లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలకు నాణ్యమైన రవాణా సదుపాయాలు కల్పించేందుకునాణ్యమైన రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత ఉపసర్పంచ్ జోరల రమేష్ సీనియర్ నాయకులు కర్రల చంద్రయ్య మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం, వార్డు సభ్యులు ఆజం, రేవెల్ల చంద్రమౌళి, నాయకులు సున్నం కృష్ణ, టింగిరి కార్ మక్కాజి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థి ఇంట్లో ఎన్ ఐ ఏ తనిఖీల కలకలం

### డిజిటల్ పరికరాల పరిశీలన, విచారణ వేగవంతం

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం అయోధ్యనగర్‌లో చోటుచేసుకున్న ఎన్ ఐ ఏ అధికారుల తనిఖీలు తీవ్ర కలకలం రేపాయి. సోమవారం దంత వైద్యుడు ఆయుబ్ ఖాన్ నివాసంలో ఈ తనిఖీలను నిర్వహించారు. ఆయుబ్ ఖాన్ కుమారుడు ముజామిల్ ఇంజనీరింగ్ చదువుతున్నాడని, అతడిని సోదాల సమయంలో విచారణ చేశారు. విద్యార్థి ఉపయోగిస్తున్న ల్యాప్‌టాప్, ఫోన్‌లను విచారణాధికారులు సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గతేడాది సైబర్ క్రైమ్ వ్యవహారాల క్రమంలో ఏర్పడిన అనుమానాల నివృత్తి కోసం ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, పరికరాల్లో ఉన్న సమాచారాన్ని విశ్లేషిస్తున్నట్లు సమాచారం.

# దైవ కార్యానికి ఎల్లప్పుడూ సహాయకుడినే ఎమ్మెల్యే జిఎంఆర్

- జిన్నారంలో పోచమ్మ దేవాలయం నిర్మాణానికి రూ.12 లక్షల భారీ విరాళం
- నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో దేవాలయాలు, మసీదులు, చర్చిలు..

**సంగారెడ్డి జిల్లా(ది క్రైమ్ న్యూస్): జినారం,** ఒక వైపు ప్రజాసేవలో.. మరో వైపు భక్తి సేవలో తనదైన ముద్రను చాటుతున్నారు పటాన్ చేరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి గారు. పటాన్ చేరు నియోజకవర్గం వ్యాప్తంగా పరమతసహనం పెంపొందిస్తూ.. సొంత నిధులతో గుడులు, మసీదులు, చర్చిలు నిర్మిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందిస్తున్నారు. తాజాగా జిన్నారం మున్సిపల్ మాల సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి 12 లక్షల రూపాయల భారీ విరాళం అందించి తన దైవభక్తిని మరోమారు చాటుకున్నారు. సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి ఆలయ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించి.. ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా భక్తి ప్రపత్తులతో నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవభక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజాసేవను తన బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా.. ప్రజలను ఐక్యం చేసే సామాజిక వేదికలని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సొంత నిధులతో నియోజకవర్గం వ్యాప్తంగా 200 లకు పైగా దేవాలయాలు, మసీదులు, ఆశిర్ఖానాలు, చర్చీలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



నిరంతరం ఆధ్యాత్మికతను ప్రోత్సహించడంతో పాటు ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్ సేవా కార్యక్రమాలు ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 24:** అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు కలిపి సుమారు 1.75 లక్షల నోటీసులు జారీ చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే 75 వేల నోటీసులు జనరేట్ చేసినట్లు వివరించారు. అనామలీస్ క్రింద సుమారు 80 వేల మంది ఓటర్ల పేర్లలో వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిపారు. అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేసి, అవసరమైన ఓటర్లను విచారణకు పిలిచేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. నోటీసులు జారీ చేసే సమయంలోనే సంబంధిత ఓటర్లు విచారణకు హాజరయ్యే సమయంలో సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు, ఆధారాలపై అవగాహన కల్పిస్తున్నామని, ఎస్ఐఆర్ ప్రక్రియపై మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. వీడియో సమావేశం అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని, నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని తెలిపారు. నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫొటోతో సహా నమోదు చేయాలని, విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్,






ఖమ్మం ఆర్డీఓ ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, డీటీ అన్సారీ, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కల్వచర్లలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ మహా శిబిరం ఘనంగా విజయవంతం



**రామగిరి, ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):-** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో కల్వచర్ల గ్రామంలో ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. కల్వచర్ల శ్రీ సత్యసాయి భజన మండలి కన్వీనర్, విశ్రాంత సింగరేణి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీ నూక రమేష్ స్వగృహం "సాయి నిలయం" నందు ఉదయం 9.00 గంటలకు భగవాన్ పూజా కార్యక్రమంతో శిబిరం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి అడ్రియాల ప్రాజెక్టు ఏరియా జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థ తెలంగాణ రాష్ట్ర వైద్య విభాగం కోఆర్డినేటర్ భాస్కరరావు, జిల్లా బాధ్యులు వెంకటస్వామి, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ హనుమంతరావు, కల్వచర్ల సర్పంచ్ శారద కుమారస్వామి, మాజీ జెడ్పిటిసి రమణారెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ లోని ప్రఖ్యాత యం.ఎన్.జే ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజినల్ క్యాన్సర్ సెంటర్ నుండి డా.విజయ్ కుమార్ బృందం – క్యాంపు కోఆర్డినేటర్ సి.ఎస్.ప్రసాద్, స్టాఫ్ నర్సులు సంతోషి, రేవతి, దంత వైద్యులు జి.సాయితేజ వైద్య సేవలందించారు. ఈ శిబిరంలో మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, పురుషులకు నోటి క్యాన్సర్ సంబంధిత పరీక్షలు నిర్వహించబడ్డాయి. కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 53 మంది మహిళలు, 63 మంది పురుషులు – మొత్తం 116 మంది గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా సేవా సంస్థలో సేవలందిస్తున్నానని, గత 4 సంవత్సరాలలో తెలంగాణలోని 31 జిల్లాల్లో 60 ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలు నిర్వహించి 7000 మందికి పైగా పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ పరీక్షలలో క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి సత్యసాయి సేవా సంస్థల ద్వారా పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. 80 ఏళ్ల వయసులో కూడా అలుపెరుగని సేవా నిరతితో పనిచేస్తున్న భాస్కరరావు ని జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. పెద్దపల్లి, 8వ కాలనీ సమితి కన్వీనర్లు వేంకటేశం, కటుకూరి శ్రీనివాస్ రెడ్డి, గోదావరిఖని, పెద్దపల్లి సమితిల సేవాదళ్ సభ్యులు, కల్వచర్ల భజన మండలి సభ్యులు కాంటెవాడ బుగ్గాజీ, గరిగంటి రాజం, కొండ సమ్మయ్య, కొలిపాక సారయ్య, తోట ప్రసాద్, చౌదవరపు లింగమూర్తి, సదాశివ రెడ్డి, కిష్టయ్య, తాటిపాముల రాజ్యలక్ష్మి శ్రీనివాస్, భాస్కర్, స్వరూప, నూక వాణి, పెరుమాల్ సరవణన్ తదితర భక్త బృందం ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేశారు.

# అమీన్ పూర్లో ప్రభుత్వ సీలింగ్ భూములపై రీ-లేఅవుట్లు

- నిర్మాణాలు, భారీ స్థాయి విక్రయాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి అడ్వకేట్ వి. రవికృష్ణ
- 1035, 1036, 1042, 1043, 1044 సర్వే నంబర్లపై జిల్లా కలెక్టర్‌కు అత్యవసర ప్రజా ప్రయోజన ఫిర్యాదు



**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్):** అమీన్ పూర్, మండలంలోని సర్వే నంబర్లు 1035, 1036, 1042, 1043, 1044 మరియు సంబంధిత భూములపై, భూముల అసలు స్వభావం, ప్రభుత్వ సీలింగ్ భూముల స్థితి, పాత లేఅవుట్లు, రీ-లేఅవుట్లు, నిర్మాణాలు, రిజిస్ట్రేషన్లు కోట్ల రూపాయల విలువైన విక్రయ కార్యకలాపాలపై సమగ్ర రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్, మున్సిపల్ మరియు పోలీస్ దర్యాప్తు చేపట్టాలని అడ్వకేట్ వి. రవికృష్ణ సంగారెడ్డి జిల్లా కలెక్టర్కు సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీఓ, అమీన్ పూర్ తహసీల్దార్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ, అమీన్ పూర్ జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, సైబరాబాద్ పోలీస్ అధికారులకు సమగ్ర ప్రతినిధిత్వం సమర్పించారు. 2014 ఫిబ్రవరి 21న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కామన్ ఆర్డర్‌లో అమీన్ పూర్ తదితర ప్రాంతాల్లోని భూములకు సంబంధించి ప్రైవేట్ పట్టా భూములు, ప్రభుత్వ భూములు, వివిధ రకాల అసైన్డ్ భూములు ఉన్నట్లు చారిత్రక రికార్డుల ఆధారంగా ప్రస్తావించబడిందని రవికృష్ణ తెలిపారు. ప్రతి భూమి యొక్క ప్రస్తుత హక్కు, వర్గీకరణ మరియు బదలాయింపు సామర్థ్యాన్ని అసలు రెవెన్యూ, సర్వే, అసైన్మెంట్, సీలింగ్, ఇనాం,ఓ ఆర్ సి, మ్యూటేషన్ రికార్డుల ఆధారంగా ప్రత్యేకంగా నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. సర్వే నంబర్లు 1035, 1036లోని భూమికి సంబంధించి 1999లో ఆర్డీవో, సంగారెడ్డి జారీ చేసినట్లు పేర్కొంటున్న పత్రం తమ వద్ద ఉందని, దాని అసలు ఇనాం,ఓ ఆర్ సి, ఫైల్‌ను అధికారులు పరిశీలించాలని రవికృష్ణ కోరారు. ఓ ఆర్ సి చట్టబద్ధతపై ముందుగానే తుది నిర్ణయం తీసుకోకుండా, అసలు దరఖాస్తు, నోటీసులు, విచారణ రికార్డులు, ఇనాం వర్గీకరణ, సీలింగ్ రికార్డులు, మ్యూటేషన్, ప్రీమియం, దరఖాస్తుదారుడి అర్హత మరియ ఓ ఆర్ సి ఆధారమైన పూర్తి రికార్డులను పరిశీలించాలని ఆయన కోరారు. 1042, 1043, 1044 సర్వే నంబర్లకు సంబంధించిన అందుబాటులో ఉన్న రెవెన్యూ ఎన్క్రోచ్‌మెంట్ పత్రాలు కొన్ని భాగాలను సీలింగ్ లాండ్స్ పేర్కొంటూ, వాటిపై ఆక్రమణ నిర్మాణాలను ప్రస్తావిస్తున్నాయని ప్రతినిధిత్వంలో పేర్కొన్నారు. అందువల్ల ఈ సర్వే నంబర్లకు సంబంధించి అసలు ప్రభుత్వ రికార్డులను పిలిపించి భూమి వర్గీకరణ, విస్తీర్ణం, ప్రభుత్వంలో వెస్టింగ్, ప్రస్తుత స్వాధీనం, నిర్మాణాలు, లేఅవుట్లు, తదుపరి రిజిస్ట్రేషన్లు మరియు బిల్డింగ్ అనుమతులు అన్నింటినీ సర్వే నంబర్ వారీగా పరిశీలించాలని కోరారు. రీ-లేఅవుట్లు, ప్లస్ వన్ ఇళ్లు రూకోటి.1.50 లక్షలు నుంచి రూ.2 కోట్ల వరకు విక్రయాలపై దర్యాప్తు, ప్రస్తుతం సంబంధిత భూముల్లో కొన్ని ప్రాంతాల్లో తాజా రీ-లేఅవుట్ కార్యకలాపాలు, జి ప్లస్ వన్ అంతస్తుల ఇళ్ల నిర్మాణం జరుగుతున్నట్లు సమాచారం ఉందని, ఒక్కో ఇంటిని సుమారు రూ.కోటి1.50 లక్షలు నుంచి రూ.2.00 కోట్లకు మార్కెట్ చేస్తున్నట్లు లేదా విక్రయానికి ఉంచుతున్నట్లు ప్రతినిధిత్వంలో పేర్కొన్నారు. ఈ సమాచారాన్ని అధికారులు స్వతంత్రంగా భౌతిక పరిశీలన, మున్సిపల్ రికార్డులు, రిజిస్ట్రేషన్ రికార్డులు మరియు ఇతర ఆధారాల ద్వారా ధృవీకరించాలని కోరారు. వందల కోట్ల ఆర్థిక లావాదేవీల కోణంలో దర్యాప్తు చేయాలి ఇలాంటి కార్యకలాపాలు అనేక ప్లాట్లు, ఇళ్లు వివిధ లావాదేవీలకు సంబంధించినవిగా తేలితే, మొత్తం వ్యవహారంలో భారీ స్థాయి ఆర్థిక లావాదేవీలు అనేక మంది కొనుగోలుదారులు ప్రభావితమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల మొత్తం భూమి విస్తీర్ణం, సృష్టించిన ప్లాట్లు, నిర్మించిన ఇళ్లు, విక్రయాలు, పొందిన మొత్తాలు, బిల్డర్లు, ఫైనాన్షియర్లు, మధ్యవర్తులు మరియు తుది లబ్ధిదారులను గుర్తించాలని కోరారు. ప్రభావశీల వ్యక్తుల పాత్రపై దర్యాప్తు. తనకు అందిన సమాచార ప్రకారం మాజీ స్థానిక మున్సిపల్ చైర్మన్ కుమారుడు మరియు కొంతమంది బిల్డర్లు డెవలపర్లు ఈ కార్యకలాపాలతో సంబంధం కలిగి ఉండవచ్చని సమాచారం ఉందని రవికృష్ణ తెలిపారు. అయితే ఎవరి ప్రమేయాన్నీ నిర్ధారిత వాస్తవంగా తాను ప్రకటించడం లేదని, రిజిస్ట్రేషన్, రెవెన్యూ మరియు ఆర్థిక రికార్డుల ఆధారంగా స్వతంత్ర దర్యాప్తు ద్వారా మాత్రమే వాస్తవాలను నిర్ధారించాలని ఆయన స్పష్టం చేశారు. అనేక వ్యక్తులు, వరుస ఆస్తి లావాదేవీలు, రీ-లేఅవుట్లు, నిర్మాణాలు మరియు భారీ ఆర్థిక లావాదేవీల అంశం ఉన్నందున సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో సమన్వయంతో దర్యాప్తు జరపాలని కోరారు. అవసరమైతే, చట్టపరంగా సముచితమైన సందర్భంలో లేదా ఇతర ప్రత్యేక దర్యాప్తు విభాగానికి ఆర్థిక అంశాలను అప్పగించి బ్యాంకు లావాదేవీలు, విక్రయ సొమ్ము, బిల్డర్లు కాంట్రాక్టర్లకు చెల్లింపులు, మధ్యవర్తులు, ఫైనాన్సింగ్ తుది లబ్ధిదారులను గుర్తించాలని కోరారు. బహుళ వ్యక్తులు, నిరంతర కార్యకలాపాలు, రీ-లేఅవుట్లు, ఆర్థిక లావాదేవీలు వంటి అంశాలు దర్యాప్తులో నిర్ధారణ అయితే, చట్టపరమైన నిబంధనలు వర్తిస్తాయా అనే అంశాన్ని సంబంధిత పోలీస్ అధికారులు సాక్ష్యాల ఆధారంగా పరిశీలించాలని కోరారు. అమాయక కొనుగోలుదారులను రక్షించాలి. ప్రస్తుతం ఇలాంటి ఆస్తులను కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్న అమాయక ప్రజలు భారీ మొత్తాలను చెల్లించి తరువాత హక్కు, సర్వే గుర్తింపు లేదా ప్రభుత్వ భూమి వివాదాల్లో చిక్కుకునే ప్రమాదం ఉందని రవికృష్ణ హెచ్చరించారు. అందువల్ల భూముల అసలు స్థితి నిర్ధారించే వరకు అనధికారిక రీ-లేఅవుట్లు, నిర్మాణాలు మరియు కొత్త థర్డ్-పార్టీ హక్కుల సృష్టిని చట్టపరమైన అధికారాల పరిధిలో నిరోధించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమి రక్షణ ప్రజల డబ్బు రక్షణ రెండూ అత్యవసరం. సర్వే నంబర్ల వారీగా జాయింట్ ఫిజికల్ సర్వే, అసలు రెవెన్యూ రికార్డుల పరిశీలన, రిజిస్ట్రేషన్ లావాదేవీల పూర్తి ట్రేసింగ్, మున్సిపల్ అనుమతుల ధృవీకరణ, ఆర్థిక లావాదేవీల దర్యాప్తు బాధ్యుల గుర్తింపుతో సమగ్ర చర్యలు తీసుకోవాలని రవికృష్ణ కోరారు. ఈ అంశాన్ని పరిగణించి, చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్ అన్ని సంబంధిత అధికారులను అడ్వకేట్ రవికిష్ణ కోరారు.

## మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


### మొక్కలు నాటడం మన అందరి బాధ్యత

### మొక్క నాటి నీరుపోస్తున్న పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి



**రామగిరి, ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):-** పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే భూమిపై పచ్చదనం పెరగాలినీ మొక్కలు నాటి సంరక్షిస్తేనే పచ్చదనం లభిస్తుందని, తద్వారా కాలుష్యం లేకుండా ప్రాణకోటికి స్వచ్ఛమైనగాలి లభిస్తుందని తద్వారా వర్షాలు కూడా సమృద్ధిగా కురుస్తాయని మొక్కలు నాటడం మన అందరి బాధ్యత అని పెద్ద పల్లి జిల్లా పోలీస్ కమిషనర్ బి రామ్ రెడ్డి అన్నారు. సోమవారం అటవీశాఖ వారి ఆధ్వర్యంలో శ్రీ ఆదివారహ స్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలనునాటారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఒకరు మొక్కలు నాటాలని పేర్కొన్నారు. అలాగే శ్రీ ఆదివారా స్వామి ప్రాంగణంలో మొక్క నాటడం నా అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కాలుష్య నివారణకు మొక్కలు నాటి చెట్లను పెంపకం చేస్తే మనకు కాలుష్యంత తొలగిపోయి వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, డిస్ట్రిక్ ఫారెస్ట్ ఆఫీసర్ దేవదాసు, ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ ఈవో కాంత రెడ్డి , రేంజ్ ఆఫీసర్ వినయ్ నాయక్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రహమతుల్లా ఖాన్, తోపాటు పలువురు పాల్గొన్నారు.

## మాజీ ఉపసర్పంచ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**రామగిరి, ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):-** గత నెల 25న అనారోగ్యంతో మృతి చెందిన ఇనుముల గౌరమ్మ నెల మాసికం సోమవారం రోజున జరిగిన సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, మంథని మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్ట శైలజ ఇనుముల సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించి, మృతికి గల కారణాలు తెలుసుకొని, ఇనుముల గౌరమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మాజీ చైర్మన్ తో పాటు మంథని బి.ఆర్.ఎస్. నాయకులతో పాటు ఇనుముల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ గత నెల 24 న సికింద్రాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మా అమ్మ దగ్గరకు రాగా...సరిగ్గా నెల తర్వాత తల్లిని కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న నన్ను దాదాపు 26 ఏండ్ల తర్వాత మా ఇంటికి వచ్చి నన్ను, మా కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దంపతులకు మా కుటుంబ సభ్యుల తరపున ఇనుముల సత్యనారాయణ, హైకోర్టు న్యాయవాది హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు దక్కాలి..

### ముగ్గు పోసిన తర్వాత ఇల్లు ఎలా రిజెక్ట్ చేస్తారు?

### న్యాయం చేయాలని కమాన్‌పూర్ ప్రజావాణిలో విజ్ఞప్తి



**రామగిరి,ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):-** మాది అత్యంత నిరుపేద కుటుంబం ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో సంబరపడ్డాం. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు వచ్చి స్వయంగా స్థలాన్ని పరిశీలించి ముగ్గు కూడా పోశారు. తీరా ఇప్పుడు సాంకేతిక కారణాలంటూ ఏకపక్షంగా ఇల్లును రిజెక్ట్ చేస్తే మేము ఎక్కడికి వెళ్లాలి అని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కమాన్‌పూర్ మండల స్థాయిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు బాధితులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొయ్యడ కుమార్ మాట్లాడుతూ.. తమ కుటుంబ పరిస్థితిని ప్రత్యక్షంగా చూసిన తర్వాతే అధికారులు ఇల్లు కేటాయించారని తెలిపారు. ఇల్లు కట్టుకునేందుకు ముగ్గు పోసి సిద్ధమవుతున్న తరుణంలో, మార్కింగ్ కూడా పూర్తయ్యాక ఉన్నట్టుండి జాబితా నుంచి తమ పేరును తొలగించడం తమను తీవ్ర మనోవేదనకు గురిచేసిందని వాపోయారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహాల పథకం నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడానికేనని, ఇలాంటి నిర్ణయాల వల్ల అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందారు. కావున ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి పరిశీలన పునఃపరిశీలించాలని కోరారు. తమ కుటుంబ అర్హతను గుర్తించి కొయ్యడ ఐలమ్మ పేరున ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా న్యాయం చేయాలని కుమార్ వేడుకున్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులతో మరింత సులభంగా రేషన్ సేవలు

### సర్పంచ్ రేండ్ల శారద-కుమారస్వామి



**రామగిరి, ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందనున్నాయని కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి అన్నారు.రామగిరి మండలం కల్వచర్ల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సేవలు మరింత సులభతరం కావడంతో పాటు పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. కల్వచర్ల గ్రామానికి 1500 రేషన్ కార్డులు వచ్చాయి.అర్హులైన కుటుంబాలు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా గ్రామపంచాయతీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రదీప్,ఉప సర్పంచ్ కస్ప మహేందర్,గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, జీపీవో తిరుపతమ్మ, రేషన్ డీలర్లు రాపెల్లి జానకి రామ్, కన్నూరి శ్రీనివాస్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భారీ స్కోర్ వద్ద భారత్ డిక్లేర్డ్!

# స్పోర్ట్స్

### ధ్రువ్ జురెల్ అజేయ శతకం

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ చేసింది. ధ్రువ్ జురెల్(177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. రిషభ్ పంత్(89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. తొలి రోజు ఆటలో దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) సెంచరీతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/106) నాలుగు వికెట్లు తీయగా..ప్రభాత్ జయసూర్య కేశర నువాంత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లాహిరు కుమారాకు ఒక వికెట్ దక్కింది. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా 2 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. శ్రీలంక 3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 8 పరుగులు చేసింది. లాహిరు ఉడారా(1) ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. వర్షం కారణంగా రెండో రోజు 56 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. 300/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్‌కు



ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓవర్‌నైట్ బ్యాటర్ సారాన్ష్ జైన్(6) రెండు పరుగులు మాత్రమే చేసి అసితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో తొలి రోజు ఆటలో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషభ్ పంత్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. తనదైన శైలిలో చెలరేగిన ఈ జోడీ వేగంగా పరుగులు రాబట్టింది. ముఖ్యంగా పంత్ భారీ షాట్లతో లంకబౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో పంత్ 81 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా.. ధ్రువ్ జురెల్ 97 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. దాంతో భారత్ 419/6 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో పంత్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అయితే అతన్ని కుశార నువాంత క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మానవ్ సుతార్ రాగా.. ధ్రువ్ జురెల్ తన జోరును కొనసాగించాడు. ఆచితూచిన ఆడిన మానవ్ సుతార్(18)ను ప్రభాత్ జయసూర్య కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చగా.. సిరాజ్‌తో కలిసి ధ్రువ్ జురెల్ రెండో సెషన్‌ను ముగించాడు. వర్షం కారణంగా కాస్త ముందుగానే ఈ సెషన్ ముగిసింది. ఆఖరి సెషన్‌లో దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ 171 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ వెంటనే భారీ సిక్సర్‌తో ధ్రువ్ జురెల్ తన జోరు కనబర్చగా.. సిరాజ్(3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ వేగంగా పరుగులు రాబట్టి జట్టు స్కోర్‌ను 500 ధాటించాడు. ఆ వెంటనే భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది.




## ఇంగ్లాండ్ స్టార్ ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్ అరెస్ట్

పాకిస్తాన్‌తో రెండో టెస్ట్ ప్రారంభం కావడానికి ముందే ఇంగ్లాండ్ క్రికెట్ జట్టులో తీవ్ర కలకలం చెలరేగింది. ఇంగ్లాండ్ స్టార్ ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్ శనివారం రాత్రి డెర్బీలోని ఒక నైట్‌క్లబ్ వద్ద జరిగిన గొడవలో ఇరుక్కున్నాడు. పోలీసులు అతడి చేతులకు బేడీలు వేసి క్లబ్ నుంచి బయటకు తీసుకెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో విపరీతంగా హల్చల్ చేస్తున్నాయి. డెర్బీషైర్‌తో జరిగిన కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో దర్హామ్ తరఫున ఆడిన కార్స్, తన సహచర బౌలర్ మాథ్యూ పాట్స్ తో కలిసి నైట్‌క్లబ్‌కు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ వ్యవహారంపై ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అధికారికంగా స్పందిస్తూ సమగ్ర విచారణ జరుపుతున్నట్లు తెలిపింది. డెర్బీలో జరిగిన కౌంటీ మ్యాచ్‌లో దర్హామ్ జట్టు 338 పరుగుల తేడాతో విజయం సాధించిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకుంది. 31 ఏళ్ల బ్రైడన్ కార్స్ క్లబ్ లో గొడవకు దిగడంతో పోలీసులు నేరుగా రంగంలోకి దిగి అతడిని అరెస్టు చేశారు. "గత రాత్రి డెర్బీలో జరిగిన సంఘటన మా దృష్టికి వచ్చింది. దీనిపై ప్రస్తుతం దర్యాప్తు స్టార్ట్ అయింది, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం" అని ఈసీబీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ వీడియో బయటకు రావడంతో ఇంగ్లాండ్ క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆస్ట్రేలియా పర్యటనలో జరిగిన 2025-26 యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ ఘోరంగా ఓడినప్పటికీ, బ్రైడన్ కార్స్ 22 వికెట్లతో అద్భుతంగా రాణించాడు. ప్రస్తుతం పాకిస్తాన్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో తొలి రెండు టెస్టుల కోసం ఎంపిక చేసిన ఇంగ్లాండ్ స్క్వాడ్‌లో కార్స్ చోటు దక్కించుకున్నాడు. లీడ్స్ వేదికగా జరిగిన మొదటి టెస్టులో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 103 పరుగులతో గెలిచినప్పటికీ అతడికి తుది జట్టులో చోటు లభించలేదు. లార్డ్స్ వేదికగా గురువారం నుంచి రెండో టెస్ట్ ప్రారంభం కానున్న సమయంలో ఈ నైట్‌క్లబ్ వివాదం బయటపడటం జట్టు మేనేజ్‌మెంట్‌కు పెద్ద తలనొప్పిగా మారిందనడంలో సందేహం లేదు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా టూర్లలో హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్, గస్ అట్కిన్సన్ వంటి ప్లేయర్లు నైట్‌క్లబ్ వివాదాల్లో చిక్కుకోవడంతో గతంలో రాత్రిపూట కర్ఫ్యూ నిబంధనను అమలు చేశారు. అయితే బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ తర్వాత టెస్ట్ కెప్టెన్సీని మళ్లీ చేపట్టిన జో రూట్ ఇటీవల కర్ఫ్యూ నిబంధనలను సులభతరం చేశాడు. "ప్లేయర్లు అందరూ ఎదిగిన వ్యక్తులు, మైదానం వెలుపల బాధ్యతాయుతంగా ఎలా ప్రవర్తించాలో వారికి తెలుసు" అని రూట్ చెప్పిన కొద్ది రోజులకే బ్రైడన్ కార్స్ పోలీసులకు దొరికిపోవడం జట్టు క్రమశిక్షణపై అంతా వేలెత్తి చూపిస్తున్నారు.

## దేవదత్ పడిక్కల్ వరుస సెంచరీలు

శ్రీలంక పర్యటనలో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అదరగొడుతున్నాడు. ఇటీవల గాలె వేదికగా జరిగిన తొలి మ్యాచ్?లో రెండు ఇన్నింగ్స్?ల్లో (167, 44) రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?గా నిలిచాడు. తాజాగా కొలంబో టెస్టులోనూ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, మరో సెంచరీ నమోదు చేశాడు. అదివారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్?లో పడిక్కల్ 117 పరుగులతో రాణించాడు. దీంతో ప్రస్తుతం అందరి కళ్లూ పడిక్కల్?పై పడ్డాయి. ఛెతేశ్వర్ పుజారా తర్వాత టెస్టుల్లో భారత్?కు నెం 3 స్థానాన్ని భర్తీ చేయడం సవాల్?గా మారింది. టెస్టుల్లో కీలకమైన ఈ వన్?డౌన్?లో పలువురు బ్యాటర్లను పరీక్షించి చూసింది. అయితే గతేడాది సాయి సుదర్శన్ సుదీర్ఘ ఫార్మాట్?లో అరంగేట్రం చేయడంతో అతడే ఆ ప్లేస్?లో బ్యాటింగ్? చేస్తున్నాడు. అప్పట్నుంచి నెం 3 స్థానానికి మేనేజ్?మెంట్ కూడా సుదర్శన్ పేరునే పరిశీలిస్తుంది. ఈ లంక పర్యటనలో కూడా మొదట సుదర్శన్?నే ఎంపిక చేసింది. అయితే అతడు గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆ ఛాన్స్ పడిక్కల్?కు వచ్చింది. అలా వచ్చిన అవకాశాన్ని పడిక్కల్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని పరుగులు సాధిస్తున్నాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్?లో ఏకంగా 167 పరుగుల భారీ ఇన్నింగ్స్?తో ఆకట్టుకున్నాడు. నంబర్ 3 స్థానంలో కొంతకాలంగా ఫాస్ట్, స్పిన్ బౌలింగ్ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కొనే టెస్టు బ్యాటర్ కోసం మేనేజ్?మెంట్ అన్వేషిస్తోంది. అయితే ఈ సిరీస్?లో వరుసగా రెండు మ్యాచ్?ల్లో సెంచరీ నమోదు చేయడంతో పడిక్కల్?పై ప్రశంసలు కురుస్తున్నాయి. సుదర్శన్ వచ్చినా జట్టులోంచి పడిక్కల్?ను తీసివేయొద్దంటూ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. తన ప్రదర్శనతోనూ పడిక్కల్ సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. నిలకడగా రాణిస్తూ పరుగులు చేస్తుండడంతో ఈ ప్లేస్?కు పడిక్కల్ సెట్ అయిపోయినట్లే అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత టూర్?లో రెండు సెంచరీలు సాధించినంత మాత్రాన పడిక్కల్?ను అప్పుడే నెం 3 బ్యాటర్ అని కన్ఫర్మ్ అయిపోడానికి వీల్లేదు. ఎందుకంటే అతడికి అసలు పరీక్ష ఇప్పుడిప్పుడే మొదలవుతుంది. ఈ నిలకడను ఇలాగే కొనసాగిస్తేనే అతడికి వన్?డౌన్?లో అవకాశం ఉంటుంది. అంతేకానీ ఒకట్రెండు సిరీస్?లకు మాత్రమే ఈ ప్రదర్శన పరిమితమైతే మాత్రం కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. గతంలో ఎందరో క్రికెటర్లు వచ్చిన కొత్తలో అదరగొట్టేసి, ఆ తర్వాత తుస్సుమనిపించారు. వాళ్లంతా ఇప్పుడు కనుమరుగైపోయారు. అందుకే పడిక్కల్ అలా కాకుండా పరిస్థితులకు తగ్గట్లు ఆడుతూ ఫామ్?ను కాపాడుకోవాల్సి ఉంటుంది. పడిక్కల్ ప్రస్తుతం నిలకడగా ఆడుతుండడంతో చాలా కాలంగా నంబర్ 3 స్థానం కోసం పోటీ పడుతున్న ఆటగాళ్లకు ఇది సవాలుగా మారుతుంది. అందులో సాయి సుదర్శన్ కూడా ఒకడు. గతేడాది నుంచి వన్?డౌన్?లో ఆడుతున్న సాయి సుదర్శన్ 7 మ్యాచ్?ల్లో 383 పరుగులు చేశాడు. ఇప్పుడు పడిక్కల్ ఇలాగే తన ఫామ్?ను కొనసాగిస్తే మాత్రం జట్టులో తన స్థానం ఖాయంగా ఉంటుంది. అప్పుడు సుదర్శన్ లాంటి ప్లేయర్లపై ఎఫెక్ట్ పడే అవకాశం ఉంటుంది.




## పంత్ సరికొత్త చరిత్ర..

భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరో అరుదైన చారిత్రాత్మక రికార్డును సాధించాడు. విదేశాల్లో లేదా న్యూట్రల్ వేదికల్లో జరిగిన టెస్టుల్లో భారత వికెట్ కీపర్‌గా అత్యధిక పరుగులు సాధించిన లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న ఆల్ టైమ్ రికార్డును పంత్ బ్రేక్ చేశాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్ రెండో రోజు ఆటలో పంత్ ఈ ఘనతను నమోదు చేశాడు. ఈ విభాగంలో 2500 పరుగుల మార్కును దాటిన పంత్, ధోనీ సాధించిన 2496 పరుగుల రికార్డును అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ధోనీ 32.84 సగటుతో ఆ పరుగులు చేయగా, పంత్ దాదాపు 42 సగటుతో ఈ మైలురాయిని అందుకోవడం గమనార్హం. ఈ లిస్టులో ఫరూక్ ఇంజనీర్ (1209 రన్స్), సయ్యద్ కిర్మాణి (1109 రన్స్), కిరణ్ మోరే (901 రన్స్) తర్వాతి స్థానాల్లో నిలిచారు.. ఈ రికార్డు నమోదు కావడానికి ఒక రోజు ముందు పంత్ మైదానంలో తీవ్ర గాయానికి లోనయ్యాడు. మొదటి రోజు ఆట మూడో సెషన్‌లో శ్రీలంక పేసర్ లహిరు కుమార వేసిన షార్ట్ పిచ్ బంతిని పుల్ చేసే క్రమంలో పంత్ ఎడమ చేతి మణికట్టుకు గాయం అయింది. నొప్పితో విలవిల్లాడిన పంత్ కు భారత జట్టు ఫిజియో ఐస్ ప్యాక్ పెట్టి కట్టు కట్టినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ తీవ్ర అసౌకర్యంగా అనిపించడంతో 15 బంతుల్లో 3 పరుగులు చేసిన తర్వాత 58వ ఓవర్లో పంత్ రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగాడు. గాయం తీవ్రత భయపెట్టినప్పటికీ, రెండో రోజు ఉదయం భారత్ ఆరో వికెట్ కోల్పోయిన తర్వాత పంత్ తిరిగి బ్యాటింగ్ కు వచ్చాడు. అసిథ ఫెర్నాండో, ఇతర లంక పేసర్లు వరుసగా బౌన్సర్లతో దాడి చేస్తూ అతడి భుజానికి కూడా బంతులు తాకించినా పంత్ ఏమాత్రం లెక్క చేయలేదు. నొప్పిని భరిస్తూనే మరో వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ తో కలిసి జట్టు ఇన్నింగ్స్ ను ముందుకు నడిపించాడు. ఇద్దరూ కలిసి సమయోచిత భాగస్వామ్యంతో లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొని స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లారు. శ్రీలంక బౌలర్లు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న సమయంలో పంత్ చూపిన అంకితభావం జట్టుకు కొండంత బలాన్ని ఇచ్చిందనడంలో సందేహం లేదు. ఇక వీళ్లిద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ, అబేధ్యమైన ఏడో వికెట్ కు 112 పరుగులు జోడించారు. లంచ్ విరామ సమయానికి టీమిండియా 112 ఓవర్లలో 6 వికెట్లకు 419 పరుగులు చేసింది. పంత్ (63 బ్యాటింగ్)తో పాటు జురేల్ (59 బ్యాటింగ్) అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఫెర్నాండోకు నాలుగు వికెట్లు దక్కాయి. ఇప్పటికే గాలే టెస్ట్ లో భారత్ 165 రన్స్ తో గెలిచి సిరీస్ లో 1-0 లీడ్ లో ఉండగా, కొలంబోలోనూ పంత్ పోరాటంతో జట్టు పటిష్ట స్థితికి చేరింది.

## సీఎస్‌కే కోచ్‌గా దినేశ్ కార్తీక్‌ను నియమించండి

### ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సూచన

టీమిండియా మాజీ క్రికెటర్ దినేష్ కార్తీక్‌ను చెన్నైసూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా నియమించాలని ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సూచించాడు. ఐదు సార్లు ఛాంపియన్ అయిన సీఎస్‌కేకు విదేశీ కోచ్‌ల కంటే స్థానిక వ్యక్తులే మెరుగైన సేవలు అందించగలరని మాథ్యూ హేడెన్ అభిప్రాయపడ్డాడు.చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల పాటు సేవలందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ ఇటీవలే ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. అతను ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా.. సీఎస్‌కే నయా హెడ్ కోచ్ కోసం అన్వేషణ మొదలుపెట్టింది.తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన మాథ్యూ హేడెన్.. స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను తప్పించడం సాహోసోపేతమైన నిర్ణయంగా పేర్కొన్నాడు. స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడిన మాథ్యూ హేడెన్.. దినేష్ కార్తీక్‌కు హెడ్ కోచ్ పదవి బాధ్యతలు ఇవ్వాలని చెప్పాడు. 'సీఎస్‌కే వంటి పెద్ద జట్టుకు విదేశీ కోచ్ కోచ్ కంటే స్థానిక నేపథ్యం ఉన్న కోచ్ మరింత అనుకూలంగా ఉంటారు. దినేష్ కార్తీక్‌కు చెన్నై క్రికెట్ సంస్కృతి బాగా తెలుసు. కాబట్టి సీఎస్‌కే హెడ్ కోచ్ పదవికి దినేష్ కార్తీక్ సరైన వ్యక్తి. ఐపీఎల్ నుంచి రిటైర్ అయిన తర్వాత దినేశ్ కార్తీక్.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కి బ్యాటింగ్ కోచ్, కన్సల్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మార్గదర్శకత్వంలో ఆర్‌సీబీ 2025లో తమ తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకోవడమే కాకుండా ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ టైటిల్ నిలబెట్టుకుంది. సీఎస్‌కే హెడ్ కోచ్ పదవి చేపట్టేందుకు దినేష్ కార్తీక్ సరిగ్గా సరిపోతాడు.'అని మాథ్యూ హేడెన్ చెప్పుకొచ్చాడు. కొత్త కోచ్ ఎంపికపై సీఎస్‌కే ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రటకన చేయలేదు. కానీ పలువురు మాజీ ఆటగాళ్ల పేర్లు ప్రచారంలో ఉన్నాయి.ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ పేరు బలంగా వినిపిస్తోంది.

# యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట!

టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట లభించింది. శ్రీలంక ప్లేయర్ అసిత ఫెర్నాండోతో గొడవ పడిన ఘటనలో ఐసీసీ జరిమానాతో సరిపెట్టింది. యశస్వి జైస్వాల్‌తో పాటు అసిత ఫెర్నాండో మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. ఈ ఘటనలో యశస్వి జైస్వాల్‌దే తప్పంటూ మాజీ క్రికెటర్లు, కామెంటేటర్లు తీర్పు ఇచ్చారు. దాంతో యశస్వి జైస్వాల్‌పై నిషేధం పడుతుందని అంతా అనుకున్నారు. కానీ మ్యాచ్ రిఫరీ లెవెల్-1 నేరంగా పరిగణించి రూల్స్ ప్రకారం చర్యలు తీసుకున్నారు. ఈ చర్యలకు సంబంధించి ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఆదివారం కొలంబో వేదికగా మొదలైన రెండో టెస్ట్ తొలి రోజున ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ 1 రూల్‌ను ఉల్లంఘించిన శ్రీలంక పేసర్ అసితా ఫెర్నాండో, భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ల మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నారు. ఆర్టికల్ 2.12 ప్రకారం ఒక ప్లేయర్, సపోర్ట్ స్టాఫ్, అంపైర్‌తో భౌతిక ఘర్షణకు దిగడం నేరం.మ్యాచ్ ఫీజు కోతతో పాటు చెరో డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. తమ తప్పులను ఫెర్నాండో, జైస్వాల్ అంగీకరించారు. దాంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే ఈ శిక్షలు ఖరారు చేస్తున్నాం. లెవెల్ 1 ఉల్లంఘనకు పాల్పడినప్పుడు కనీస శిక్షగా హెచ్చరిక, గరిష్టంగా ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్స్ ఉంటాయి.'అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అసిత ఫెర్నాండో వేసిన ఒకే ఓవర్లో




వరుసగా మూడు ఫోర్లు బాదాడు. ఆ తర్వాత ఫెర్నాండో ఒక అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను 45 పరుగుల వద్ద క్లీన్ బౌల్డ్ చేశాడు. వికెట్ తీసిన అనంతరం ఫెర్నాండో అత్యుత్సాహంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. ఈ క్రమంలో అతను ఏదో మాట అన్నాడు. అది విన్న జైస్వాల్ ఆగ్రహంతో అతనిపైకి దూసుకెళ్లాడు. ఒకరికొకరు ఎదురెదురుగా నిలబడి నోరుపారేసుకున్నారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. దాంతో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండీస్ జోక్యం చేసుకొని ఇద్దర్నీ విడదీసాడు.

# విశ్వజి



## బీట్ రూట్ మార్చండి!

ఆడవాళ్లలో రక్త వృద్ధికి సూచించే కూరగాయల్లో మొదటి స్థానంలో ఉంటుంది బీట్‌రూట్. అలాగని దాన్ని కీరా, క్యారెట్లలాగా అమాంతం తినడం అంత సులభం ఏం కాదు. అలాగని విటమిన్–సి తో పాటు ఐరన్, ఫోలేట్‌లాంటి ఎన్నో పోషకాలు ఉండే దీన్ని వదిలేయడమూ మంచి విషయమేం కాదు. అందుకే ఈ దుంపను సులభంగా ఆహారంలో భాగం చేసుకునే మార్గాలు చూద్దాం. సలాడ్లు తినేప్పుడు బీట్‌రూట్‌ను తురిమి కలుపుకొని, దానితో పాటు చియా, అవిసెలాంటి గింజల్ని జోడించుకుంటే మరీ వెగటు రాకుండా పచ్చి బీట్‌రూట్‌ని తినొచ్చు. అలాగే నారింజ, ఆపిల్‌లాంటి పండ్లతో కలిపి జ్యూస్‌లా చేసుకుని తాగినా మరిన్ని పోషకాలు శరీరానికి అందుతాయి. కాస్త ఉడికించి మిక్సీ పడితే ఇడ్లీలు, దోశల పిండిలో కలుపుకొని లాగించొచ్చు. అలాగే కొబ్బరి తురుము, కొంచెం ఆవాలు, కరివేపాకు నూనెలో వేసి తరిగిన బీట్‌రూట్ ముక్కలు కూడా జోడించి స్టిర్‌ఫ్రై చేసి కూడా నేరుగా తినొచ్చు. పరాఠాల్లో స్టఫింగ్ కోసం ఆలూ బదులు బీట్‌రూట్ వాడొచ్చు.

## వ్యాక్స్ వద్దు..

ఇప్పుడు చాలామంది ముఖంపై అవాంఛిత రోమాలతో బాధపడుతున్నారు. హార్మోన్లలో లోపాలు, ఇతర ఆరోగ్య కారణాలతో.. ఈ సమస్యబారిన పడుతున్నారు. వీటిని తొలగించుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది 'వ్యాక్స్' చేయించుకుంటున్నారు. అయితే.. వ్యాక్సింగ్ అనేది అన్నివేళలా మంచిదికాదని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. చర్మ తత్వాన్ని బట్టి వ్యాక్సింగ్‌ను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం అనేక సౌందర్య ఉత్పత్తుల సంస్థలు 'వ్యాక్స్ స్ట్రిప్స్'ను అందిస్తున్నాయి. అయితే, ఇవి సున్నితమైన చర్మం ఉన్నవారిలో తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తాయట. వ్యాక్సింగ్ వల్ల చర్మంపై దద్దుర్లు రావడం, ఎర్రగా మారడం, ముడతలు పడటంతోపాటు చర్మం మరింత సున్నితంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తద్వారా ఎండలోకి వెళ్లినప్పుడు ముఖమంతా కందిపోవడం, ర్యాషెస్ వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు. కాబట్టి బయట దొరికే ఫేషియల్ వ్యాక్స్, ఇంట్లో తయారుచేసుకున్న ప్యాక్స్ వేసుకునే ముందు.. చర్మ తత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. దేన్నయినా ముఖంపై అప్లయి చేసుకునే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మేలని సలహా ఇస్తున్నారు.



# అతిగా నిద్రిస్తున్నారా? అయితే ఈ రోగాలకు వెల్కమ్ చెప్పినట్టే



అధిక నిద్ర.. ఇది పెద్ద అనారోగ్య సమస్య. దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితులతో అతి నిద్రకు అవినాభావ సంబంధం ఉంది. అధిక నిద్ర మధుమేహం మరియు రక్తపోటు సమస్యలను పెంచుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ నిద్రపోయిన, కావలసినంత నిద్ర పోకపోయినా కూడా అనారోగ్యం వెంటాడుతోందని హెచ్చరిస్తున్నారు.
అతి నిద్రతో అనారోగ్య సమస్యలు చాలామంది ఎక్కువ సేపు నిద్ర పోవటం మంచిదని భావించి తరచూ నిద్ర పోవటంపైనే శ్రద్ధ చూపిస్తారు. నిద్ర అవసరం అయినప్పటికీ, ఎక్కువగా నిద్ర పోవటం హానికరంగా ఉండవచ్చు. ఈ ప్రమాదాలను నివారించడానికి నిపుణులు సరైన నిద్ర షెడ్యూల్ అలవాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. అతి నిద్ర తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని పరిశోధనలు చూపుతున్నాయి.
అతి నిద్రతో మధుమేహం, రక్తపోటు సమస్యలు మధుమేహం మరియు రక్తపోటు సమస్యలు అతిగా నిద్రపోయే వారిలో కచ్చితంగా వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధులు భారతదేశంలో లక్షలాది మందిని ప్రభావితం చేస్తూ మన ఆరోగ్యాన్ని సవాల్ చేస్తున్నాయి. ప్రతీరోజూ ఏడు నుండి ఎనిమిది గంటల పాటు నిద్ర పోతే మంచిది కానీ ఎప్పటికీ తొమ్మిది గంటల కంటే ఎక్కువగా నిద్రించడం సమస్యలకు హేతువుగా మారుతుంది.
అధిక నిద్రతో మెటబాలిక్ మార్పులు ఈ నమూనా శరీరంలోని సహజ రిథమ్స్‌ను భంగం చేస్తుంది, మెటబాలిక్ మార్పులకు దారితీస్తుంది. ఇటువంటి అంతరాయాలు దీర్ఘకాలిక వ్యాధులను అభివృద్ధి చేసే ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ఎక్కువగా నిద్ర పోకూడదని, రాత్రికి ఏడు నుండి ఎనిమిది గంటల నిద్రను లక్ష్యంగా పెట్టుకోవాలని సలహా ఇస్తున్నారు. ఈ పరిధి ఆప్టిమల్ ఆరోగ్యాన్ని మద్దతు ఇస్తుంది.
నిద్ర విషయంలో స్థిరమైన సమయం పైన దృష్టి దీర్ఘకాలిక అనారోగ్య పరిస్థితుల సంభావ్యతను తగ్గిస్తుంది. క్రమబద్ధంగా నిద్ర అలవాటు మొత్తం శ్రేయస్సు మరియు శక్తి స్థాయిలను మెరుగుపరుస్తుంది. అధిక నిద్రను ఎదుర్కోవడం జీవనశైలి మార్పులను కలిగి ఉంటుంది. కనుక వ్యక్తులు స్థిరమైన సమయం పైన దృష్టి పెట్టాలి. పడుకునే ముందు స్క్రీన్ సమయాన్ని పరిమితం చేయడం, పడుకునే ముందు మనసుకు ఆహ్లాదం కలిగించే సంగీతాన్ని ఆస్వాదించటం వంటి చర్యలు సౌకర్యవంతమైన నిద్ర వాతావరణాన్ని నిర్ధారిస్తాయి. కనుక నిద్రను కూడా ఒక క్రమ పద్ధతిలో పోవటానికి ప్రాధాన్యతను ఇవ్వాలి.

# ఆస్తమాతో అనర్థం!



ఆస్తమా.. మనదేశంలో అత్యంత ప్రబలంగా ఉన్న దీర్ఘకాలిక సమస్యల్లో ఒకటి. ఊపిరితిత్తులపై ప్రభావం చూపే ఈ మాయదారి వ్యాధి.. మహిళలకూ ఇబ్బందికరంగా పరిణమిస్తున్నది. ముఖ్యంగా, వారి పునరుత్పత్తిపై ప్రభావం చూపుతున్నది. సంతానోత్పత్తి తగ్గడం, గర్భధారణ సమస్యలకు కారణం అవుతున్నది. మనదేశంలో ఏటా 3.7 కోట్ల మంది ఉబ్బసం బారిన పడుతున్నారు. వారిలో.. నగర, నగర శివారు ప్రాంతాల్లో నివసించే మహిళలే ఎక్కువగా ఉంటున్నారు. సాధారణ మహిళలతో పోలిస్తే.. ఆస్తమా బాధితులు గర్భం దాల్చడంలో ఇబ్బంది పడుతున్నట్లు న్యూఢిల్లీలోని 'ఆల్ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' చెబుతున్నది. అంతర్జాతీయంగా నిర్వహించిన అనేక పరిశోధనలు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఉబ్బసం వ్యాధిగ్రస్తుల్లో తక్కువ ఆక్సిజన్ స్థాయులు, ఇన్‌ఫ్లమేషన్, ఇతర సమస్యలు.. పునరుత్పత్తి ప్రక్రియకు ప్రధాన అడ్డంకులుగా గుర్తించాయి. వీరిలో గైనిక్ సమస్యలు, అధిక ఒత్తిడి, నిద్రలేమి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇవన్నీ.. వారు గర్భం దాల్చడాన్ని మరింత కష్టతరం చేస్తున్నాయి. ఉబ్బసం బాధితుల్లో పునరుత్పత్తి అవయవాలకు ఆక్సిజన్ ప్రవాహం తగ్గుతుందనీ, తద్వారా అండాల నాణ్యతతోపాటు గర్భాశయ ఆరోగ్యంపైనా ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు ప్రధాన కారణాలను వివరిస్తూ.. మనదేశంలో ఆస్తమాను చాలామంది నిర్లక్ష్యం చేస్తుంటారు. దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలను సాధారణంగానే చూస్తారు. వైద్య సహాయం తీసుకోవడానికి ఇష్టపడరు. దోమల మందులు, అగరుబత్తీలు, వంటగదిలో వాయు కాలుష్యం వంటివి.. బాధితులను మరింత ఇబ్బంది పెడతాయి. ఈ క్రమంలో గర్భధారణ కోసం చూసే ఆస్తమా బాధితులు.. కొన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కొందరు ఉబ్బసం నుంచి ఉపశమనం కలిగిన వెంటనే మందులను ఆపేస్తారు. అది ఏమాత్రం మంచిదికాదు. వైద్యులు సూచించినన్ని రోజులు మందులు వాడాల్సిందే! ఆస్తమా రోగుల్లో అలర్జీలకు కొన్ని ఆహార పదార్థాలు కారణం అవుతాయి. అలాంటి వాటిని పక్కన పెట్టడమే మంచిది. లేకుంటే.. అవి సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. కాలుష్యం, పొగ, దుమ్ముకు దూరంగా ఉండాలి. బయటికి వెళ్లేటప్పుడు మాస్క్ ఉపయోగించాలి. ప్రాణాయామం లాంటి యోగాసనాలు ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో ముందుంటాయి. కాబట్టి, యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి.

# మార్కెట్

## చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం.. సోషల్ మీడియా ద్వారా యూజర్లు ఫిర్యాదు

ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌బాట్ చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యూజర్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. చాట్‌బాట్‌ను ఓపెన్ చేస్తుంటే.. ఎర్రర్ మెసేజ్‌లు వస్తున్నాయి. చాట్ హిస్టరీ లోడ్ అవ్వట్లేదు. దీనిపై యూజర్లు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. భారత్ సహా ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని యూజర్లు ఈ సమస్యలు ఎదుర్కొన్నారు. దాదాపు 82 శాతం మంది యూజర్లు చాట్‌జీపీటీ సేవలు పొందలేకపోతున్నారు. మొబైల్ యాప్, వెబ్ రెండింటిలోనూ ఈ సమస్యను ఎదుర్కొన్నట్లు యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అంతేకాదు లాగిన్, నెట్‌వర్క్ ఎర్రర్, యాప్ సంబంధిత ఇతర సమస్యలు కూడా ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేస్తున్నారు. తాజా సమస్యపై 'ఓపెన్‌ఏఐ (%ూజూవఅూ×%)' సంస్థ స్పందించింది. సమస్యను గుర్తించామని, దాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. చాట్‌జీపీటీ రికార్డ్ మోడ్, సోరా, కోడెక్స్ వంటి సేవల్లో అంతరాయం ఉన్నట్లు తెలిపింది.




# క్రెడిట్‌కార్డులు తెగ వాడేస్తున్నారు..! తక్కువ వేతనాలు కారణమట..!

దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది తొలి ప్రథమార్థంలో దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన లావాదేవీలు 15శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెప్పాయి. ఇ–కామర్స్, ఫుడ్ డెలివరీతో పాటు ఇతర అవసరాల కోసం క్రెడిట్‌కార్డుల వినియోగం పెరిగినట్లు భావిస్తున్నారు. బ్యాంకులు సైతం ఈఎంఐ ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, రివార్డ్ పాయింట్ల పేరుతో ఆఫర్లు సైతం ఇస్తున్నాయి. తాజాగా ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు క్రెడిట్‌కార్డులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లు పేర్కొంది. థింక్ 360 ఏఐ అధ్యయనం ప్రకారం.. నెలకు రూ.50వేల కంటే తక్కువ జీతం ఉన్న వారిలో 93శాతం మంది క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లు చెప్పింది. అదే సమయంలో స్వయం ఉపాధి పొందుతున్న 85శాతం మంది సైతం క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లుగా అధ్యయనం వెల్లడించింది. ఇప్పుడు పే తర్వాత (బీఎన్‌పీఎల్) సేవలను 18శాతం స్వయం ఉపాధి, వేతన జీవులు 15శాతం మంది ఉపయోగిస్తున్నట్లు డేటా పేర్కొంది. ఈ అధ్యయనం రూ.20వేల మంది ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులపై నిర్వహించింది. ఈ సందర్భంగా థింక్ 360 ఏఐ ఫౌండర్, సీఈవో అమిత్ దాస్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న భారతదేశ క్రెడిట్ ల్యాండ్ స్కేప్‌లో క్రెడిట్‌కార్డులు, బీఎన్‌పీఎల్ ఇప్పుడు వేతన




జీవులతో పాటు ఉపాధి పొందుతున్న వారికి ప్రతీ ఒక్కరికీ అవసరంగా మారాయన్నారు. పెరుగుతున్న ఫిన్ టెక్ కంపెనీలు డిజిటల్ లోన్ రెవల్యూషన్‌ను తీసుకువచ్చాయన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీలు రూ.92వేల కోట్లకుపైగా వ్యక్తిగత రుణాలు ఇచ్చాయి. ఇది మొత్తం రుణాల సంఖ్యలో 76శాతం ఉన్నట్లుగా సూచిస్తుందని పేర్కొన్నారు.

# గోర్మే పాప్‌కార్నికా సంస్థను సందర్శించిన ఉపరాష్ట్రపతి

### విత్తనాలు, పరిశోధనశాలలను పరిశీలించిన సి.పి రాధాకృష్ణన్

ఏలూరు, ఆగస్టు 24 : ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ గోర్మే పాప్‌కార్నికా సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థలో చేపడుతున్న నాన్-జీఎంఓ మొక్కజొన్న వంగడాల అభివృద్ధి, విత్తనాల ఉత్పత్తి, పరిశోధన, నాణ్యతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు. సంస్థలోని మొక్కజొన్న విత్తనాల విభాగంతో పాటు విత్తనాల పరిశోధనశాలను ఉపరాష్ట్రపతి సందర్శించి, అక్కడ జరుగుతున్న పరిశోధనా కార్యక్రమాలను ఆసక్తిగా పరిశీలించారు. నాన్-జీఎంఓ మొక్కజొన్న వంగడాల అభివృద్ధి, వాటి ప్రత్యేకతలు, రైతులకు అందించే ప్రయోజనాలు, విత్తనాల నాణ్యతా ప్రమాణాలపై సంస్థ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోర్మే పాప్‌కార్నికా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.పి.పి.పట్టాభి రామారావు సంస్థ కార్యకలాపాలు, నాన్-జీఎంఓ మొక్కజొన్న వంగడాల అభివృద్ధి, విత్తన పరిశోధన, ఉత్పత్తి విధానాలు తదితర అంశాలపై ఉపరాష్ట్రపతికి వివరించారు. ఈ మొక్కజొన్న వంగడాల అభివృద్ధి ద్వారా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వ్యవసాయ రంగంలో పరిశోధన, సాంకేతికతకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. మొక్కజొన్న సాగులో ఆధునిక పరిశోధనా విధానాలను అనుసరిస్తూ అధిక నాణ్యత కలిగిన విత్తనాల అభివృద్ధికి సంస్థ కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉపరాష్ట్రపతి బ్యాటరీ కారులో ప్రయాణించి కార్యక్రమం నిర్వహించే వేదిక వద్దకు చేరుకున్నారు. అంతకుముందు భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్‌కు అధికారులు,మంత్రులు, ప్రజాప్రతినిధులు, గోర్మే పాప్‌కార్నికా సంస్థ ప్రతినిధుల నుండి ఘన స్వాగతం లభించింది. ముసునూరులోని గోర్మే పాప్‌కార్నికా సంస్థ ప్రాంగణానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి సి. పి . రాధాకృష్ణన్ కు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు , రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేష్, రాష్ట్ర సమాచార శాఖ, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చం నాయుడు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఏలూరు రేంజ్ ఐజిపి జీవీజీ అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, గోర్మే పాప్‌కార్నికా సంస్థ యాజమాన్య ప్రతినిధులు, తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

# డేటా ఆధారిత పాలన మరింత బలోపేతం

### ఆర్‌టి.జిఎస్‌పై సిఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి,ఆగస్ట్24 : డేటా ఆధారిత పాలనను మరింత బలోపేతం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన రియల్ టైమ్ గవర్నెన్స్ పై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. అలాగే సచివాలయంలో మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. డేటా, ఎఐ తదితర అంశాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. 'మన మిత్ర' సేవలపై చర్చించారు. ప్లాట్‌ఫామ్ పని తీరును కూడా సీఎం చంద్రబాబు సమీక్షించారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. ఆస్పత్రుల డేటా విశ్లేషణపై ఆ శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్లు, రీ-సర్వే అంశాలపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.రేషన్ పంపిణీ డేటా విశ్లేషణపై అధికారులతో చర్చించారు. రెవెన్యూ, విద్య, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారుల హాజరయ్యారు.

## కడప ఏరియాలో క్రిటకల్ మినరల్స్

### గనుల శాఖ మంత్రి రవీంద్ర వెల్లడి

అమరావతి,ఆగస్ట్24 : కడప ఏరియాలో లక్షల కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సిఎస్ఐఆర్, ఎన్‌జిఆర్‌తో ఏపీ ప్రభుత్వం చారిత్రాత్మక ఒప్పందం చేసుకుందన్నారు. క్రిటికల్ మినరల్స్ వెలికితీత ఒప్పందం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. ముఖ్యంగా భవిష్యత్తు పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, సెమీకండక్టర్లు, రక్షణ రంగాలకు అత్యంత అవసరమైన లిథియం, గాలియం వంటి క్రిటికల్ మినరల్స్‌పై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఈ సంస్థల కీలక ఒప్పందం కుదిరింది. ఆగస్టు 12వ తేదీన అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ, ఎన్జీఆర్ఐ ప్రతినిధులు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, భూగర్భ నిర్మాణాలపై ఆధునిక జియోఫిజికల్ సాంకేతికత వినియోగం ఈ ఒప్పందంలో ప్రధానంగా ఉన్నాయి.

# వైసీపీ హయాంలో రూ.3,500 కోట్ల లిక్కర్ స్కామ్

### మద్యం పాలసీని మార్చి వేల కోట్ల రూపాయల దోపిడీ

### మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపణ

అమరావతి,ఆగస్ట్24 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో మద్యం కుంభకోణం జరిగిందని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. సుమారు రూ.3,500 కోట్ల లిక్కర్ స్కామ్ జరిగిందని ఆయన పేర్కొన్నారు. మద్యం పాలసీని మార్చి వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. మద్యం తయారీ, రవాణా, హోలోగ్రామ్‌ల వ్యవహారాల్లో అక్రమంగా డబ్బులు సంపాదించి, వాటిని రహస్య ప్రాంతాల్లో దాచుకున్నారని మంత్రి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుంటే.. రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరిస్తూ ఎదురుదాడికి దిగుతున్నారని విమర్శించారు.ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన ఆర్థిక ప్రయోజనాల కోసమే మద్యం పాలసీని రూపొందించారని విమర్శించారు. చేసిన అవినీతి, అక్రమాల నుంచి తప్పించుకునేందుకు కులాలు, మతాలను అడ్డుపెట్టుకుంటున్నారని పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్ కసిరెడ్డి వంటి సలహాదారుల సహకారంతో ఈ విధానాన్ని రూపొందించారని ఆయన ఆరోపించారు. బలహీన వర్గాలకు చెందిన నాయకులను మద్యం వ్యవహారంలో పావులుగా ఉపయోగించుకుని, చివరకు వారినే బాధ్యులను చేశారని వ్యాఖ్యానించారు.మద్యం వ్యాపారం ద్వారా వచ్చిన అక్రమ సొమ్మును విదేశాల్లో మైనింగ్, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాల్లోకి మళ్లించారని పార్థసారథి ఆరోపించారు. తమపై కేసులు నమోదైతే కోర్టులపై నమ్మకం లేదంటూ, రాజకీయ కక్ష సాధింపుగా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం బ్రాండ్లను రాష్ట్రంలోకి తీసుకువచ్చి ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగించారని మంత్రి ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో కారుమూరి నాగేశ్వరరావు కూడా ఇరుక్కున్నారని ఆయన పేర్కొన్నారు. మద్యం రవాణా ఛార్జీల విషయంలోనూ అక్రమాలు జరిగాయని పార్థసారథి ఆరోపించారు. గతంలో రూ.13గా ఉన్న ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీని ప్రభుత్వ మద్దతుతో రూ.35కు పెంచుకుని సుమారు రూ.400 కోట్ల మేర అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. మద్యం వ్యాపారం, రవాణా కాంట్రాక్టులకు సంబంధించిన విషయాలను కారుమూరి కుటుంబ సభ్యులే అంగీకరించారని మంత్రి పేర్కొన్నారు. మద్యం ద్వారా వచ్చిన అక్రమ సొమ్మును కుటుంబ సభ్యులు, సంస్థలతో పాటు మహిళల బ్యాంకు ఖాతాల్లోకి కూడా మళ్లించారని ఆరోపించారు.

# కొత్త మొక్కజొన్న వంగడం ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి

### విదేశీ హైబ్రిడ్ విత్తనాల వాడకాన్ని తగ్గించుకోవాలి

### స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

### రైతులను సూచించిన రాధాకృష్ణన్

### సిఎం చంద్రబాబు, గవర్నర్ నజీర్ హాజరు



ముసునూరు, ఆగష్టు, 24 : ఏలూరు జిల్లా ముసునూరులో గోర్మే పాప్‌కార్నికా సంస్థ ఆధ్వర్యంలో జన్యుపరంగా మార్పు చేయని (నాన్-జీఎంఓ) మొక్కజొన్న వంగడాన్ని భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తో కలిసి ఆవిష్కరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన కార్యక్రమంను జ్యోతి ప్రజ్వలనతో ఉప రాష్ట్రపతి చేయగా, వందేమాతరం, జనగణమన జాతీయ గీతాలు, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ మాట్లాడుతూ విదేశీ హైబ్రిడ్ విత్తనాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత మరియు స్వయం సమృద్ధిని సాధించడం అత్యంత కీలకమైన అంశం అన్నారు. భారతదేశం భవిష్యత్తులో పాప్‌కార్న్ దిగుమతి చేసుకోకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోందని ప్రశంసలు అందుతున్నాయన్నారు. దేశ జీడీపీ, స్థూల విలువ జోడింపు లో వ్యవసాయ రంగం సుమారు 1/5వ వంతు వాటాను కలిగి ఉండటమే కాకుండా, 46.1% మందికి ఉపాధిని, 55% జనాభాకు జీవనాధారాన్ని అందిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందన్నారు. ఈ క్రమంలో 8 రాష్ట్రాల్లో దాదాపు 17,500 మంది రైతులు 40,000 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, ఎటువంటి అప్పుల ఊబిలో పడకుండా మంచి లాభాలు అర్జిస్తున్నారన్నారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-కిసాన్, పీఎం ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు మహిళా సంఘాలకు ఆధునిక సాంకేతికతను జోడించే 'నమో డ్రోన్ దీదీ' వంటి పథకాలు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయన్నారు. అదే సమయంలో, వ్యవసాయాభివృద్ధికి సీఎం చంద్రబాబు రైతు బజార్లు, సహజ వ్యవసాయం వంటి విధానాల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. దీనికితోడు భవిష్యత్ వ్యవసాయ సమృద్ధి కోసం దక్షిణ భారత నదుల అనుసంధానం మరియు అన్ని జిల్లాలకు సమగ్ర సాగునీటి సౌకర్యాల కల్పన అత్యంత ఆవశ్యకమని స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ముసునూరులో దేశంలోనే మొట్టమొదటి నాణ్యమైన, నాన్-జీఎమ్ఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాలను ఆవిష్కరించడం మరియు 8 రాష్ట్రాల ఉత్తమ రైతులకు సన్మానం చేయడం సంతోషకరమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు రైతాంగమే వెన్నెముక అని, 140 కోట్ల మందికి అన్నం పెడుతూ 45 శాతం మందికి వ్యవసాయ రంగం ఉపాధి కల్పిస్తోందని గుర్తుచేశారు. వరి, గోధుమల తర్వాత మొక్కజొన్న దేశంలో 3వ అతిపెద్ద పంటగా నిలుస్తోందని, ఎల్-నినో వంటి వాతావరణ సవాళ్లను తట్టుకునేలా పరిశోధనలు మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భారతీయ వాతావరణానికి అనువైన హైబ్రిడ్ విత్తనాలను అభివృద్ధి చేసి, ఐసీఏఆర్ ప్రశంసలు పొందిన 'గౌర్మెట్ పాప్‌కార్నికా' సంస్థను అభినందించారు. ఈ సంస్థ 8 రాష్ట్రాల్లోని 17,500 మందికి పైగా రైతులతో 39,500 ఎకరాల్లో సాగు చేస్తూ, గతంలో అర్జెంటీనా, బ్రెజిల్‌లకు వెళ్లే ఆదాయంలో 70 శాతం నేరుగా మన భారతీయ రైతులకు దక్కేలా చేస్తోందని, తద్వారా 100 మిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేస్తోందని కొనియాడారు. అరకు కాఫీ లాగే ఈ పాప్‌కార్న్ కూడా ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా ఎదగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. భవిష్యత్తు కూడా మారుతుంది. దేశం అంతా నదుల అనుసంధానం జరిగి నీటి సద్వినియోగం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన. గోదావరి- కృష్ణా, తుంగభద్ర, పెన్నా- కావేరీ నదులను అనుసంధానించటం ద్వారా 4 రాష్ట్రాల్లో సమస్య పరిష్కారం అవుతుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్, రాష్ట్ర సమాచార శాఖ, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చం నాయుడు, గోర్మే పాప్‌కార్నికా సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర బాబు, మహీధర్ రెడ్డి, యుగంధర్, ప్రిఫర్డ్ పాప్ కార్న్ సీఈఓ నార్మ్ కూర్గ్, ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో విశేష సేవలందించిన రైతులను ఉప రాష్ట్రపతి ఘనంగా సన్మానించగా, అతిథులను దుశ్శాలువా, కొండపల్లి బొమ్మలతో గోర్మే పాప్‌కార్నికా సంస్థ ప్రతినిధులు సన్మానించారు.

## జూట్ కార్మికులకు నిరుద్యోగ భృతి వెంటనే ఇప్పించాలి

### -విజయవాడలో ఇ.ఎస్.ఐ. రీజనల్ డైరెక్టర్ ని కలిసిన ఐ.ఎఫ్.టి.యు. బృందం

ఏలూరు, ఆగస్టు 24 : శాశ్వతంగా మూసివేసిన ఏలూరు, కొత్తూరు జూట్ మిల్లుల కార్మికులకు ఇ.ఎస్.ఐ. ద్వారా రావాల్సిన నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలని కోరుతూ ఐ.ఎఫ్.టి.యు. ఆధ్వర్యంలో జూట్ కార్మికులు విజయవాడ వెళ్లి ఇ.ఎస్.ఐ. రీజినల్ డైరెక్టర్ ప్రణవ కుమార్‌కి, డిప్యూటీ డైరెక్టర్ ప్రతాప్ కి వినతి పత్రం సమర్పించారు. రెండు జూట్ మిల్లులు శాశ్వతంగా మూసివేయడంతో ఉపాధి కోల్పోయి, రోడ్డున పడ్డ 4 వేలకు మందికి పైగా జూట్ కార్మికులకు ఇ.ఎస్.ఐ. ద్వారా రావాల్సిన నిరుద్యోగ భృతి త్వరగా ఇప్పించాల్సిందిగా కోరారు. మిల్లులు మూసి వేయడం వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతూ, తీవ్ర నిరాశ నిస్పృహలలో ఉన్నారనీ, నిరుద్యోగ భృతి వస్తే కొంత ఊరట లభిస్తుందనీ, అందుకే ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని వివరించారు. ఇప్పటికే నిరుద్యోగ భృతి చెల్లింపులు ప్రారంభించిన కొత్తూరు కార్మికులకు మిగతా వారికి వెంటనే చెల్లించే ఏర్పాటు చేయాలనీ, అలాగే ఇంతవరకూ ప్రారంభించని ఏలూరు మిల్లు కార్మికులకు కూడా వెంటనే నిరుద్యోగ భృతి చెల్లింపులు ప్రారంభించాలని వినతి పత్రం లో కోరారు. రీజనల్ డైరెక్టర్ ప్రణవ కుమార్ స్పందిస్తూ కొత్తూరు జూట్ కార్మికులకు సంబంధించి తమకు అందిన 470 దరఖాస్తులలో ఇప్పటికే 250 మందికి చెల్లించామనీ, మరో 50 మందికి ఇప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. మిగతా 170 దరఖాస్తులు పరిశీలన జరుగుతున్నాయనీ, పూర్తికాగానే త్వరలోనే వారికి కూడా నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పారు. కొత్తూరు కార్మికులు సుమారు 1000 మంది ఉన్నారని కార్మిక నాయకులు తెలియజేయగా, వారి దరఖాస్తులు అందగానే పరిశీలించి వారికి కూడా చెల్లిస్తామని చెప్పారు. ఏలూరు మిల్లు కార్మికులకు సంబంధించిన దరఖాస్తులు ఆలస్యంగా అందినందున ఢిల్లీలోని ఉన్నతాధికారులకు నివేదించామనీ, వారి నుండి నిర్దిష్టమైన ఆదేశాలు రాగానే ఏలూరు మిల్లు కార్మికులకు కూడా చెల్లిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర అధ్యక్షులు కె.పోలారి, ఏలూరు నగర ఐ.ఎఫ్.టి.యు అధ్యక్షులు బి. సోమయ్య, ఏలూరు, కొత్తూరు జూట్ మిల్లుల కార్మికులు కోసూరి నూకరాజు, కొంపంగి కృష్ణ,బగాది రమణ, ఎం .వెంకటేశ్వరరావు, సత్తిబాబు, త్రినాథ రావు, దయాకర శ్రీను.వి.వెంకట్రావు(టైలర్). తదితరులు పాల్గొన్నారు

## సుబాబుల్, యూకలిప్టస్ రైతులకు జీఎస్‌టీ రాయితీ కల్పించాలి

### - కేంద్ర మంత్రులకు లంకా దినకర్ విజ్ఞప్తి

అమరావతి, ఆగస్టు 24 : ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ భూముల్లో సుబాబుల్, జమాయిల్ వంటి అగ్రో-ఫారెస్ట్రీ పంటలను సాగు చేస్తున్న రైతులకు జీఎస్‌టీ నుంచి తగిన రాయితీ కల్పించాలని ఆంధ్రప్రదేశ్‌ఒత్వ ఇరవై సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కి, కేంద్ర టెక్స్‌టైల్స్, వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ వేదప్రకాశ్ గోయల్ కి వేర్వేరుగా లేఖలు రాశారు. వెస్ట్ వుడ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ , ఇతర ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు సమర్పించిన వినతిపత్రం ఆధారంగా ఈ అంశాన్ని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు తమ స్వంత వ్యవసాయ భూముల్లో శ్రమ, పెట్టుబడి, వనరులను వినియోగించి సుబాబుల్, యూకలిప్టస్ వంటి అగ్రో-ఫారెస్ట్రీ పంటలను సాగు చేస్తున్నారని ఎఫ్‌పీఓ లు తమ వినతిపత్రంలో పేర్కొన్నాయి. ఈ పంటలను ప్రధానంగా పేపర్, పల్ప్ పరిశ్రమలకు ముడి పదార్థంగా సరఫరా చేస్తున్నారని, అగ్రో-ఫారెస్ట్రీ ద్వారా పర్యావరణ పరిరక్షణ, నేల సారవంతత, చెట్ల పెంపకం వంటి ప్రయోజనాలు కూడా కలుగుతున్నాయని వివరించాయి.ప్రస్తుతం సుబాబుల్, యూకలిప్టస్ నుంచి లభించే వుడ్ పల్ప్‌కు 18 శాతం జీఎస్‌టీ విధించబడుతోందని పేర్కొన్నాయి. మరోవైపు దిగుమతి చేసుకునే వుడ్ మెటీరియల్ తక్కువ పన్ను భారంతో అందుబాటులో ఉండటంతో దేశీయ రైతుల నుంచి ముడి కలప కొనుగోలు పట్ల పేపర్ పరిశ్రమల్లో ఆసక్తి తగ్గుతోందని, ఫలితంగా రైతుల వద్ద నిల్వలు పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వినతిపత్రంలో వివరించారు.రైతుల ఆదాయం, అగ్రో-ఫారెస్ట్రీ ప్రోత్సాహం, దేశీయ పేపర్ పరిశ్రమ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను పరిశీలించాల్సిన అవసరం ఉందని లంకా దినకర్ పేర్కొన్నారు. ప్రస్తుత జీఎస్‌టీ భారం వల్ల రైతులకు లభించే నికర ఆదాయం తగ్గుతోందని, అగ్రో-ఫారెస్ట్రీ కొనసాగించేందుకు రైతుల్లో నిరుత్సాహం ఏర్పడే అవకాశం ఉందని ఎఫ్‌పీఓలు ఆందోళన వ్యక్తం చేశాయి.

# ఎఐ కుటుంబంపై మాతమార్పిడి కోసం ఒత్తడి

### సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు

### రెండు వేర్వేరు సూసైడ్ లేఖలు స్వాధీనం

### జిల్లా ఎస్సీ బిందుమాధవ్ వెల్లడి

కాకినాడ,ఆగస్ట్24 : ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ రెండింటిలోనూ రైఫిల్ షూటింగ్ కోచ్ సాధిక్‌ఖాన్ వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొనడంతో అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరిలో దూకారు. రియాన్స్ ప్రాణాలతో బయటపడగా మిగిలిన ముగ్గురు మృతిచెందారు. రాజమహేంద్రవరంలో తొలుత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. నూకరాజు వద్ద, సౌజన్య స్కూటీలో రెండు సూసైడ్ నోట్‌లు దొరికాయి. మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడని ఎస్పీ వెల్లడించాడు. ఆమె మామ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పీఎస్‌లో కేసు నమోదు చేయగా, నిందితుడు సాధిక్‌ఖాన్ కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 10 పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లోగాలింపు చేపట్టామని అన్నారు. చివరికి యూపీలోని మేరఠ్‌లో అతడి ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేశాం. స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారంట్‌పై కాకినాడ తీసుకొచ్చామన్నారు. నూకరాజు కుటుంబం ఆత్మహత్య తర్వాత పరారై మేరఠ్ చేరుకున్న సాధిక్.. స్నేహితులకు మాయమాటలు చెప్పి ఆశ్రయం పొందాడు. ఫోన్, డబ్బు పోయినట్లు వారికి చెప్పాడు. అతడిపై వస్తోన్న మరికొన్ని ఆరోపణలపై విచారణ జరుగుతోంది. నిర్ధారణ అయ్యాక ఆ వివరాలు వెల్లడిస్తాం. హత్య, బలవంతపు మతమార్పిడి సెక్షన్ల కింద సాధిక్‌పై కేసులు నమోదు చేశామన్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తాం. కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతాం. కస్టడీలో ప్రశ్నిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి. సామూహిక ఆత్మహత్య ఘటనకు ముందు బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు అండగా ఉంటారు. క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఎస్పీ కోరారు. సాధిక్‌ఖాన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం కాకినాడ సబ్‌జైలుకు సాధిక్‌ఖాన్‌ను తరలించారు. నిందితుడిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ సర్పవరం పోలీసులు కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.

# యువతే దేశ భవిష్యత్‌కు కీలకం

### 20వేల మంది యువతతో మాటామంతీ: కోటంరెడ్డి

నెల్లూరు,ఆగస్ట్24 : స్వామి వివేకానంద, శ్రీశ్రీ చెప్పినట్టు యువత పాత్రే దేశానికి కీలకమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నేడు యువత.. దేశ భవిష్యత్తు కోసం ఆలోచిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులన్న తేడా లేకుండా యువత రాజకీయ నాయకులను ప్రశ్నిస్తోందని.. ఇది మంచి నిర్ణయమని.. దీన్ని తాను కూడా స్వాగతిస్తున్నట్లు చెప్పారు. 20 వేల మంది జెన్‌జీ యువతతో 55 రోజుల పాటు 51 చోట్ల మాటామంతి నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళవారం ఉదయం నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ, ఏపీ ముఖ్యమంత్రి.. దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలపై చర్చ నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ఎన్నో వ్యయప్రయాసలతో ఆంధప్రదేశ్ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిపై చర్చ ఉంటుందన్నారు. యువత ఉద్యోగాలకు సంబంధించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. సీఎం చంద్రబాబు ముందు చూపుతో తీసుకొచ్చిన కంప్యూటర్ వలనే ఉద్యోగాలు వస్తున్నాయని తెలిపారు. మాటామంతి కార్యక్రమంలో బహిరంగంగా మాట్లాడలేని వారికి ఫోన్ నంబర్, మెయిల్ ఐడి ద్వారా తనతో చర్చించవచ్చని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.

## ఛాంపియన్ షిప్ వేడుకల్లో అపశృతి

### హోంమత్రి అనితకు డ్రోన్ తాకి స్వల్ప గాయం

తిరుపతి,ఆగస్ట్24 : అమరావతి ఛాంపియన్‌షిప్ ప్రారంభ వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. . బ్యాటరీ ఛార్జింగ్ తగ్గిపోవడంతో డ్రోన్ కిందపడిపోయింది. హోంమంత్రి వంగలపూడి అనితపై డ్రోన్ కూలింది. దీంతో మంత్రి కుడి చెయ్యిపై స్వల్ప గాయమైంది. వెంటనే అప్రమత్తమైన వైద్య సిబ్బంది.. అనితకు చికిత్స అందజేశారు. ఒక్కసారిగా డ్రోన్ కూలడంతో కొద్దిసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది.

# కాకినాడ బీచ్‌లో ఇద్దరు యువకుల గల్లంతి

### ఆందోళన వ్యక్తం చేసిన డిప్యూటి సిఎం పవన్


అమరావతి,ఆగస్ట్24 : కాకినాడలోని గుర్రాల బీచ్ వద్ద అలల ఉధృతి కారణంగా ఇద్దరు యువకుల గల్లంతుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. యువకుల గల్లంతుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీ నుంచి వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, ప్రత్యేక రెస్క్యూ బృందాలు, మెరైన్ పోలీసు, కోస్టు గార్డుతో పాటు స్థానిక మత్స్యకార సమూహాల సహకారాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. వారి కుటుంబాలకు అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీకి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఆదివారం నలుగురు స్నేహితులు వీరబాబు, శ్రీగణేశ్ సాయిరాం, యువ కిశోర్, ఆదిత్య వెంకట సందీప్‌కుమార్ కలిసి కాకినాడాలోని గుర్రాల బీచ్‌కు వెళ్లారు. ఎవరూ లేని ప్రదేశంలో నలుగురు కలిసి సముద్రంలో స్నానానికి వెళ్లగా అలల ఉధృతికి యువ కిశోర్, వీరబాబు గల్లంతయ్యారు. మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గల్లంతైన ఇద్దరికి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



# రాకాలో ఐశ్వర్యలక్ష్మి

నెగెటివ్ షేడ్ అంటూ ప్రచారం


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆమె పాత్రలో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతుండగా, త్వరలోనే ఐశ్వర్య లక్ష్మి కూడా షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకే సినిమాలో పలువురు ప్రముఖ హీరోయిన్లు భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే ఈ నటీనటుల పాత్రలపై చిత్రబృందం నుంచి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'రాకా' కథ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది.




# 80 కోట్ల మార్క్ దాటిన ఇరుముడి

రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బ్లాక్‌బస్టర్ హిట్‌గా రికార్డులు సృష్టిస్తోంది. తమిళంలో ఈ సినిమాకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా చెన్నైలో జరిగిన ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణం ఈ నగరంలోనే ప్రారంభమైందని తెలిపారు. 'ఇరుముడి'కి జీవీ ప్రకాశ్ హృదయంతో సమానం. ఎడిట్ రూమ్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (నేపథ్య సంగీతం) లేకుండా చూసినప్పుడే.. ఇది విజయం సాధిస్తుందని అర్థమైంది. ÷-లకైమాక్స్ చూసిన తర్వాత థియేటర్‌లలో మగవారితో పాటు చిన్న పిల్లలు కూడా భావోద్వేగానికి గురవుతున్నారు. ఆ దృశ్యాలు నిజంగా హృదయాన్ని హత్తుకుంటున్నాయి' అని రవితేజ అన్నారు. ప్రియా భవానీ శంకర్ గొప్ప నటి అని ప్రశంసించారు. ఈ సినిమా తెలుగులో విజయం సాధించినట్లే.. తమిళంలోనూ కచ్చితంగా సూపర్ హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.'ఇరుముడి' చిత్రానికి ఓవర్సీస్‌లోనూ మంచి స్పందన వస్తోంది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుని రికార్డు సృష్టించింది. ఈ క్లబ్‌లో చేరిన రవితేజ మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఇక మూడు రోజుల్లోనే ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.80 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది.




# మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్ర పరిచయం

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించనున్న చిత్రం 'మహాకాళి' సినిమాకు పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శు క్రాచార్యుడి పాత్రను పరిచయం చేస్తూ 'శుక్రాచార్య వార్ క్రై' అనే క్యాప్షన్‌తో ఓ పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఇందులో శ్రియా రెడ్డి మహాకాళిగా నటించారు. వచ్చే ఏడాది జనవరి 8న ఈ సినిమా విడుదల కానున్నట్లు టీమ్ తెలిపింది. 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. 'మహాకాళి' గ్లింప్స్‌తో గూస్‌బంప్స్.. శుక్రాచార్యుడి వార్ క్రైతో పాన్ ఇండియా సంచలనం! 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది.





# వారణాసిపై మరో సంచలన వార్త

## వివిధ భాషల కోసం 1600 మంది డబ్బింగ్ అర్టిస్ట్‌లు

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాదాపు రూ.1,400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది.'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో, 50కి పైగా అంతర్జాతీయ, ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత భారీ స్థాయిలో సినిమాను వివిధ భాషల్లోకి తీసుకెళ్లే విషయంలో రాజమౌళి ప్రత్యేకమైన విధానాన్ని ఎంచుకున్నారట. ప్రస్తుతం సినిమాల డబ్బింగ్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం పెరుగుతోంది. అయితే 'వారణాసి' విషయంలో మాత్రం రాజమౌళి ఈ విధానానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నటీనటుల గొంతులోని సహజత్వం, భావోద్వేగాలు, డైలాగ్ డెలివరీలోని తీవ్రత ప్రతి భాషలోనూ ప్రేక్షకులకు సరిగ్గా చేరాలంటే స్థానిక ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులే కీలకమని రాజమౌళి భావిస్తున్నారట. అందుకే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. ఆయా భాషలకు సంబంధించిన ఉచ్చారణ, స్థానిక యాస, సంస్కృతికి అనుగుణంగా డైలాగ్స్‌ను రికార్డ్ చేయనున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు, ప్రియాంక చోప్రా వంటి ప్రధాన నటుల నటనలోని ఎమోషన్ ఏ భాషలో చూసినా ప్రేక్షకులకు సహజంగా అనిపించేలా ఈ డబ్బింగ్ పక్రియను డిజైన్ చేస్తున్నారట. 50కి పైగా భాషల్లో ఇంత భారీ సంఖ్యలో డబ్బింగ్ ఆర్టిస్టులతో పనిచేయడం భారతీయ సినిమా స్థాయిలో అరుదైన ప్రయత్నంగా మారనుంది. వారణాసి కథాంశం కూడా అత్యంత ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. భూమిని ఢీకొట్టేందుకు దూసుకొస్తున్న ఓ భారీ ఉల్క వల్ల ఏర్పడే ప్రమాదం నుంచి వారణాసితో పాటు ప్రపంచాన్ని రక్షించే సాహసోపేతమైన కథతో ఈ సినిమా సాగుతుందని సమాచారం.

# ఇది ముమ్మాటికీ రాజకీయమే : పూనమ్ కపూర్

చిక్కడ పల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం.. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడం.. హైకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేయడం.. రాత్రంతా బన్నీ జైల్లోనే ఉండటం అందరికీ తెలిసిందే. శనివారం ఉదయమే బన్నీని జైలు నుంచి విడుదల చేశారు. ఇక సెలెబ్రిటీలు అయితే బన్నీకి అండగా నిలిచారు. టాలీవుడ్ మొత్తం కదిలివచ్చింది. అల్లు అర్జున్ కోసం బాలీవుడ్ స్టార్లు కూడా మాట్లాడి మద్దతు తెలిపారు. ఇక సోషల్ మీడియాలో బన్నీ అరెస్ట్ మీద భిన్న వాదనలు అయితే వినిపించాయి. స్టార్ అయితే ఏంటి? నేషనల్ అవార్డు విన్నర్ అయితే ఏంటి? చట్టం ముందు అందరూ సమానులే.. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది అని కొందరు అన్నారు. ఇక రేవంత్ రెడ్డి కక్ష్య సాధింపు చర్యలు అంటూ ప్రతి పక్షాలు మండిపడ్డాయి. ఈ హడావిడిలో పూనమ్ కౌర్ కూడా కొన్ని సెటైర్లు వేసింది. అల్లు అర్జున్ ఫోటోలను షేర్ చేస్తూ.. నా ఫేవరేట్ హీరో అని చెప్పింది. ఇక తాజాగా మరో ట్వీట్ వేసింది. ఇందులో అధికారాన్ని దుర్వినియోగం చేయడమే రాజకీయం.. ఆ అధికారాన్ని ప్రజల అభివృద్ధికి వాడటమే నాయకత్వం అంటూ కౌంటర్ వేసింది. అంటే రేవంత్ రెడ్డి తన పవర్‌ను మిస్ యూజ్ చేస్తున్నాడని, రాజకీయాలు చేస్తున్నాడని పూనమ్ కౌర్ చెప్పకనే చెబుతూ కౌంటర్లు వేసింది. అల్లు అర్జున్ మాత్రం బయటకు వచ్చి మీడియాతో మాట్లాడుతూ.. చట్టపరిధిలో ఈ కేసు ఉందని, భారత న్యాయ వ్యవస్థ మీద తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ కేసు గురించి తాను బయట మాట్లాడను అని చెప్పేసి వెళ్లిపోయాడు. మరి నెక్స్ట్ బన్నీ ఎలాంటి స్టెప్ తీసుకుంటాడో చూడాలి. నాలుగు వారాల అనంతరం ఈ కేసులో ఏ ట్విస్టులు చోటు చేసుకుంటాయో చూడాలి.

# విడుదలకు ముందే టాక్సిస్ రికార్డులు

యశ్ కథానాయకుడిగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్: ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఆగస్టు 21న ప్రారంభమైన బుకింగ్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తుండటంతో.. విడుదలకు ముందే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. తాజా ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం తొలి రోజు కోసం భారత్‌లో డైరెక్ట్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ.21.5 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇప్పటి వరకు 13,591 షోలకు గాను దాదాపు 5.55 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఇక హోల్డ్‌లో ఉంచిన సీట్లతో కలిపి చూస్తే ఈ మొత్తం ఏకంగా రూ.30.14 కోట్లు దాటాయని ట్రేడ్ వర్గాల చెబుతున్నాయి. ముఖ్యంగా హోమ్ స్టేట్ కర్ణాటకలో ఈ సినిమా బుకింగ్స్ అగ్రస్థానంలో కొనసాగుతు న్నాయి. అక్కడ ఇప్పటికే రూ.10 కోట్లకు పైగా వసూళ్లు నమోదైనట్లు వార్తలు వస్తున్నాయి. పాన్-ఇండియా స్థాయిలోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'టాక్సిక్' మేనియా కనిపిస్తోంది. హిందీ బెల్ట్‌లో ఇప్పటికే రూ. 7.35 కోట్లకు పైగా బుకింగ్స్ జరగగా, నార్త్ అమెరికా (యూఎస్) ప్రీమియర్ బుకింగ్స్ ద్వారా 1.63 లక్షల డాలర్ల (రూ.1.56కోట్లు) వసూళ్లు వచ్చాయి. విదేశాల్లో ఈ సినిమా 260 లొకేషన్లలో, 709 ప్రాంతాల్లో రిలీజ్‌కానుంది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com

# గుమ్మడిదల అభివృద్ధికి సంపూర్ణ సహకారం..

● అభివృద్ధి కార్యక్రమాలు నిరంతర ప్రక్రియ.. ● ప్రజల అవసరాలకు అనుగుణంగానే అభివృద్ధి ప్రణాళికలు.. ● అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం అభినందనీయం ● ఒక కోటి 69 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ● ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**సంగారెడ్డి జిల్లా(ది క్రైమ్ న్యూస్):** నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని పటాన్ చేరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లిలో న్యూల్యాండ్ పరిశ్రమ సహకారంతో 86 లక్షల 50 వేల రూపాయలతో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు, వీరన్న గూడెంలో 15 లక్షల సిఆర్ఆర్ నిధులతో అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు, గుమ్మడిదల లో హానర్ ల్యాబ్స్, మైత్రి పరిశ్రమల సౌజన్యంతో 45 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, యూజీడీల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు అనంతరం నాగిరెడ్డిగూడెం గ్రామంలో న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో 22 లక్షల రూపాయలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా అభివృద్ధి పనులను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులు బలోపేతం చేయడం ద్వారా ప్రతి కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. గుమ్మడిదల ప్రాంత అభివృద్ధిలో పరిశ్రమల యాజమాన్యాలు, పారిశ్రామిక సంస్థలు సామాజిక బాధ్యతతో భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు పరిశ్రమల సహకారం కూడా అందితే అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గుమ్మడిదల మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేసి, ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి







**ధర్మపురి, ఆగస్టు 24, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నాగారం గ్రామంలో ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధుల ద్వారా సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు పెద్ద పీట వేస్తుందని ఉచిత బస్సు ప్రయాణం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే విధంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, నూతన మహిళా సంఘ భవనం నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానిక మహిళా సంఘాల కార్యకలాపాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి అన్నారు. అనంతరం కమలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ధర్మపురి మండలంలోని గాదెపెల్లి గ్రామంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. ఎం. జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధుల ద్వారా సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మహిళా సంఘ భవనాన్ని, రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం అందుబాటులోకి రావడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి సూచించారు. గాదెపెల్లి గ్రామానికి అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

- యువతే దేశ భవిష్యత్తు.. జెన్ జడ్ ప్రశ్నలకు తీన్మార్ మల్లన్న సూటి సమాధానాలు - విద్య, వైద్య రంగాలకు 40 శాతం బడ్జెట్ కేటాయించాలి - అందరికీ ఉచిత విద్య అందించడమే లక్ష్యం - రిజర్వేషన్లు పోవాలంటే ముందుగా కుల వ్యవస్థ పోవాలి - సెప్టెంబర్ 17 నుంచి 14 వేల కిలోమీటర్ల పాదయాత్ర - ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పనగట్ల చక్రపాణి గౌడ్





**మేడ్చల్ ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):** యువతే దేశ భవిష్యత్తు అని, యువత ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. అన్యాయాలపై గళమెత్తాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బంధారపు నర్సయ్య గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు పానగట్ల చక్రపాణి గౌడ్, రాష్ట్ర యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ మైదానంలో నిర్వహించిన 'జెన్ జీ అడ్డా విత్ మల్లన్న' కార్యక్రమానికి తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది విద్యార్థులు కార్యక్రమానికి హాజరై విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్‌లు, రాజకీయాలు తదితర అంశాలపై ప్రశ్నలు సంధించారు. విద్యార్థుల ప్రశ్నలకు మల్లన్న సూటిగా సమాధానాలు ఇచ్చారు. సోషల్ మీడియా యుగంలో జనరేషన్ జెడ్ దేశ రాజకీయ దిశను మార్చగల శక్తిగా ఎదుగుతోందని మల్లన్న అన్నారు. ప్రజల కంటే ఎక్కువగా ప్రశ్నించే యువతను చూసి నేటి రాజకీయ నాయకులు భయపడుతున్నారని విమర్శించారు. యువత తమ హక్కుల కోసం ప్రశ్నించాలని, అన్యాయాలపై పోరాడాలని సూచించారు. విద్యా రంగానికి తెలంగాణలో తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని మల్లన్న విమర్శించారు. విద్య, వైద్య రంగాలకు కలిపి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 40 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మొదటి తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ప్రతి విద్యార్థికి పూర్తిగా ఉచిత విద్య అందించడమే తమ విధానమని తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని అన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేయడానికి గల కారణాలను విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మల్లన్న వివరించారు. రాష్ట్రంలో నిరుద్యోగులు, ఆకలితో బాధపడుతున్న వారి లెక్కలు ఎందుకు లేవని ప్రశ్నించినందుకే తనపై చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వాన్ని నిలదీయడం తన బాధ్యతగా భావిస్తానన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల సమస్యలపై స్పందిస్తూ సరైన మౌలిక వసతులు కల్పించకుండా విద్యాసంస్థలను స్కిల్ ఇండియా యూనివర్సిటీ పరిధిలో విలీనం చేయడం సరికాదన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు వారి ఉద్యమాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై మాట్లాడుతూ సమాజంలో కుల వివక్ష కొనసాగుతున్నంతకాలం రిజర్వేషన్లు అవసరమేనన్నారు. రిజర్వేషన్లు తొలగించాలనే వారు ముందుగా కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడాలని సూచించారు. సమాజంలో సంపూర్ణ సామాజిక సమానత్వం ఏర్పడినప్పుడే రిజర్వేషన్లపై చర్చించే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని మల్లన్న అన్నారు. దాదాపు రూ.9 వేల కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థుల తరఫున ఈ అంశంపై గట్టిగా పోరాడతానని హామీ ఇచ్చారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని తీన్మార్ మల్లన్న ప్రకటించారు. ఉప్పల్ నియోజకవర్గం నుంచి తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరఫున పానగట్ల చక్రపాణి గౌడ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని వెల్లడించారు. సెప్టెంబర్ 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 14 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి రాజ్యాధికారం సాధించే దిశగా ప్రజల్లోకి వెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పానగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాజ్యాధికారం సాధించే వరకు పనిచేస్తానని పేర్కొన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎన్నికల గుర్తు 'కత్తెర' అని మల్లన్న గుర్తుచేశారు. ప్రజల జీవితాలను దోచుకుంటున్న అవినీతి శక్తుల తోకలు కత్తిరించడానికే కత్తెర గుర్తును ఎంచుకున్నామని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ నుంచి ఉద్యమాల వరకు పోరాడతామని, యువత భవిష్యత్తు కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమం అనంతరం వివిధ కళాశాలలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, కళాశాలల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన హత్య కేసులో నిందితుడు దొమ్మరి రాజుకు రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని పదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. నిందితుడికి రూ.20 వేల జరిమానా కూడా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఎ. ముత్యంరెడ్డి, డీసీపీ, క్రైమ్స్, సైబరాబాద్ వివరాల ప్రకారం 2021 సెప్టెంబర్ 5న మీడింటి మాణెమ్మ తన కుమార్తె మీడింటి సువర్ణ కనిపించడం లేదని నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విశాల్ మార్ట్‌లో గృహ నిర్వహణ సిబ్బందిగా పనిచేసే సువర్ణ సెప్టెంబర్ 4న విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించగా విద్యుత్ వ్యాలీ లేఅవుట్‌లో ఆమె మృతదేహం గాయాలతో కనిపించింది. ఆమెకు సంబంధించిన వస్తువులు కూడా కనిపించకుండా పోయాయి. దర్యాప్తులో సువర్ణకు దొమ్మరి రాజుతో సన్నిహిత సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నేరస్థలానికి నిందితుడు, సువర్ణ కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. విచారణలో వాగ్వాదం నేపథ్యంలో సువర్ణపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌ను తీసుకుని, ఆధారాలను మాయం చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. కాల్ వివరాల ఆధారంగా నిందితుడి కదలికలను పోలీసులు నిర్ధారించారు. మృతదేహానికి నిర్వహించిన శవపరీక్షలో ఊపిరాడకుండా చేయడం, గొంతు నులిమివేయడం, ఛాతీపై బలమైన దెబ్బల కారణంగా మృతి చెందినట్లు నిర్ధారణ అయింది. నిందితుడిని 2021 సెప్టెంబర్ 22న పోలీసులు అరెస్టు చేసి, దర్యాప్తు పూర్తయిన అనంతరం న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసును పూర్తిస్థాయిలో విచారించిన రాజేంద్రనగర్ పదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. ఈ కేసులో నార్సింగి పోలీస్‌స్టేషన్ దర్యాప్తు అధికారి, ఇన్‌స్పెక్టర్ వి. శివకుమార్, ప్రభుత్వ న్యాయవాది పి. కృష్ణమూర్తి నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా కృషి చేశారు.

## మార్తాండ్ నగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మార్తాండ్ నగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ్ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కాలనీ వాసులు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వివేకానంద నగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ మార్తాండ్ నగర్ అభివృద్ధికి ఆరెకపూడి గాంధీ విశేష కృషి చేశారని, కాలనీలో పలు మౌలిక వసతులు కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం కాలనీలో మంచి నీటి సరఫరాను మరింత మెరుగుపరచాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన భూగర్భ డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కాలనీ వాసుల సమస్యలను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సానుకూలంగా విని, మార్తాండ్ నగర్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. కాలనీలో వరద నీటి కాల్వ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో మంచి నీటి పైప్‌లైన్ పనులను పునరుద్ధరించి, మెరుగైన తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని జలమండలి అధికారులను ఆదేశించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని చెప్పారు. మార్తాండ్ నగర్ కాలనీతో పాటు కొండాపూర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ ముదిరాజు, శ్రీనివాస్ చౌదరి, తిరుపతి, భగత్ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.


## విస్తృత స్థాయిలో జలసిరి కార్యక్రమం అమలు చేయాలి

### డిప్యూటీ సీఈఓ ఆకుల సంజీవ రావు



**రామగిరి, ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):-** ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో అమలు చేయాలని డిప్యూటీ సీఈఓ ఆకుల సంజీవ రావు అన్నారు. సోమవారం రామగిరి మండల పరిషత్ కార్యాలయం నందు "జలసిరి " పనుల పురోగతి పైన డిప్యూటీ సీఈఓ ఆకుల సంజీవ రావు,రామగిరి ఎంపీడీఓ శైలజరాణిలు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ లతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ ఆకుల సంజీవ రావు మాట్లాడుతూ, ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో వీబీజీ-రామ్ జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు విస్తృతంగా చేపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాలని సూచించారు.ప్రతి గ్రామంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించి జలసిరి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి నీటి చుక్కను సంరక్షించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామ పంచాయతీ పరిధిలలో రైతుల పొలాల్లో ఇండివిడ్యువాల్ ఫారం పాండ్స్, ప్రభుత్వ స్థలాల్లో కమ్యూనిటీ ఫారం పాండ్స్ నిర్మించాచాలని, ప్రభుత్వ కార్యాలయాలలో కమ్యూనిటీ సోకే పీట్స్, ప్రతీ ఇంటికి మ్యాజిక్ సోక్ పిట్ నిర్మాణం చేయాలనీ అందుకు సంభందించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజరాణి, ఎంపీవో సమ్మిరెడ్డి, సూపరింటెండెంట్ ఉమేష్, టీఏ లు అఖిల, సుప్రియ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి మండల స్థాయి ప్రజావాణి



**రామగిరి, ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలంలోని మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఈఓ ఆకుల సంజీవరావు, ఎంపీడీవో శైలజ రాణి , తహసీల్దార్ సుమన్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజల నుంచి మొత్తం రెండు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని అధికారులు పేర్కొన్నారు. ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ఇన్‌చార్జి అధికారులు పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ బిక్ష కాదు.. విద్యార్థుల హక్కు...

## ● బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

**కరీంనగర్ టౌన్, ఆగస్టు24(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. ఇందులో భాగంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాదులో ఆగస్టు 24, 25 తేదీల్లో చేపడుతున్న రెండు రోజుల నిరాహార దీక్షకు సంఘీభావంగా కరీంనగర్ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజున కరీంనగర్ బస్టాండ్ అవుట్ గేట్ ఎదురుగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసన దీక్ష చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయి ల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులు అర్థాంతరంగా ఆగిపోయే ప్రమాదం ఏర్పడిందని మండిపడ్డారు. కాలేజీ యాజమాన్యాలు ఫీజుల చెల్లింపు కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తుండటంతో సర్టిఫికెట్లు అందక, పరీక్షలకు హాజరుకాక విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని, అది విద్యార్థుల హక్కు అని , ప్రభుత్వం తక్షణమే స్పందించి పేరుకుపోయిన బకాయిలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "విద్యార్థుల హక్కుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడి బకాయిలను విడుదల చేయకపోతే, రాబోయే రోజుల్లో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి , ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, అడిచెర్ల రాజు , అవదుర్తి శ్రీనివాస్, కార్పొరేటర్




కొమురయ్య , నాయకులు పెద్దపల్లి జితేందర్, గుంజేటి శివ , సుధాకర్ పటేల్, వెంకటేష్ మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ లు ఫీజు రియంబర్స్మెంట్ వైఖరి పట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని తప్పు పట్టారు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా తక్షణమే రూ.12 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి,కన్నా కృష్ణ ,సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు ,జిల్లా కార్యదర్శి సిహెచ్ నరసింహరాజు, చేపూరి సత్యం మీడియా కన్వీనర్ కటకం లోకేష్ మండల అధ్యక్షులు మడిశెట్టి సంతోష్, కంది రాజిరెడ్డి ,చింతం శ్రీనివాస్ ,తనకు సాయికృష్ణ, పాదం శివరాజ్, కార్పొరేటర్ లు బండ రమణ రెడ్డి, దేశీ శిల్పా పెద్దపల్లి శ్రీలేఖ ,తాటి ప్రభావతి మాసం గణేష్ ,భూపతి రవీందర్, తోట అనిల్. టీంకు, ఒంటెల సత్యనారాయణ రెడ్డి ,మహిళా మోర్చఅధ్యక్షులు గుర్రాల నిర్మల రెడ్డి, ఎస్టి మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మోతే గంగారెడ్డి , వెంకట్ రెడ్డి, ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆడి చెర్ల రాజు రమేష్ దూలం కిరణ్, ఆవుల తిరుపతి, రవి ప్రసాద్ గుర్రం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పీస్ కమిటీ సమావేశంలో పోలీసు నిబంధనలపై సీపీ దిశానిర్దేశం

### రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, పోలీసు అధికారులు

### సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా, పటిష్ట భద్రతకు ఆదేశం





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మీలాద్-ఉన్-నబీ పండుగ వేళ రామగుండం కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల మత పెద్దలు, పోలీసు అధికారులతో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ వివరాలు వెల్లడిస్తూ జూలూసులు, ర్యాలీలు నిర్వహించే వేళ నిబంధనలు పాటించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. సౌండ్ సిస్టమ్‌లు, డీజేలపై పరిమితులు విధిస్తూ ఇతర వర్గాల మనోభావాలను గౌరవించాలని కోరారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, పుకార్లు సృష్టించి మత ఘర్షణలకు తావిచ్చే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఏ అంశంపైనైనా సందేహాలుంటే స్థానిక పోలీసులను ఆశ్రయించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె.శ్రీనివాస్, ఏసీపీలు నాగేంద్ర గౌడ్, ఆర్.ప్రకాష్, సీఐలు ప్రవీణ్ కుమార్, కృష్ణ కుమార్, శ్రీనివాసరావు, భీమేష్, ఆర్ఐ రమేష్, ఎస్ఐలు నరేష్ కుమార్, చంద్రశేఖర్, శ్యామ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు

### రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, అదనపు డీసీపీ కె.శ్రీనివాస్

### పోలీస్ కమిషనరేట్‌లో గ్రీవెన్స్ డే నిర్వహణ.. బాధితులకు భరోసా



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ఎటువంటి అలసత్వానికి తావు ఇవ్వకూడదని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల అర్జీదారుల కోసం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అర్జీలను స్వీకరించి, బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్ పాల్గొన్నారుద

## నేను సైతం 2.0లో భాగంగా 103 సీసీ కెమెరాల ఏర్పాటు



**మేడ్చల్ ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):** మహిళలు, బాలికలు, ప్రజల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 'నేను సైతం 2.0' కార్యక్రమంలో భాగంగా వివిధ కాలనీల్లో 103 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ పి. ఉషారాణి ముఖ్య అతిథిగా హాజరై కెమెరాల ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోనియా గాంధీ నగర్ కాలనీ, లక్ష్మీ నరసింహ నగర్, నవోదయ నగర్, మహేష్ నగర్, సైనికపురి, శ్రీరామ్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో మొత్తం 103 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఆయా ప్రాంతాల్లో నేరాల నియంత్రణతో పాటు మహిళలు, బాలికల భద్రతను పర్యవేక్షించేందుకు అవకాశం కలుగుతుంది. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెట్టడంతో పాటు ఏదైనా నేరం జరిగినప్పుడు దర్యాప్తునకు అవసరమైన ఆధారాలను సేకరించడంలో కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని పోలీసులు తెలిపారు. ప్రజల భద్రతను మరింత మెరుగుపరిచేందుకు పోలీసులతో పాటు స్థానిక ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాలు, ఇతర భాగస్వామ్య వర్గాలు ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించడం అభినందనీయమని డీసీపీ పి. ఉషారాణి తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఇలాంటి భద్రతా చర్యలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత: వి. జగదీశ్వర్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** :ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ ప్రాధాన్యత అని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను ఆయన వివరించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి, శ్మశానవాటికల అభివృద్ధి తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలపై సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, ప్రతి సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తామని జగదీశ్వర్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ గౌడ్, మన్నేపల్లి సాంబశివ రావు, కావూరి ప్రసాద్, పట్వారీ శశిధర్, రాజేష్, కటారి వెంకట్, సయ్యద్ తహేర్ హుస్సేన్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం



**మేడ్చల్ ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):** ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులనుపెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖలు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు, పెండింగ్ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉందని తెలిపారు. భూ సమస్యలు, రెవెన్యూ, పింఛన్లు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించి ప్రజలు వినతులు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 75 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి, నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో జాప్యం జరిగితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## అన్నదాతకు సన్మానం చేసిన మంత్రి



**రామగిరి,ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన మాదాసు రవీందర్ సుజాతలను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం ఘనంగా సన్మానించారు. శ్రీ ఆదివారః స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి వద్ద నాలుగు రోజులపాటు రవీందర్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు రవీందర్ దంపతు కు శాలువాతో సత్కరించి అభినందించారు. పుణ్యక్షేత్రాల్లో అన్నదానం చేయడం మహా పుణ్యమని అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందించాల్సిన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఈవో కాంత రెడ్డి, ఇనగంటి చిన్నారావు, పిల్లి శేఖర్, రెబల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# నాచారం డివిజన్‌లో రూ.46 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం



**మేడ్చల్ ఆగస్టు 24(ది క్రైమ్ న్యూస్ ):** నాచారం డివిజన్‌లో రూ.46 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం శ్రీకారం చుట్టారు. రామ్‌రెడ్డి నగర్‌లో గోల్డ్‌మ్యాన్ భద్రయ్య వీధితో పాటు ఇతర వీధుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను స్థానిక నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. నాచారంలోని పురాతన చిన్న పాఠశాల భవనం నాలుగేళ్ల క్రితం భారీ వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరింది. దీంతో అప్పటి కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ చొరవతో భవనాన్ని కూల్చివేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న స్థలంలో నూతన భవనం నిర్మించాలని జీహెచ్ఎంసీ అధికారులను పలుమార్లు కోరారు. ఎట్టకేలకు అక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరయ్యాయి. నాచారం డివిజన్‌లో రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాచారం అసిస్టెంట్ ఇంజనీర్ సూరజ్, పనుల పరిశీలకులు విజయ్ కుమార్, రామారావు, నాచారం, హెచ్ఎంటీ నగర్ డివిజన్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రామ్‌రెడ్డి నగర్ కాలనీవాసులు, నాచారం గ్రామస్తులు పాల్గొన్నారు.

## 43వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్, ఆగస్టు24(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగర పాలక సంస్థ 43వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలోని అన్నిడివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించేందుకు అవసరమైన అభివృద్ధి పనులనుదశలవారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులుకలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పనుల్లో నాణ్యతాప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకుఅందుబాటులోకితీసుకురావాలని సూచించారు.ఈకార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పొన్నం లక్ష్మి మొండయ్య గారు, కార్పొరేటర్లు తోట అనిల్,ఏపిపి చంద్ర , ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి: రవికుమార్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి రవికుమార్ యాదవ్ తరలివెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడిందన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో పలు ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు ధ్రువపత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. కొత్త ప్రవేశాలకు కూడా విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డు అమలు చేయడంలో విఫలమైందని రవికుమార్ యాదవ్ విమర్శించారు. విశ్వవిద్యాలయాలు, గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడం లేదన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు ఆహారం, భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సుమారు 150 ఆహార కలుషిత ఘటనల్లో 2,000 మందికి పైగా విద్యార్థులు ఆసుపత్రుల పాలయ్యారని, 40 మందికి పైగా మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు భరోసా కల్పించడంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి, విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రవికుమార్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ నాయకులు, పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.